రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★

కుల్దీప్‌సింగ్ సెంగార్‌కు ఎదురుదెబ్బ
రూపాయి మరింత పతనం
పశ్చిమాసియాలో శాంతికి భారత్ మద్దతు 07

సంపుటి 09, సంచిక: 166 | శనివారం | 16-05-2026 | ఖమ్మం   Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00



### డబ్బులు చెల్లించి
# అదానీ రాజీ

- అమెరికా కేసుల నుంచి బయటపడే అవకాశం
- సహకరించిన ట్రంప్ న్యాయవాది
- 18 మిలియన్ డాలర్లు చెల్లించేందుకు అంగీకారం
- తప్పొప్పుల ప్రస్తావన లేకుండానే రాజీ

**న్యూయార్క్/న్యూఢిల్లీ :** అమెరికా కోర్టు కేసులు, దర్యాప్తుల నుంచి బైటపడటానికి డబ్బు చెల్లించి రాజీ పడేందుకు భారతదేశానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అంబానీ అంగీకరించారు. తప్పు చేశామని లేదా చేయలేదని ఒప్పుకోవాల్సిన అవసరం లేకుండానే పరిష్కారం కుదిరింది. ఇప్పటికే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) తన సివిల్ కేసును పరిష్కరించుకోగా, న్యాయ శాఖ, ట్రెజరీ శాఖలు రాబోయే రోజుల్లో సమాంతర దర్యాప్తులను ముగించనునట్లు సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు 'పిటిఐ' పేర్కొంది. భారతదేశంలోని సోలార్ ప్రాజెక్టులకు సంబంధించి పెట్టుబడిదారులకు వివరాల వెల్లడితో ముడిపడి ఉన్న అదానీ, ఆయన సోదరుని కుమారుడు సాగర్ అదానీపై ఉన్న సివిల్ ఆరోపణలను యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ గురువారం పరిష్కరించింది. ఎలాంటి తప్పు చేశామనో లేదా చేయలేదనో చెప్పకుండానే గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు రికార్డులు చెబుతున్నాయి. దీని తరువాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగత న్యాయవాదులలో ఒకరైన సల్లివన్ క్రోమ్‌వెల్‌లో సీనియర్ భాగస్వామి రాబర్ట్ జె గియుఫ్రా జూనియర్ నేతృత్వంలోని విస్తృత న్యాయ బృందానికి, ప్రాసిక్యూటర్లకు మధ్య నెలల తరబడి జరిగిన సంప్రదింపుల అనంతరం, ఆ ఇద్దరిపై ఉన్న క్రిమినల్ అభియోగాలను ఉపసంహరించుకోవడానికి అమెరికా న్యాయ శాఖ సిద్ధమవుతోంది.
ఈ కేసును 2024 నవంబర్‌లో ఎస్ఇసి దాఖలు చేసింది. అలాగే సౌరశక్తి కాంట్రాక్టులను దక్కించుకునేందుకు భారతీయ అధికారులకు 265 మిలియన్ డాలర్ల తరువాయి 8లో



- లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 చొప్పున పెంపు
- దేశ రాజధాని ఢిల్లీలో రూ. 94.77కు చేరిన పెట్రోల్, 90.67కు పెరిగిన డీజిల్ ధరలు

# పెట్రో పిడుగు



**న్యూఢిల్లీ:** సామాన్యుడి నెత్తిన పెట్రో పిడుగు పడింది. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతుందని ప్రతిపక్షాలు ఘోషించినట్లుగానే జరిగింది. ఇటీవల వాణిజ్య సిలండర్ ధర రూ. 900లకుపైగా పెంచిన కేంద్రంలోని మోదీ సర్కార్ తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడిపై మరింత భారం మోపింది. శుక్రవారం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 3 చొప్పున పెంచారు. నాలుగేళ్లకు పైగా కాలంలో ఇదే మొదటి పెంపు. పెంచిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరిగిన ముడి చమురు ధరల వల్ల కలిగిన భారాన్ని ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లు వినియోగదారులపై మోపాయి. దీంతో పాటు, ఢిల్లీ, ముంబయి వంటి నగరాల్లో సిఎన్‌జి ధరలను కిలోకు రూ. 2 చొప్పున పెంచారు. తాజా పెంపుతో దేశ రాజధానిలో పెట్రోల్ ధరను లీటరుకు రూ. 94.77 నుంచి రూ. 97.77కు పెంచగా, డీజిల్ ధర గతంలో లీటరుకు రూ. 87.67 ఉండగా, ఇప్పుడు రూ. 90.67కు చేరిందని పరిశ్రమ తరువాయి 8లో

## అదానీ విడుదలకు బేరసారాలు

అమెరికాకు పూర్తి లబ్ధి చేకూర్చే వాణిజ్య ఒప్పందం : ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ విమర్శ



న్యూఢిల్లీ : కేసుల వల నుంచి గౌతమ్ అదానీని విడిపించేందుకే, అమెరికాకు పూర్తి లబ్ధి చేకూర్చే వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ సంతకం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గౌతమ్ అదానీని కేసుల నుంచి కాపాడేందుకు అమెరికాతో బేరసారాలు జరపడం ద్వారా రాజీపడిన ప్రధానిగా నరేంద్రమోదీ నిలిచారని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా, భారత్ మధ్య జరిగింది ట్రేడ్ డీల్ కాదని, అది బేరసారం మాత్రమేనని రాహుల్ మండిపడ్డారు. ఈ మేరకు హిందీలో ఆయన ఒక ట్వీట్ చేశారు. వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రతిపాదించినా, ప్రధాని మోదీ ఎందుకు అంగీకరించారో ఎట్టకేలకు తేటతెల్లమైందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అదానీని కేసుల నుంచి కాపాడేందుకే, అమెరికాకు మాత్రమే ప్రయోజనాన్ని కల్పించే వాణిజ్య ఒప్పందాన్ని మోదీ కుదుర్చుకున్నారని ఆయన ఆరోపించారు. దేశ ప్రయోజనాల కంటే అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్చరికలకే అధిక ప్రాధాన్యతను ఇచ్చి 2025 మే 10న ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ అకస్మాత్తుగా ఆపేశారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఇప్పుడు మోదానీపై ఉన్న అన్ని అభియోగాలను ఎత్తివేసేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోందనే కథనాలు వస్తున్నాయని జైరాం రమేశ్ చెప్పారు. దేశ ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తి ఇంకా ఎంతగా రాజీపడగలరు అని ఆయన ప్రశ్నించారు.

## మోదీ తప్పులకు ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు

పెట్రో ధరల పెంపుపై కాంగ్రెస్ ఫైర్

పెట్రో ధరలు పెరగడంతో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. మోదీ ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఘల్తీ మోదీ సర్కార్ కీ, కీమత్ జనతా చుకాయేగీ (మోదీ ప్రభుత్వ తప్పుకు ప్రజలు మూల్యం చెల్లిస్తారు)' అని రాహుల్‌గాంధీ శుక్రవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. రూ.3 షాక్ ఇప్పటికే తగిలిందని, మిగిలిన 'వసూలీ' (వసూలు) వాయిదాలలో జరుగుతుందని ఆయన ప్రజలను హెచ్చరించారు. అలాగే ఇంధన ధరల పెంపుపై మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నాయకత్వ సంక్షోభం, దూరదృష్టి లేకపోవడం, అసమర్థత కారణంగానే దేశంలో ఆర్థిక సంక్షోభం తలెత్తిందని ఆయన ఆరోపించారు. ఈ సంక్షోభం ప్రభుత్వం సృష్టించినదేనని, దీని పర్యవసానాలను దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కోసం తమ సొంత జేబుల నుండి భరిస్తున్నారని ఖర్గే ఎక్స్‌లో మండిపడ్డారు. 'అంతర్జాతీయ ఇంధన సంక్షోభంతో పాటు, ఈ సమయంలో భారతదేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి ప్రధాన కారణం మోదీ తరువాయి 8లో

## పెట్రో ధర పెంపు తక్షణమే వెనక్కి

అదానీ–మోదీ అనైతిక పొత్తుకు మూల్యం చెల్లిస్తున్న ప్రజలు: సిపిఐ

ఎల్‌పిజి, పెట్రోల్, డీజిల్, సిఎన్‌జీ ధరలను పదే పదే పెంచడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది. తక్షణమే పెంచిన ధర తగ్గించాలని డిమాండ్ చేసింది. మోదీఅదానీ అనైతిక పొత్తుకు దేశ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో కోట్లాది మంది భారతీయులు మరింతగా ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని పేర్కొంది. ఇంధన ధర పెంచిన ప్రతిసారీ అది పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఒక పన్నుగా మారుతోందని సీపీఐ వ్యాఖ్యానించింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే రవాణా, ఆహారం, మందులు, వ్యవసాయోత్పత్తులు సహా ప్రతి నిత్యావసర వస్తువు ధర పెరుగుతుందని, ఈ భారం ఇంధన కేంద్రాలకే పరిమితం కాదని, వంటిల్లుపై పడుతుందని, ప్రతి ఇంటి బడ్జెట్ ప్రభావితం తరువాయి 8లో

### 2034 తర్వాత
# జాతీయ రాజకీయాల్లోకి



- అప్పటివరకు నేనే ముఖ్యమంత్రిని
- దేశ జిడిపిలో తెలంగాణ రాష్ట్రవాటా 10శాతం ఉండేలా కృషిచేస్తా
- బండి సంజయ్ తక్షణమే తన కుమారుడిని తీసుకురావాలి
- ఎలాంటి కేసులనైనా ఎదుర్కోవాలి
- వేటూ న్యూస్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్

" తెలంగాణ రాష్ట్రంలో 2034లో వరకూ తానే ముఖ్యమంత్రిగా ఉంటాను. దేశ జిడిపిలో తెలంగాణ రాష్ట్రం వాటా 10 శాతం ఉండేలా 2034 వరకు కృషి చేస్తాను. 2034 తర్వాత నేను ముఖ్యమంత్రిగా ఉండను. తర్వాత తరానికి అవకాశం ఇస్తానన్నారు. అప్పుడు తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్తాను" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని అన్నారు. రాహుల్‌గాంధీకి ప్రధాని కావాలనే కోరిక లేదని, ఆ పదవికి పోటీ పడాలని తానే ఒప్పించానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధేనని ఆయన ప్రకటించారు. తాను దేశానికి కూడా సేవలందిస్తానని, తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసి ఆయన ఇచ్చిన ఛైర్‌లో తాను కూర్చుంటానని సిఎం వెల్లడించారు. హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వే టు న్యూస్ కాన్‌క్లేవ్–2026లో సిఎం పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, మహిళా సాధికారత, విద్యా సంస్కరణలు, మూసీ ప్రక్షాళన, డ్రగ్స్ నియంత్రణ, రాజకీయాలు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు, కేంద్రంతో సంబంధాలు, చట్ట పరిపాలన వంటి అనేక కీలక అంశాలపై సుదీర్ఘంగా సిఎం మాట్లాడారు. తన ఫ్యూచర్‌ను డిసైడ్ చేసేది బిఆర్ఎస్ వారు కాదని ప్రజలు డిసైడ్ చేస్తారని, ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా సరే బిఆర్ఎస్ వారు ఇంకా తరువాయి 8లో

### పెట్రో ధరలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా
# నేడు సిపిఐ నిరసనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాపితంగా శనివారం అన్ని జిల్లా, మండల, గ్రామ, బస్తీ శాఖలలో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సాంబశివరావు కోరారు. కేంద్ర ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండర్లపై రూ.1000 పెంచిన నెల రోజుల లోపే తాజాగా పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్ పై రూ.3.14, పెంచడం ద్వారా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన బిజెపి సభలో దేశ ప్రధాని మోదీ పొదుపు మంత్రం జపించిన కొన్ని రోజులకే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని, తాజాగా పెంచిన పెట్రో ధరలతో నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలపై భారం పడనుందని పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు చమురు, గ్యాస్ నిల్వలు బాగా ఉన్నాయని, అమెరికా,ఇరాన్ యుద్ధం వల్ల భారతదేశానికి ఎలాంటి నష్టం లేదని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు ధరలను పెంచిందని ఆయన ప్రశ్నించారు.



## 26న కేరళకు రుతుపవనాలు

ఈ ఏడాది ముందస్తుగా ప్రవేశించే అవకాశం : ఐఎండి

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రానున్నాయి. ఈనెల 26వ తేదీన కేరళలో ప్రవేశించే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) శుక్రవారం తెలిపింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ ప్రజలకు ఉపశమనం కలగనుంది. ప్రధాన వర్షపాత వ్యవస్థ అయిన రుతుపవనాలు సాధారణంగా జూన్ 1వ తేదీన కేరళలోకి ప్రవేశించి, ఉత్తరం వైపుగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. రాష్ట్రంలో రుతుపవనాల ప్రవేశంతో నైరుతి రుతుపవన కాలం (జూన్ నుండి సెప్టెంబర్) ప్రారంభమవుతుంది. గత సంవత్సరం, రుతుపవనాల ప్రవేశం మే 24న జరిగింది. 'ఈ సంవత్సరం, నైరుతి రుతుపవనాలు 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉంది, అయితే నాలుగు రోజుల ముందు లేదా తర్వాత అటు, ఇటుగా ఉండవచ్చని ఐఎండి తెలిపింది. రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవులలోని తరువాయి 12లో

# జూన్ 21న మళ్లీ నీట్

- పరీక్ష వ్యవధి 15 నిమిషాలు పొడిగింపు
- వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష
- కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**న్యూఢిల్లీ :** వైద్య ప్రవేశ పరీక్ష నీట్ యూజి ఈనెల 3వ తేదీన జరిగింది. అయితే పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో పరీక్షను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 21వ తేదీన మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) శుక్రవారం ప్రకటించింది. కాగా, ఈ పరీక్షకు సంబంధించిన ఆరోపిత అవకతవకలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) సమగ్ర విచారణ చేపడుతుందని తెలిపింది. భారత ప్రభుత్వ ఆమోదంతో, తరువాయి 12లో




## నూతన లేబర్ కోడ్‌లు తెలంగాణలో అమలు చేయొద్దు


- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ విజ్ఞప్తి
- 8 గంటల పనిదినం, ట్రేడ్ యూనియన్లు, కనీస వేతన చట్టాన్ని బిజెపి సర్కార్ కాలరాస్తుందని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 నూతన లేబర్ కోడ్ కార్మికుల మెడకు ఉరితాడు లాంటిదని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన కోడ్‌లు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. గతంలో ఉద్యోగుల కనీస వేతనం రూ.26 వేలుగా ఉండాలని పోరాటాలు చేశామని, కానీ ఇప్పుడు అవి కూడా సరిపోవడంలేదన్నారు. ప్రస్తుతం పెరిగిన ఖర్చుల భారంతో ఒక కుటుంబం కనీస అవసరాలు తీరడానికి కనీస వేతనం రూ.31 వేలు ఉండాలని తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ రద్దు 44 కార్మిక చట్టాల అమలు'పై రాష్ట్ర సదస్సు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ హిమాయత్ నగర్ సత్యనారాయణరెడ్డి భవన్ లో జరిగింది. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో అమర్ జీత్ కౌర్, ఎఐటియుసి రాష్ట్ర ఇంచార్జి వి.ఎస్.బోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్ ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, ఎఐటియుసి ఎపి రాష్ట్ర అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్ జీత్ కౌర్ మాట్లాడుతూ 150 ఏళ్ల పాటు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తరువాయి 12లో

### జరగని ఒప్పందాలు
# ముగిసిన చర్చలు

- చర్చలు మైలురాయిగా నిలిచిపోతాయన్న అమెరికా, చైనా దేశాల అధ్యక్షులు
- అమెరికాను గొప్పగా తీర్చిదిద్దుతాం : ట్రంప్
- చైనా ప్రజలను జాతీయ పునరుజ్జీవనం వైపు నడిపిస్తాం : జిన్‌పింగ్



**బీజింగ్ :** తమ చర్చలు చారిత్రాత్మకమైనవని, మైలురాయిగా నిలిచిపోతాయని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం అభివర్ణించారు. ట్రంప్ అమెరికాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దాలని ఆశిస్తుండగా, తాను చైనా ప్రజలను జాతీయ పునరుజ్జీవనం వైపు నడిపించడానికి అంకితమైనట్లు జిన్‌పింగ్ తెలిపారు. సహకారాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారా ఇరు దేశాలు తమ తమ అభివృద్ధిని, పునరుజ్జీవనాన్ని ముందుకు తీసుకెళ్లగలవని ఆయన నొక్కిచెప్పినట్లు అధికారిక మీడియా తెలియజేసింది. వైట్ హౌస్ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఇంధన స్వేచ్ఛా ప్రవాహానికి మద్దతుగా హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచాలని ఇద్దరు నాయకులు అంగీకరించడంతో, ట్రంప్ సెప్టెంబర్ 24న జిన్‌పింగ్, ఆయన భార్యను వైట్ హౌస్‌కు ఆహ్వానించారు.అమెరికా అధ్యక్షుడు తన మూడు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించినప్పటికీ, ఏ వివాదాస్పద అంశాలపైనా ఎలాంటి ఒప్పందాలు ప్రకటించలేదు. ఇరాన్ యుద్ధం, ద్వైపాక్షిక వాణిజ్య ఘర్షణలతో సహా పలు ప్రపంచ సమస్యలపై అనేక దఫాలుగా చర్చలు జరిపిన ఇరు దేశాధ్యక్షులు బీజింగ్‌లోని అగ్ర నాయకులు నివసించే పటిష్టమైన భద్రత గల తరువాయి 12లో

# మరోసారి దగాపడిన రైతు

ఖరీఫ్ సీజన్ (2026–27) కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు కనీస మద్దతు ధరల(ఎంఎస్‌పి)ను ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతుల కష్టానికి తగిన ఫలితాన్ని అందించడంలో ప్రకటిత ఎంఎస్‌పి ధరలు ప్రతిఫలించలేదు. దక్షిణాది రాష్ట్రాలలో ప్రధాన పంట అయిన వరికి కేవలం మూడు శాతం, అంటే రూ.72 పెంచి చేతులు దులిపేసుకున్నారు. క్వింటాలు వరి మద్దతు ధర రూ.2,441కి, 'ఎ' గ్రేడ్ రకానికి రూ.2,461కు చేరింది.వరి ఉత్పత్తికి స్వామినాథన్ ఫార్ములా ప్రకారం ఎంఎస్‌పి రూ.3,243గా ఉండాలి. అంటే రైతు క్వింటాకు ఎనిమిది వందల రూపాయలు నష్టపోతున్నట్లే. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.500 బోనస్‌తో అది కొంత పూడుతోంది. కానీ, అది సన్న వడ్లకే పరిమితం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరికి రూ.3,000 ఎంఎస్‌పి ప్రకటించాలని చేసిన విజ్ఞప్తి అమలైనా కొంత వరకు వాస్తవికతకు దగ్గరగా ఉండేది. మరోవైపు సరైన కొనుగోలు లేక డీలా పడిన మొక్కజొన్నకు పెరిగింది 0.4 శాతమే. అత్యధికంగా హైబ్రీడ్ జొన్నలు 8.8 శాతం, మాల్దానీ రకం జొన్నలకు 8.6 శాతం పెంచారు. పత్తి పంటకు మాత్రం ఎంఎస్‌పిని రూ.7,771 నుంచి రూ.8,267కు పెంచారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయాలు, ధరల నిర్ణాయక కమిషన్ (సిఎసిపి) వివిధ పంటలకు సిఫార్సు చేసిన ఎంఎస్‌పిలకు యథాతథంగా కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చూసేందుకు ఇది బాగానే కనపబడుతున్నా, ధరల నిర్ణాయక కమిషన్ పంట ఉత్పత్తికి అయ్యే సకల ఖర్చులను లెక్కలోకి తీసుకోవడం లేదు. ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఎరువులు, ఇంధన ధరలు పెరగడంతో పంట ఉత్పత్తి ధరలు ఈసారి భారీగానే పెరిగే అవకాశం ఉంది. దీనిని ఎంఎస్‌పి నిర్ధారణలో పరిగణించలేదు.

డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్న రైతుల డిమాండ్‌ను కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. 2006లో కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం పంట ఉత్పత్తికి అయ్యే సమగ్ర ఖర్చు (కాంప్రెహెన్సివ్ కాస్ట్ ఆఫ్ క్రాప్ (C2))కు అదనంగా 50 శాతం జోడించి పంటకు కనీస మద్దతు ధరను నిర్ణయించాలి. కానీ, కేంద్ర ప్రభుత్వం వాస్తవ ఖర్చు (యాక్చువల్ పెయిడ్ కాస్ట్ (A2))కు కుటుంబ శ్రమ కలిపి, దానికి ఒకటిన్నర ఇంతలను ఎంఎస్‌పిగా నిర్ధారిస్తుంది. అంటే కేంద్రం ఫార్ములా A2+FLలో కేవలం విత్తనాలు, ఎరువులు, ఇంధనం,శ్రమకు ప్రత్యక్షంగా చెల్లించే వ్యయాన్ని మాత్రమే లెక్కిస్తారు. దీనికి 50 శాతం జోడిస్తారు. అదే స్వామినాథన్ కమిషన్ ఫార్ములా C2+50% లో భూమి అద్దె, పెట్టుబడిపై వడ్డీతో సహా ఇతర ఖర్చులు కూడా కలుస్తాయి. ఇందులో పంట ఉత్పత్తికి అయ్యే మొత్తం ఖర్చులు ఉంటాయి కాబట్టి రైతులకు మేలు చేసేదే. నల్ల చట్టాల రద్దు సహా, స్వామినాథన్ సిఫార్సుల అమలుకు రైతులు ఏడాదిపైగా రాజధాని సరిహద్దుల్లో చేసిన శాంతియుత ఉద్యమానికి బెంబేలెత్తిన ప్రధాని మోదీ వెనక్కితగ్గారు. అయితే స్వామినాథన్ కమిషన్ ఫార్ములా ఆధారంగా ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నేటికీ ఎండమావిగానే మిగిలింది.

నిజానికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని బిజెపి 2014 మ్యానిఫెస్టోలో పెట్టింది. దానికనుగుణంగా 2016లో 2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. గడువు దాటి నాలుగేళ్ళైనా ఆచరణలో మాత్రం కనబడడం లేదు. ఉదాహరణకు 2014–15లో వరికి ఎంఎస్‌పి క్వింటాకు రూ.1,360 ఉండగా, 11 ఏళ్ళ తరువాత కూడా రెట్టింపవ్వలేదు.

అదే సమయంలో పంట వ్యయం మాత్రం భారీగా పెరిగింది. మరోవైపు భారత వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టేలా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు తలుపులు బార్లా తెరిచే వాణిజ్య ఒప్పందానికి మోదీ ప్రభుత్వం తలొగ్గింది. తాజా ఎంఎస్‌పి ధరల ప్రకటన ద్వారా రైతులు మరోసారి కేంద్ర ప్రభుత్వం చేతిలో దగాపడ్డారు. అలాగే యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో కూడా రైతులకు నష్టం కలిగే అంశాలు ఉన్నాయి. వీటిని వెనక్కి కొట్టడంతో పాటు, ఎంఎస్‌పి చట్టబద్ధత తదితర పాత డిమాండ్‌లపై కేంద్రాన్ని ఒప్పించేందుకు మరోసారి దేశవ్యాప్త సమష్టి రైతు ఉద్యమమే మార్గం.



## నిరుద్యోగ యువత 'బొద్దింకల్లా' తయారవుతున్నారు

**ఉపాధి లేని కొందరు యువకులు బొద్దింకల్లా తయారవుతున్నారు. వారు మీడియా, సామాజిక కార్యకర్తల ముసుగులో వ్యవస్థపై దాడులకు దిగుతున్నారు. నిరుద్యోగులుగా ఉన్న కొందరు యువత సోషల్ మీడియా ఆర్‌టిఐ కార్యకర్తలుగా మారి ప్రతి ఒక్కరినీ విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. న్యాయవాద వృత్తిలో ఉన్న చాలా మంది డిగ్రీల ప్రామాణికతపై తమకు అనుమానం ఉంది. వాటిని సిబిఐ ద్వారా విచారణ జరిపించాలి.ఓట్ల రాజకీయాల కారణంగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంలో మిన్నకుండిపోతోంది.**

- భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)
జస్టిస్ సూర్యకాంత్

# ఉద్యోగాలకు వయో పరిమితి పెంపు ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమం కేవలం భౌగోళిక స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన రాజకీయ పోరాటం మాత్రమే కాదు; అది నీళ్లు నిధులు నియామకాలు సామాజిక న్యాయం, ఆకాంక్షల సమాహారం. ఆ ఉద్యమానికి ప్రధాన శక్తిగా నిలిచింది విద్యార్థి–నిరుద్యోగ యువత. అయితే రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం దాటిన ఈ సమయంలో కూడా నిరుద్యోగ సమస్య మరింత సంక్లిష్ట రూపం దాల్చడం ఆందోళనకర అంశంగా మారింది.

ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్న అభ్యర్థుల వయోపరిమితి అంశం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశమైంది.

నిరుద్యోగుల ప్రధాన డిమాండ్ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో గతంలో మాదిరిగానే వయోపరిమితిని కనీసం 10 సంవత్సరాలు పెంచాలని కోరుతున్నారు

గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అనాటి తెలంగాణ ఉద్యమ పరిస్థితులు, ఉద్యోగ నియామకాలలో జరిగిన ఆలస్యం, రాష్ట్ర విభజన అనంతర పరిపాలనా మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వయో సడలింపులు అమలు చేశారు. జనరల్ జిఒ నెం.42 ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ట వయో పరిమితిని 34 నుంచి 44 సంవత్సరాలకు పెంచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2024 ఫిబ్రవరి 8న జిఒ 30 ద్వారా మరో రెండేండ్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితి 46 ఏండ్లకు పెరిగింది. అయితే, ఆ జీవో గడువు 2026 ఫిబ్రవరి 8తో ముగిసింది. నిరుద్యోగులకు గరిష్ట వయోపరిమితిని పెంచుతూ ఇంతవరకు కొత్త జిఒ జారీ చేయలేదు.

ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో 20 అసిస్టెంట్ సైంటిస్ట్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో గతంలో అమలులో ఉన్న వయోపరిమితి సడలింపును కొనసాగించకపోవడం, ప్రభుత్వం సరిగ్గా స్పందించకపోవడం వలన నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.

రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలపై అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన శాంత కుమారి కమిటీ నివేదిక ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఒకవైపు ఖాళీలపై స్పష్టత లేకపోవడం, మరోవైపు నియామకాలలో ఆలస్యం — ఇవి యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతున్నాయి. వివాస్పదమైన జిఒ లు ఉన్నాయి. వీటివలన గ్రామీణ వెనుకబడిన విద్యార్థులు తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారు. వీటిని తక్షణం సవరించాలిని నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రధానంగా విద్యారంగంలో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా విశ్వవిద్యాలయాల్లో 2500కు పైగా అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ బోధనపై ఆధారపడుతున్న విశ్వవిద్యాలయాలు భవిష్యత్ పరిశోధన, అకాడమిక్ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు బలహీనపడుతుండగా, మరోవైపు ప్రైవేట్ విద్యా వ్యవస్థ విస్తరిస్తుండటం సామాజిక అసమానతలను పెంచే ప్రమాదం ఉంది. డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, డైట్ ఆఫీసర్స్, డిఎస్‌సి పోస్టులు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను కేవలం పరిపాలనా అంశంగా కాకుండా, ఒక చారిత్రక–సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది.

ఖాళీ పోస్టులన్నింటికీ స్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం, జూన్ రెండు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ఖాళీ ఉన్న ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేయాలి.

సమయపాలనతో కూడిన నియామక ప్రక్రియను అమలు చేయడం,

విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయడం, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ రుణాలు స్వయం ఉపాధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం

వంటి చర్యలు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

**ఆర్.ఎల్. మూర్తి,** ఒయు రీసెర్చ్ స్కాలర్
8247672658

# ఎన్‌టిఎతో కేంద్రీకృత విద్యా వ్యాపారం

**జయంత దాస్,**
సిపిఐ ఒడిశా రాష్ట్ర సహాయ కార్యదర్శి

భారతదేశంలో ఎన్‌టిఎ నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షలలో 70 ప్రశ్నపత్రాల లీకేజీ సంఘటనలు జరిగాయని, దీని వల్ల 1.7 కోట్ల మంది అభ్యర్థులు ప్రభావితులయ్యారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అసలు ఎన్‌టిఎ గురించి తెలుసుకుందాం. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను భారత ప్రధానమంత్రి 2017లో స్థాపించారు. ఆర్థికంగా ఉన్నత వర్గాలకు చెందిన అభ్యర్థులు తమ ఆర్థిక శక్తిని ఉపయోగించి కేంద్రీకృత పరీక్షల ద్వారా విజయాన్ని కొనుగోలు చేయడానికి ఇది అవకాశాలను కల్పించింది.

**ఎన్‌టిఎ నిర్వహిస్తున్న ప్రధాన జాతీయ స్థాయి పరీక్షలు:**

*జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) మెయిన్:* అండర్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష.

*నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యుజి:* అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష.

*కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటి) యుజి, పిజి:* కేంద్ర, భాగస్వామ్య విశ్వవిద్యాలయాలలో ప్రవేశంకోసం నిర్వహించే పరీక్ష.

*యుజిసి నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (యుజిసి నెట్):* అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత కోసం నిర్వహించే పరీక్ష.

*ఆల్ ఇండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎఐఎపిజిఇటి):* ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశంకోసం నిర్వహించే పరీక్ష.

*కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సిమాట్):* మేనేజ్మెంట్ కోర్సులలో ప్రవేశంకోసం నిర్వహించే పరీక్ష.

*గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్ (జిపాట్):* పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫార్మసీ ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష.

*ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎఐఎస్ఎస్ఇఇ):* సైనిక్ స్కూళ్లలో ప్రవేశంకోసం నిర్వహించే పరీక్ష.

కేవలం దీంతోనే మోదీ సంతృప్తి చెందలేదు. అందుకే 'వన్ నేషన్ – వన్ బిజినెస్ ఎడ్యుకేషన్ (ఒకే దేశం– విద్యలో ఒకే వ్యాపారం)' అనే నినాదంతో, ఆయన రాష్ట్రస్థాయి పరీక్షలకు కూడా విస్తరించారని ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా జాతీయ స్థాయి పరీక్షలను ఎన్‌టిఎ నిర్వహించినప్పటికీ, ఎక్కువ ప్రాంతీయ భాగస్వామ్యంతో జరిగే పరీక్షల సాంకేతిక, నిర్వహణాపరమైన అంశాలను సులభతరం చేసే పేరుతో వివిధ రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణలోకి కూడా ప్రవేశించిందని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర స్థాయి విద్యా సందర్భాలకు అనుగుణంగా ఈ పరీక్షలను హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళం, తెలుగు, ఉర్దూ, పంజాబీ వంటి బహుళ భాషలలో నిర్వహిస్తారు.

*నీట్–యుజి, జెఇఇ మెయిన్:* ఇవి జాతీయ స్థాయి పరీక్షలు అయినప్పటికీ, రాష్ట్రస్థాయి ప్రవేశాలకు (నీట్‌లోని 85% రాష్ట్ర కోటాతో సహా)ఇవి అత్యంత ముఖ్యమైనవి. వీటిని ఎన్టీఏ ప్రాంతీయ భాషలలో నిర్వహిస్తుంది.

*సియుఇటి:* ఇది వివిధ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నిర్వహించే వేర్వేరు ప్రవేశ పరీక్షల స్థానాన్ని భర్తీ చేసి, ఒక ఏకీకృత వేదికను అందిస్తుంది. దీనివల్ల ఫలితాలను డబ్బుతో నిర్ణయించే అవకాశం ఏర్పడవచ్చు. ఈ లక్ష్యంతో, ప్రభుత్వం 'విద్యా దోపిడీ లీడర్' గా మారడంలో విజయం సాధించింది.

***నరేంద్ర మోదీ '3డి వ్యాపార సూత్రం' ఇదే:***

1. 1డి: విద్యార్థులు గత పరీక్షలలో సరిగ్గా రాణించకపోయినా, ఆర్థిక పెట్టుబడితో నడిచే ఖరీదైన కోచింగ్ ద్వారా వారు మెరుగుపడే అవకాశం.
2. 2డి: సరస్వతీ శిశు విద్యా మందిరాలకు, బిజెపి నాయకులకు వారు కోరినట్లుగా డబ్బు చెల్లించడం ద్వారా, కాపీయింగ్‌కు అవకాశం ఉన్న పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయవచ్చని ఆరోపణ.
3. 3డి: బిజెపి నాయకుల ద్వారా విద్యార్థులు ముందుగానే ప్రశ్నపత్రాలను కొనుగోలు చేసి, జవాబులను పరీక్షల సమయంలో కాపీ కొట్టొచ్చని ఆరోపణ.

ఇది మోదీ '3డి పరీక్షా విధానం'గా పరిగణించబడుతుంది. అలాగే, 'పరీక్షా పే చర్చ'లో పరీక్షల గురించి జరిగిన చర్చలలో మోదీ స్వయంగా పంచుకున్నారని ఆరోపించబడిన జ్ఞానాన్ని కూడా ఇది సూచిస్తుంది.

సరస్వతి శిశు విద్యా మందిర్ యాజమాన్యంతో సంబంధం ఉన్న వ్యాపారులకు, రాష్ట్రాలవ్యాప్తంగా బిజెపితో సంబంధం ఉన్న వ్యాపార ప్రముఖులకు ఈ వ్యవస్థ బాధ్యతను అప్పగించారు. 2017 నుంచి కనీసం 70 జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని ఆరోపణలు ఉన్నాయి.

2026 మే 3వ తేదీన జరిగిన నీట్–యుజి 2026 పరీక్షను అధికారికంగా రద్దు చేశారు. దీనివల్ల 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు ప్రభావితులయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు సందర్భంగా రాజస్థాన్‌లో 45 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నాపత్రాల ముద్రణ లేదా తయారీ దశలోనే ఈ లీక్ జరిగిందని కొన్ని కేసులు సూచించాయి.




*కేంద్రీకృత పరీక్షా సంస్థలను రద్దు చేయాలి. అలాగే, ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎం, ప్రతీ కేంద్ర విశ్వవిద్యాలయం లేదా మరేదైనా విశ్వ విద్యాలయం వంటి సాంకేతికంగా అభివృద్ధి చెందిన సంస్థల పవిత్రతను పెంచడానికి, వారు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న విధంగానే మెరుగైన, పారదర్శకమైన, నాణ్యమైన పరీక్షల కోసం పోటీపడేందుకు అనుమతించాలి. తద్వారా కేంద్రీకృత అవినీతి పద్ధతులను నివారించవచ్చు.*

**2017– 2026 మధ్య జరిగిన ప్రధాన ఎన్‌టిఎ పేపర్ లీక్ ఆరోపణలు – వివాదాలు:**

*నీట్–యుజి2026 (రద్దు):* గతంలో జరిగిన చిన్నపాటి లీక్‌లపై 11 నెలల పాటు జరిపిన విచారణ అనంతరం, ఒక 'గెస్ పేపర్' అసలు పరీక్ష ప్రశ్నాలతో సరిపోలిందని ఆరోపణలు రావడంతో 2026 మే 3వ తేదీన జరిగిన పరీక్షను అధికారికంగా రద్దు చేశారు.

*నీట్–యుజి 2024:* ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు, 67 మంది విద్యార్థులు 720కి 720 సంపూర్ణ మార్కులు సాధించారన్న అసాధారణ వాదనపై విస్తృత వివాదం చెలరేగడంతో, దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు, న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యాయి.

*నీట్–యుజి 2021:* రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన అరెస్టుల అనంతరం ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఇది ఒక వ్యవస్థీకృత, పునరావృతమయ్యే రాకెట్ మాదిరిగా ఉందన్న ఆరోపణలను మరింత బలపరిచింది.

*నీట్ 2017:* పరీక్ష గోప్యతకు భంగం వాటిల్లిందన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి, బీహార్‌లో అరెస్టులు జరిగాయి, ఫలితంగా ప్రశ్నపత్రాల లీకేజీపై వివాదం చెలరేగింది.

*యుజిసి నెట్ (వివిధ సంవత్సరాలు):* పరీక్ష భద్రత విషయంలో ఎన్‌టిఎ తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నివేదికల ప్రకారం, గత ఏడేళ్లలో భారతదేశంలోని జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షలలో 70 ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు జరిగాయని, దీనివల్ల 1.7కోట్ల మంది అభ్యర్థులు ప్రభావితులయ్యారని ఆరోపణలు ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితులలో కేంద్రీకృత పరీక్షా సంస్థలను రద్దు చేయాలి. అలాగే, ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎం, ప్రతి కేంద్ర విశ్వవిద్యాలయం లేదా మరేదైనా విశ్వవిద్యాలయం వంటి సాంకేతికంగా అభివృద్ధి చెందిన సంస్థల పవిత్రతను పెంచడానికి, వారు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న విధంగానే మెరుగైన, పారదర్శకమైన, నాణ్యమైన పరీక్షల కోసం పోటీపడేందుకు అనుమతించాలి. తద్వారా కేంద్రీకృత అవినీతి పద్ధతులను నివారించవచ్చు.

# రాజకీయ నీడన కార్పొరేట్ సామ్రాజ్యం!

తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై గత దశాబ్ద కాలంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలోని ఒక వినూత్నమైన, ఆందోళనకరమైన ధోరణిని ఆవిష్కరిస్తున్నాయి. రాజకీయ పార్టీలు సిద్ధాంతపరంగా ఎంతటి వైరుధ్యాలను ప్రదర్శించినప్పటికీ, కార్పొరేట్ ప్రయోజనాల పరిరక్షణ, ఆర్థిక వృద్ధి నమూనాల విషయంలో అవి ఒకే తాటిపైకి రావడం గమనార్హం. దీనిని 'కార్పొరేట్ సమన్వయం' లేదా 'లాలూచీ రాజకీయం' అని పిలవవచ్చు. ఈ ధోరణికి అత్యంత ప్రబలమైన, తాజా ఉదాహరణగా హైదరాబాద్‌లోని 'సింధు హాస్పిటల్' నిలుస్తోంది. ఒకప్పుడు భూ కేటాయింపులను 'అక్రమమని' నిరసించిన వారు అధికారంలోకి రాగానే అవే కేటాయింపులను చట్టబద్ధం చేయడం, రాజకీయ ప్రత్యర్థులుగా భావించే వారు ఒకే వేదికపై కార్పొరేట్ ప్రాజెక్టును ఆవిష్కరించడం వంటి అంశాలు ప్రజాస్వామ్యంలో 'ప్రజా ప్రయోజనం' కంటే 'కార్పొరేట్ ప్రయోజనం' ఎంత శక్తివంతమైనదో నిరూపిస్తున్నాయి. సింధు హాస్పిటల్ ఉదంతాన్ని కేంద్రంగా చేసుకొని, తెలంగాణ రాజకీయాల్లోని క్రోనీ క్యాపిటలిజం, నయా ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావాన్ని లోతుగా విశ్లేషించాలి.

సింధు హాస్పిటల్ లేదా సాయి సింధు ఫౌండేషన్ కథ 2018లో భారత రాష్ట్ర సమితి (అప్పటి టిఆర్‌ఎస్) ప్రభుత్వ హయాంలో ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని అత్యంత విలువైన ప్రాంతమైన ఖానామెట్ (మాదాపూర్/గచ్చిబౌలి సమీపంలో) సర్వే నంబర్ 41/14/2లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని సాయి సింధు ఫౌండేషన్‌కు కేటాయిస్తూ జీవో ఎంఎస్ నంబర్ 59 (తేదీ: 22.03.2018) జారీ చేయబడింది. ఈ ఫౌండేషన్ బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు, హెటిరో గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బి. పార్థసారథి రెడ్డికి చెందినది. పార్థసారథి రెడ్డి కేవలం ఒక వ్యాపారవేత్త మాత్రమే కాదు. బీఆర్‌ఎస్ పార్టీకి అత్యంత సన్నిహితుడు. కీలకమైన ఆర్థిక వనరుగా పేరుగాంచారు. ఈ భూమిని కేన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్స కోసం 'లాభాపేక్ష లేని' ఆసుపత్రి నిర్మించడానికి కేటాయించినట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ కేటాయింపులో ఉన్న నిబంధనలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఎకరం విలువ దాదాపు రూ.33.7 కోట్ల నుంచి రూ.65 కోట్ల వరకు ఉన్న ప్రాంతంలో, మొత్తం 15 ఎకరాల భూమిని సంవత్సరానికి కేవలం రూ.1.47 లక్షల నామమాత్రపు లీజుకు 60 ఏండ్ల కాలపరిమితితో కట్టబెట్టడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ భూ కేటాయింపు విధానం (జీవో 571 ఆఫ్ 2012, జీవో 281 ఆఫ్ 2015) ప్రకారం, కలెక్టర్ నిర్ణయించిన మార్కెట్ విలువలో 10 శాతం వార్షిక అద్దెగా వసూలు చేయాలి. కానీ సాయి సింధు ఫౌండేషన్ విషయంలో ప్రభుత్వం ఈ నిబంధనలను పక్కన పెట్టి, 1989 నాటి బసవతారకం కేన్సర్ ఆసుపత్రికి భూమి కేటాయింపు నిబంధనలను వర్తింపజేసింది. ఇది ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించే చర్యగా పరిణమించింది. ఖానామెట్ ప్రాంతంలోని భూముల మార్కెట్ విలువ, ప్రభుత్వం నిర్ణయించిన లీజు అద్దె మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలిస్తే, కార్పొరేట్ శక్తులకు రాజకీయ ప్రాబల్యం తోడైనప్పుడు ప్రభుత్వ నిబంధనలు ఎంత సులువుగా పక్కన పెట్టబడతాయో అర్థమవుతుంది. ఈ గణాంకాలు పౌర సమాజంలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒక పక్క సామాన్య ప్రజలకు నివాస స్థలాలు దొరకని పరిస్థితి ఉంటే, మరోపక్క రాజకీయ పలుకుబడి ఉన్న కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కారుచౌకగా అప్పగించడం 'క్విడ్ ప్రో కో'కు నిదర్శనమని ఆరోపణలు వెల్లువెత్తాయి.

**న్యాయ పోరాటం, రాజకీయ వైఖరులు**

సాయి సింధు ఫౌండేషన్‌కు జరిగిన ఈ అక్రమ భూ కేటాయింపును సవాలు చేస్తూ సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ సభ్యులు తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. డాక్టర్ ఊర్మిళా పింగ్లే, సురేశ్ కుమార్, ఇతరులు దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో, మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకోకుండా అద్దె నిర్ణయించడం సహేతుకం కాదని వాదించారు. 2023 జూన్ 5న, అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని బెంచ్ 2018 నాటి కేటాయింపు ఉత్తర్వులను (జీవో 59) కొట్టివేసింది. భూ కేటాయింపు విధానాలను పాటించలేదని, అద్దె నిర్ణయించడంలో అహేతుకత ఉందని కోర్టు స్పష్టం చేసింది. అయితే కోర్టు ఈ విషయాన్ని తిరిగి ప్రభుత్వం పరిశీలించి, చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అప్పట్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఈ భూ కేటాయింపుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

2023 ఏప్రిల్‌లో గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. బిఆర్‌ఎస్ ఎంపి పార్థసారథి రెడ్డికి చెందిన ఫౌండేషన్‌కు రూ.1,500 కోట్ల విలువైన భూమిని కేవలం లబ్ధి పొందే ఉద్దేశంతో అక్రమంగా కేటాయించారన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేవలం 10 ఎకరాలు మాత్రమే సిఫార్సు చేసినా, ముఖ్యమంత్రి కార్యాలయం ఒత్తిడితో 15 ఎకరాలు ఇవ్వడం వెనుక భారీ కుంభకోణం ఉందని, కె. చంద్రశేఖర్ రావు (కెసిఆర్) పాలనా నమూనా ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ అక్రమ కేటాయింపులపై విచారణ జరిపి, బాధ్యులను జైలుకు పంపుతామని ఆయన ప్రజలకు వాగ్దానం చేశారు. ఈ దశలో రేవంత్ రెడ్డి మాటలు ప్రజల్లో ఒక ఆశను చిగురింపజేశాయి. అవినీతికి వ్యతిరేకంగా పోరాడే నాయకుడిగా ఆయన తనను తాను ఆవిష్కరించుకున్నారు. అయితే ఈ గర్జనల వెనుక ఉన్న అసలు ఉద్దేశం అధికారం మారిన తరువాత పూర్తిగా మారిపోయింది. 2023 చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అధికారం చేపట్టిన వెంటనే, 2024 జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం సాయి సింధు ఫౌండేషన్ భూ కేటాయింపు ఉత్తర్వులను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది రేవంత్ రెడ్డి తన ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్నారనే సంకేతాన్ని ఇచ్చింది. సామాన్య ప్రజల్లో హర్షం వ్యక్తమైంది. కానీ ఈ స్పందన కేవలం రెండు నెలలకే పరిమితమైంది. 2024 మార్చి 14న రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 37ను జారీ చేస్తూ, నిలిపివేత ఉత్తర్వులను రద్దు చేసింది. సాయి సింధు ఫౌండేషన్‌కు అదే 15 ఎకరాల భూమిని తిరిగి కేటాయించింది. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారాన్ని రేపింది.

ఒకప్పుడు 'జైలుకు పంపుతాం' అని గర్జించిన నాయకుడు, అధికారంలోకి రాగానే అదే సంస్థకు రెడ్ కార్పెట్ వేయడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్టగా మారింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం, వార్షిక లీజు అద్దెను ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. అంటే సంవత్సరానికి మొత్తం రూ.75లక్షల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ విలువ ప్రకారం ఉండాల్సిన అద్దెతో (సుమారు రూ.50కోట్లు) పోలిస్తే ఇది ఇప్పటికీ అత్యల్పమే. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని 'మానవతా దృక్పథం' పేరుతో సమర్థించుకుంది. కేన్సర్ రోగులకు ఉచిత చికిత్స అందించే లక్ష్యంతో, ఆసుపత్రి నిర్మాణానికి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ 'యుటర్న్' కేవలం ఒక భూ కేటాయింపునకు సంబంధించినది కాదు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కార్పొరేట్ శక్తుల ఒత్తిడి లేదా లోపాయికారీ ఒప్పందాలు ఎంత బలంగా ఉంటాయో నిరూపించింది.

**బిజెపి ద్వంద్వ వైఖరి**

సింధు హాస్పిటల్ ఉదంతంలో బీజేపీ పాత్ర అత్యంత ఆసక్తికరంగా ఉంది. రాష్ట్ర బీజేపీ నాయకత్వం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను 'ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు' అని విమర్శిస్తూ వస్తోంది. బీజేపీ ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ ఎ. మహేశ్వర్ రెడ్డి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేవలం రెండు నెలల్లోనే ముఖ్యమంత్రి హెటిరో గ్రూప్ ఒత్తిడికి తలొగ్గారని, రూ.1,500 కోట్ల విలువైన భూమిని కారుచౌకగా కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ ఈ కేటాయింపును ఒక 'సెలెక్టివ్ స్కామ్'గా అభివర్ణించింది. దీనిపై విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరింది. అయితే రాష్ట్ర స్థాయిలో ఇన్ని విమర్శలు ఉన్నప్పటికీ, 2026 మే నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా హైదరాబాద్ సందర్శించినప్పుడు సింధు హాస్పిటల్‌ను జాతికి అంకితం చేయడం గమనార్హం. ఇది బీజేపీ రాజకీయాల్లో ఉన్న ద్వంద్వ వైఖరిని ఎత్తిచూపుతోంది. రాష్ట్రంలో అవినీతిపై యుద్ధం ప్రకటిస్తూనే, కేంద్ర నాయకత్వం అదే వివాదాస్పద ప్రాజెక్టును గౌరవించడం రాజకీయ వైరుధ్యాలకు నిదర్శనం.

మే 10, 2026న ప్రధాని మోదీ హైదరాబాద్‌లో రూ.9,400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా హైటెక్ సిటీలో ఉన్న సింధు హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక సాంకేతికతను, కేన్సర్ నివారణలో దాని పాత్రను కొనియాడారు. ప్రధాని మోదీ ఈ ఆసుపత్రిని ఒక దాతృత్వ కార్యక్రమంగా అభివర్ణించారు. ఈ పరిణామం వెనుక ఉన్న సందేశం స్పష్టంగా ఉంది. జాతీయ స్థాయిలో ఆర్థిక వృద్ధి, కార్పొరేట్ పెట్టుబడుల పట్ల ఉన్న 'ఏకగ్రీవత' ముందు స్థానిక రాజకీయ విమర్శలు పనికిరావు.

ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకే వేదికపై నిలబడడం, ఒకే ప్రాజెక్టును ప్రశంసించడం ద్వారా తెలంగాణలో ఒక కొత్త రాజకీయ శకం 'కార్పొరేట్ అనుకూల సమన్వయ శకం' ప్రారంభమైందని చెప్పవచ్చు.

**మేకల ఎల్లయ్య,**
9912178129

పెంచిన పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి గ్యాస్

# ధరలను తగ్గించాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి గ్యాస్ ధరలను పెంచడాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, తీవ్రంగా ఖండించారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజాతంత్రవాదులంతా మోదీ ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడిక్కడ స్వతంత్రంగా, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కె.రామకృష్ణ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్ పై రూ.3.14, కిలో సిఎన్‌జి గ్యాస్‌పై రూ.2 లు పెంచుతూ, తక్షణమే అమల్లోకి వచ్చేలా ప్రకటించడం దుర్మార్గమని రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటివరకు సోషల్ మీడియాలో బిజెపి కార్యకర్తలు 'ఇతర దేశాల్లో డీజిల్ పెట్రోల్ ధరలు పెంచుతుంటే, భారతదేశంలో ప్రధాని మోదీ పెంచకుండా పరిపాలిస్తున్నారంటూ' మోడీ ఫోటోలతో ఊకదంపుడు ప్రచారం చేశారని, ఇప్పుడేమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, విదేశాంగ విధానాల ఫలితంగా ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకునే అనాలోచిత నిర్ణయాలకు మోదీ లొంగిపోయారని, ట్రంప్ ఆదేశాలను పాటిస్తూ భారతదేశ ప్రతిష్టను మంటగలిపారన్నారు. ఇరాన్, రష్యాల నుండి చమురు ఉత్పత్తులు కొనొద్దంటూ ట్రంప్ చేసిన ఒత్తిళ్లకు తలొగ్గి చమురు కొనడం మానేశారన్నారు. ఒకవైపు ఆయిల్ కొరత ఉండగా, మరో వైపు ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపారన్నారు.

**పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిన కేంద్రం : ఈటి నరసింహ్మ**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి గ్యాస్ ధరలను పెంచి పేదల నడ్డి విరిచిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల సందర్భంగా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచబోమని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తూ ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలను పెంచుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ సిలిండర్ ధరలు మరింతగా పెంచి ఆయిల్ కంపెనీలకు దోచిపెట్టడానికి బిజెపి ప్రభుత్వం తీసుకున్ననిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపట్టాలని కోరారు.

అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడంతో ఇక్కడ కూడా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచుతున్నామని మాట్లాడుతున్న బిజెపి కేంద్ర సర్కార్ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ తగ్గినప్పుడు ఎందుకు ఇక్కడ ధరలు తగ్గించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దుర్మార్గాలను ఖండించాల్సిన భారత ప్రభుత్వం నిస్సిగ్గుగా ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉండటం వల్లె దేశం నేడు ఈ పరిస్థితిని ఎదుర్కొంటుందన్నారు. డీజిల్ పెట్రోల్ గ్యాస్ రేట్లు పెరగటం అంటే దాని ప్రభావం నిత్యావసర వస్తువులపై మొదలుకుని అన్ని రంగాలపై ఉంటుందని, ఇది ప్రత్యక్షంగా ప్రజలపై భారాన్ని మోపటమేనని అన్నారు.

**పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై మోయలేని భారం : ఎంఎల్‌సి సత్యం**

పెట్రోల్ డీజిల్ ధరలు పెంపుతో కేంద్రం సామాన్యులపై మోయలేని భారం మోపిందని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా, దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం భారీ పన్నులతో ప్రజలను దోచుకుంటోందని అన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రవాణా ఛార్జీలు పెరగడంతో అన్ని రంగాలపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించి, ప్రజలపై భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని సత్యం హెచ్చరించారు.

పెట్రో ధరల పెంపుతో...

# సామాన్యుడి నడ్డి విరుస్తున్న బిజెపి ప్రభుత్వం

పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను కేంద్రం నియంత్రించాలి
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
హనుమకొండలో సిపిఐ వినూత్న నిరసన




**ప్రజాపక్షం/హనుమకొండ :** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని కాళోజి సెంటర్‌లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్ననిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రో ధరల పెంపుతో రవాణా,నిత్యావసర సరుకులు,కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే పది రోజుల క్రితం వాణిజ్య, గృహ వినియోగ సిలిండర్ ధరలను భారీగా పెంచి కనికరం లేకుండా సామాన్య ప్రజలపై బిజెపి ప్రభుత్వం భారం మోపిందని అన్నారు. కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని అన్నారు. గడిచిన 12 ఏళ్లుగా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ చేపడుతున్న ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించని ఎడల ప్రజా గ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి.విజయసారధి,జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్.ఎ.స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్,కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, అలువాల రాజు తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

**కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి**

**హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సిపిఐ రాస్తారోకో**

పోక్సో కేసులో తన కొడుకును రక్షించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ కాళోజీ సెంటర్ లో సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని,ఇటీవల 17 ఏళ్ల మైనర్ బాలికపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్ మద్యం తాగించి, కొన్నిసార్లు డ్రగ్స్ ఇచ్చి మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో పోక్సో కేసు పెట్టడం జరిగిందని అన్నారు. బండి సంజయ్ తన కుమారున్ని రక్షించుకొనే ప్రయత్నం చేస్తూ కేసును నిరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి భగీరథను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, బి.విజయసారధి,జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎన్ ఎ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోత్ శంకర్ నాయక్, కండె నర్సయ్య, గుంటీ రాజేందర్, అలువాల రాజు తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల

# పాలకమండళ్లను ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలి




రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకమండళ్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే నియమించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నామినేటెడ్ విధానం ద్వారా పాలక మండళ్ళను నియమించాలని ప్రభుత్వం తీసుకన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్యపద్మ మాట్లాడుతూ సహకార సంఘాలకు పాలకమండళ్లను పరోక్షంగా ఎన్నికోవడమంటే వాటిని నిర్వీర్యం చేయడమేన్నారు. ఈ విధానం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించి రాష్ట్రంలోని 908 సహకార సంఘాలకు పాలకమండళ్లను ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ సహకార రుణ సంఘాలను కేవలం ప్రభుత్వం అనుబంధ సంస్థలుగా కాకుండా, స్వయం ప్రతిపత్తి గల ప్రజాస్వామ్య సంస్థలుగా మార్చడానికి ప్రతిపాదించిందని, పలు రాష్ట్రాలతో పాటు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాథమిక సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి కల్పించే విషయాన్ని పరిగణలోకి తీసుకుని అమలు చేశారని గుర్తు చేశారు. రాజ్యాంగ ఆదేశాలను, ప్రొఫెసర్ వైద్యనాథన్ ప్రతిపాదనలను కాదని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అధికారులతో కూడిన పర్సన్ ఇంచార్జ్ కమిటీలను నియమించడానికి గతంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 597 జిఓను హైకోర్టు తీర్పుతో ప్రభుత్వమే స్వయంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు మరోసారి హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మంత్రివర్గ సమావేశంలో ప్రాథమిక సహకార సంఘాల పాలకమండళ్లను నామినెటేడ్ విధానం ద్వారా ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక, అప్రజాస్వామిక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు జరిపి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఎంఆర్‌ఓకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహ్మా, నాయకులు దాసరి ప్రసాద్, పొన్నాల యాదగిరి, మధు, సైదులు ముదిరాజ్, గణేశ్, పానుగంటి సాయిలు, రవి, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకే అప్పగించాలి

వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్ష నిర్వహణ లో పూర్తిగా విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) రద్దు చేసి తరాష్ట్రాలకు పరీక్షల నిర్వహణ బాధ్యతలను కల్పించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టిఏ వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నీట్ పరీక్ష ప్రశ్నా పత్రం లీక్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు, విద్యాసంస్థల వద్ద పెద్ద ఎత్తున నిరసనకార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. .హైదరాబాద్ లోని ముఖ్దూం భవన్‌లో శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్(ఎఐఎస్‌ఎఫ్), టి. నాగరాజు, డి. కిరణ్ (ఎస్‌ఎఫ్‌ఐ),అనిల్,(పి.డి.ఎస్.యు) పి. మహేష్, పొడపంగి నాగరాజు (పిడిఎస్‌యు), విజయ్ (పిడిఎస్‌యు విజృంభణ), నీతిష్ (ఎఐడిఎస్‌ఓ), ఎస్. నాగేశ్వరరావు (జార్జిరెడ్డి పిడిఎస్‌యు), పల్లె మురళి (ఎఐఎఫ్‌డిఎస్) తదితరులు పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో గత కొన్ని సంవత్సరాలుగా నీట్ పరీక్ష వరుసగా లీక్ అవుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రశ్నా పత్రాల లీక్‌ల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నప్పటికీ కేంద్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రింటింగ్ ప్రెస్ నుంచే లీక్ జరిగింది అని చెప్పడం అత్యంత దుర్మార్గం,బాధ్యతారాహిత్య ప్రకటన అని మండిపడ్డారు. పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలమైన ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఒకే దేశం – ఒకే పరీక్ష పేరుతో విద్యను కేంద్రీకరించడం వల్లే ఇలాంటి లీకేజీలు, అవకతవకలు పెరుగుతున్నాయని అన్నారు. కోచింగ్ మాఫియాలకు, కార్పొరేట్ విద్యా వ్యవస్థకు అనుకూలంగా నీట్ వ్యవస్థ మారిందని విమర్శించారు. గ్రామీణ, పేద, ప్రభుత్వ విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .నీట్ వ్యవస్థను పూర్తిగా పునఃసమీక్షించాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడే ప్రత్యామ్నాయ విధానాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను చైతన్యపరిచి ఉద్యమాలను విస్తృతం చేస్తామని ప్రకటించారు.

# కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వల్ల తెలంగాణ రైజింగ్–2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సిఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. హైదరాబాద్ పూనే ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డిపిఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, హెచ్‌ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జిఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి విలీనంపై వెంటనే

# అపాయింటెడ్ డేట్ ప్రకటించాలి

ఆర్‌టిసి జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలని గుర్తు చేస్తూ ఆర్‌టిసి ఉద్యోగుల విలీన ప్రక్రియపై వెంటనే అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్‌టిసి జెఎసి నాయకులు కోరారు. జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి తదితరులు శుక్రవారం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సమ్మె చర్చల సమయంలో మంత్రుల కమిటీ, ఐఎఎస్ అధికారుల కమిటీతో కార్మిక సంఘాల నాయకులు చర్చించి అంగీకరించిన అంశాలను ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోందని తెలిపారు.జెఎసి నాయకులు ముందు గా విలీన ప్రక్రియ పూర్తి చేయాలని కోరగా, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, వారి ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే 2021 వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మంత్రిని కలిసిన అనంతరం జెఎసి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి, కాలయాపన చేయకుండా వెంటనే విలీన ప్రక్రియ పూర్తి చేయాలని, జెఎసి సూచించిన విధి విధానాలు, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను కొనసాగిస్తూ మాస్టర్ స్కేల్ అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేయాలని నిర్ణయించినట్లు జెఎసి నాయకులు తెలిపారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే కెసిఆర్ లక్ష్యం

త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
ఎర్రగడ్డ టిమ్స్ పనులను పరిశీలించిన కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదలు, సామాన్యులకు ఢిల్లీలోని ఎయిమ్స్ తరహాలో ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలన్నదే కెసిఆర్ విజన్ అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌లతో కలిసి శుక్రవారం ఎర్రగడ్డ (సనత్ నగర్)లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆసుపత్రి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో, రూ. 1,200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మూడు ప్రధాన బ్లాకులు, రీసెర్చ్ సెంటర్, అకాడమిక్ బ్లాక్, భారీ ఆడిటోరియం ఉన్నాయన్నారు. 300 ఐసియు బెడ్లతో అత్యవసర వైద్య సేవలు, 16 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఎంఆర్‌ఐ, సిటీస్కాన్ స్కాన్ వంటి పూర్తి స్థాయి డయాగ్నస్టిక్ సౌకర్యాలు, కిడ్నీ సంబంధిత వ్యాధులపై ప్రత్యేక పరిశోధనల కోసం ప్రత్యేక విభాగాలు, రోగుల బంధువుల సౌకర్యార్థం ప్రత్యేక ధర్మశాల, 1,000 కార్ల సామర్థ్యం గల పార్కింగ్ వ్యవస్థ ఉండేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

**కెసిఆర్ విజన్ – రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి :** గతంలో నగరం మొత్తం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులపైనే ఆధారపడేదని, ఆ భారాన్ని తగ్గించేందుకే నగరం నలువైపులా (సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్, గచ్చిబౌలి) టిమ్స్ ఆసుపత్రులను కెసిఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిందని గుర్తుచేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వమే ఉండి ఉంటే, ఈ ఆసుపత్రి రెండేళ్ల క్రితమే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చేదన్నారు. వరంగల్‌లో 2,000 పడకల ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, 350 బస్తీ దవాఖానాల ఏర్పాటు ద్వారా తెలంగాణ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని ఆయన చెప్పారు.

**ప్రభుత్వానికి విజ్ఞప్తి..** ప్రభుత్వాలు మారినా ప్రజల ఆరోగ్యం, సంక్షేమం ముఖ్యం కాబట్టి, ప్రస్తుత ప్రభుత్వం మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. లిఫ్టుల పనితీరును మెరుగుపరచాలని, త్వరగా ఈ ఆసుపత్రిని ప్రారంభించి, సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ముమ్మందు తెలంగాణలో ఎఫెక్టివ్ పోలీసింగ్

డిజిపి సి.వి.ఆనంద్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎఫెక్టివ్ పోలీసింగ్ చేస్తామని డిజిపి సివి.ఆనంద్ వెల్లడించారు. వే టు న్యూస్ కాంక్లేవ్ 2026 లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డిజిపి మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్లకు వచ్చి ఫిర్యాదుదారులతో పోలీస్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తిస్తారని ఫ్రెండ్లీ పోలీసింగ్ కూడా ఎఫెక్టివ్ పోలీసింగ్ లో భాగంగా ఉంటుందన్నారు.

అదేవిధంగా, రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం ఒక పోరాటం తరహాలో ముందుకు సాగుతోందని ఆనంద్ స్పష్టం చేశారు .మారుతున్న కాలానికి అనుగుణంగా సాంప్రదాయ పోలీసు పద్ధతులను వీడి, సరికొత్త సవాళ్లయిన నార్కోటిక్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై శాఖను సమూలంగా సన్నద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ విస్తరిస్తుండటం అత్యంత ఆందోళనకరమని, దీని అడ్డుకట్టకు ప్రతి పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయంలో 'యాంటీ డ్రగ్ కమిటీలు' (సేఫ్టీ క్లబ్‌లు) ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయనుందని డిజిపి తెలిపారు. 16 గంటలకు పైగా శ్రమిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటం తన బాధ్యతని డిజిపి అన్నారు. ఒక ప్రత్యేక యాప్ , సాంకేతికత ద్వారా ఆరోగ్యాన్ని మానిటర్ చేయబోతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా 7,500 మంది, దేశవ్యాప్తంగా 1.75 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండటం పట్ల డిజిపి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు, రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ట్రాఫిక్ విధానాలను (స్టాండర్డైజ్ ప్రాక్టీసెస్) అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరలోనే 'ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్డు సేఫ్టీ బ్యూరో'ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. 174 ఏళ్ల హైదరాబాద్ పోలీస్ చరిత్రలో గతంలో ఏ రోజూ ఒక్క మహిళా అధికారి కూడా లా అండ్ ఆర్డర్ ఎస్‌హెచ్‌ఓగా పని చేయలేదని, తాను సిపిగా వచ్చిన తర్వాతే మధులత అనే ఇన్స్పెక్టర్‌ను లాలాగూడ పోలీస్ స్టేషన్‌కు ఎస్హెచ్ఓగా నియమించానని గుర్తుచేశారు.ప్రస్తుత 'జెన్ జీ', 'ఆల్ఫా' తరాల ఆలోచనా విధానం, సామాజిక విలువలు గతంతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**పురపాలక సంఘ కార్యాలయము, హుస్నాబాద్, సిద్దిపేట జిల్లా.**

కొటేషన్ నోటీస్

నెం. E1/1595/2026, తేది: 15.05.2026

పురపాలక సంఘ కార్యాలయము, హుస్నాబాద్ పట్టణములో TUFIDC నిధుల ద్వారా చేపట్టు పనులకు Greenery Development, Plants, Folding's, lollipops, Hoardings, Artistic paints మరియు వాటర్ సప్లై స్పేర్ పార్ట్స్, వనమహోత్సవం కార్యక్రమములో భాగంగా మొక్కల కొరకు మరియు స్ట్రీట్ లైటింగ్ కొరకు అవసరమగు మెటీరియల్ మరియు పారిశుధ్య కార్యక్రమములో భాగంగా తడి చెత్త మరియు పొడి చెత్తను సేకరించుటకు ఎలక్ట్రిక్ ఆటో వాహనములు కొనుగోలు చేయుటకు మరియు వాటి కొరకు చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయుటకు అర్హత కలిగిన ఏజెన్సీలు / సంస్థలు / కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి.

**Schedules details:**
1) సీల్డ్ కొటేషన్లు సమర్పించుటకు ప్రారంభ తేదీ : 18-05-2026 from 11:00 AM.
2) సీల్డ్ కొటేషన్లు చివరి తేదీ : 23-05-2026 from 4:00 PM.

Sd/- Commissioner,
Husnabad Municipality.

DIPR R.O. No. : 2451-PP/CL/ADVT/2026-27, Date: 15-05-2026

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**
GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, బడంగ్‌పేట్ సర్కిల్-16, హైదరాబాద్.
ఇ-మెయిల్: eec16adibatla@gmail.com

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

టెండర్ నోటీసు నెం. Engg/06/2026-27, తేది: 15.05.2026న 3 పనుల కోసం ప్రచురించబడినది. "1. నాదర్‌గుల్ -57లో వైవిద్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి రోమ ఎన్‌క్లేవ్ ఫేజ్-1 వరకు బిటి రోడ్ వేయడం. 2. డివిజన్ నెం.61లోని నాదర్‌గుల్ మెయిన్ రోడ్డులో, సూర్యదర్శన్ మీసేవ నుండి ఇ.నెం.6-104, ఇ.నెం.6-49/1, అశ్విని ఫ్రెష్ చికెన్ సెంటర్ దగ్గరలో, ఇ.నెం.6-81 సమీపంలో, ప్లాట్ నెం. 18 దగ్గర, ఎస్.పి. శాంతినగర్, శాంతినగర్ కాలనీలోని సెయింట్ మాథ్యూస్ హైస్కూల్ సమీపంలోకి సి.సి. రోడ్డు వేయడం, ఇన్‌స్పెక్షన్ ఛాంబర్ల నిర్మాణం. 3. జిహెచ్‌ఎంసి, బడంగ్‌పేట్ సర్కిల్-16, ప్రశాంతి హిల్స్ డివిజన్ నెం.59లో ఇ.నెం.3-213/1/3 నుండి రోడ్డు చివరి పాయింట్ వరకు, శాంతినోస్ గ్లోబల్ స్కూల్ ముందు నుండి నంది హిల్స్ రోడ్డు నెం.03 వరకు సి.సి.రోడ్డు వేయడం". మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in/login.html వద్ద లాగ్‌ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల వివరాలు క్రింద వివరించబడినవి:

| ఈవెంట్స్ | 8 పనులు మాత్రమే |
| --- | --- |
| ప్రారంభ తేదీ & సమయం | 15.05.2026 మ.03:00గం.లకు |
| డౌన్‌లోడ్‌కు ఆఖరి తేదీ & సమయం | 21.05.2026 మ.03:30 గం.ల వరకు |
| బిడ్ల స్వీకరణ కొరకు ఆఖరి తేదీ & సమయం | 21.05.2026 మ.03:30 గం.ల వరకు |
| బిడ్ల ప్రారంభ తేదీ & సమయం | 21.05.2026 మ.03:30 గం.లకు |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బండగ్‌పేట్ సర్కిల్-16, శంషాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బండగ్‌పేట్ సర్కిల్-16, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 2465-PP/CL/ADVT/2026-27, Date: 15-05-2026

## నీరుకుళ్ళ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపి



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామంలో ఎర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను పోలీస్ కమిషనర్ రైతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుకోవడంతో , ధాన్యం తరలించేందుకుగా అవసరమైన లారీలు అందుబాటు లేక చాలా ఇబ్బందులకు గురౌవుతున్నట్లు రైతులు పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక పోవడంతో స్పందించిన సిపి లారీల సమస్యను జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ రైతులకు బరోసానిచ్చారు.పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్స్‌పెక్టర్ సంతోష్, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులు వున్నారు.

## ఉపాధి పనుల వద్దకే ప్రభుత్వ టీచర్లు..



ప్రజాపక్షం /నడికూడ: బడిబాట కార్యక్రమంలో భాగంగా నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ కోంగంటి తిరుపతి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం.ప్రణీత,ఎంపిపిఎస్ స్కూల్ హెచ్‌ఎం శ్రీ మాచర్ల భిక్షపతి ఉపాధ్యాయ బృందం ఉపాధి హామీ పథకం పనుల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య అందిస్తున్నామని ఉచితంగా రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం,పాఠ్య పుస్తకాలు అందిస్తున్నామన్నామని వచ్చే విద్యా సంవత్సరం నుంచి పోషకాలతో కూడిన అల్పాహారం అందిస్తారని ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారని సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొస్తున్నారని,ఈ సంవత్సరం నుంచి 21 రకాల కిట్లు విద్యార్థులకు అందిస్తారని వివరించారు.తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు బుస భాగ్య,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాయిడి రజిత రెడ్డి, ఉపాధ్యాయులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి జాతీయ కార్యదర్శిని కలిసిన కందిక చెన్నకేశవులు



ప్రజాపక్షం/నెక్కొండ:హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి సత్య నారాయణ రెడ్డి భవన్‌లో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన రాష్ట్ర సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్‌ను ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కులను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సదస్సులో నాయకులు డిమాండ్ చేశారు.

## భద్రఖాళీ అమ్మవారి రథం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శ్రీకారం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతం గా శ్రీ భద్రఖాళీ అమ్మవారిని దర్శించుకున్నారు.భద్రఖాళీ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారి మాడవీధుల ద్వారా జరిగే విశేష సేవల కోసం నూతనంగా నిర్మిస్తున్న రథం పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, అధికారులు, పాలక మండలి సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డిజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారం మోపడమే సంక్షేమ పాలనా?

ప్రజాపక్షం/ వరంగల్ : దేశవ్యాప్తంగా పెట్రోలు, డిజిల్, సిఎన్‌జి ధరలు అంతులేకుండా పెంచి ఈ రోజు నుండే అమలులోకి తేవడం దారుణంగా ఉందని బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ఖండించారు. ఇటీవల దేశంలో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా విస్తృతంగా పర్యటించిన ప్రధానమంత్రి దేశంలో చమురు నిలువలు పుష్కలంగా ఉన్నాయని, ధరలు పెంచి సామాన్యులపై భారము మోపే సమస్యే లేదని ప్రకటించి ఎన్నికలు అయిపోయి కొత్త ప్రభుత్వాలు ఏర్పడగానే చమురు సంస్థలు శుక్రవారం రోజు ధరలు పెంచి వెంటనే అమలులోకి తేవడాన్ని ఏమనుకోవాలన్నారు. ఓడ దాటేదాకా ఓడ మల్లన్న ఓడ దాటినంక బోడి మల్లన్న అన్న చందంగా లేదా అని ప్రశ్నించారు. లీటర్ పెట్రోల్ పై రూ.3.14లు, డిజిల్ పై రూ. 3.11లు పెంచడంతో లీటర్ పెట్రోలు 111 రూపాయలకు, డీజిల్ లీటర్ కు 99 రూపాయలకు చేరిందన్నారు. వీటితోపాటు సిఎన్‌జి గ్యాస్ కేజీ ధర రెండు రూపాయలు పెంచారన్నారు. ఇటీవలనే వంటగ్యాస్, కమర్షియల్ సిలండర్ ధరలు అంతులేకుండా పెంచి ప్రజలపై కోట్లాది రూపాయల భారాలను మోపడం జరిగిందన్నారు. పెట్రోల్ డీజిల్ ధర పెరుగుదల ప్రభావంతో రవాణాచార్జీలు పెరగి నిత్యవసర సరుకుల ధరలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే తగిన సమయంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## జాతీయ రహదారిపై రైతుల ఆందోళన



### ధాన్యాన్ని తగలబెట్టిన రైతులు
### భారీగా నిలిచిపోయిన వాహనాలు

ప్రజాపక్షం/జనగామ:కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే త రలించాలని డిమాండ్ చేస్తూ జనగామ మండలంలోని పెంబర్తి వద్ద రైతులు హైదరాబాద్‌హన్మకొండ జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. వరి ధాన్యాన్ని రోడ్డుపై కుప్పగా పోసి ని ప్పుపెట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేయడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. పోలీసులు రైతుల్నిశాంతిపజేసేందుకుఎంత ప్రయత్నించినా ఫలించలేదు.

జనగామ మండలంలోని పెంబర్తి ఐకెపి కేంద్రంలో ధాన్యం పెద్ద ఎత్తున పేరుకుపోయింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా గత 20 రోజులుగా తరలించడం లేదు. ధాన్యం కొనుగోలుకు గన్నీ బ్యాగుల కొరత, తరలించేందుకు లారీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు రాజకీయాలకు అతీతంగా జాతీయ రహదారిపై భైఠాయించి నిరసన తెలిపారు. వరి ధాన్యానికి నిప్పు పెట్టారు. జాతీయ రహదారి కావడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. సిపిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐలు చెన్నకేశవులు, భరత్‌లు రైతులకు ఎంత నచ్చచెప్పినా ప్రయత్నం లేకపోయింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం పెద్ద మొత్తంలో దిగుమతి అయ్యిందన్నారు. పెద్ద ఎత్తున ధాన్యం పేరుకుపోయిందని, నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లలో తాస్సారం చేశారని మండిపడ్డారు. వెంటనే ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు వచ్చి సమాదానం చెప్పే వరకు రాస్తారోకోనే విరమించేది లేదని పట్టుబట్టారు. జిల్లా అధికారులు వచ్చి వెంటనే ధాన్యం తరలిస్తామని హామి ఇవ్వడంలో విరవించారు.

## కలెక్టర్ తీరుపై ఇన్‌చార్జి మంత్రి పొంగులేటికి ఫిర్యాదు



ప్రజాపక్షం/జనగామ :జనగామ జిల్లా కలెక్టర్ స ంజయ్ కుమార్ ఝా తీరుపై కలెక్టర్ బాధితుల రక్షణ కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ జి ల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని క లిసి ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ సంజయ్‌కుమార్ ఝా తీరు వలన ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పాత్రికేయులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కలెక్టరేట్‌ను నిర్భందపు నీడలో ఉంచారని, గడీల పాలన కొనసాగిస్తున్నారని, ప్రజా పాలనలో ప్రజలకు అనుకూలంగా వ్యవహరించడం లేదని కలెక్టరేట్‌కు వెళ్లడానికి సైతం అనేక ఆందోళను విధించారని, ఇసుక సమస్య మూలంగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి కూడా ఆగిపోయిందని, గోదావరి ఇసుక తరలింపుపైనా ఆంక్షలు విధించారని మండిపడ్డారు. మట్టి, ఇసుక తరలించే వాహనాలకు లక్షల రూపాయల జరిమానా విధిస్తున్నారని, రాజ్ భవన్‌ను తరలింపే విధంగా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులపై ఆందక్షలు పెట్టారని వివరించారు. కలెక్టర్ వైకరి వలన కాంగ్రెస్ పార్టీకి తలవంపులు వస్తున్నాయని, భవిష్యత్తులో ప్రజల నుండి కాంగ్రెస్‌కు ప్రమాదం పొంచి ఉందని వివరించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించగా వేం నరేందర్‌రెడ్డి ఈ విషయాలపై తమకు సమాచారం ఉందని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి వేం నరేందర్‌రెడ్డిని కలిసిన వారిలో కలెక్టర్ బాధితుల రక్షణ కమిటి కన్వీనర్ సాధిక్ అలీ, కోకన్వీనర్లు రాగల్ల శ్రీహరి, కన్నారపు పరశురాములు, బూడిద గోపి, బానోతు ధర్మబిక్షం, పాలమాకులు జితేందర్ పాల్గొన్నారు.

## గౌడుల ఐక్యతకు నిదర్శనంగా మహార్యాలీ

### సర్ధార్ సర్వాయి పాపన్న రేణుక ఎల్లమ్మ దేవాలయ స్థల సేకరణకై
### తహసీల్దార్‌కు ,సర్పంచ్ కి వినతిప్రతం



ప్రజాపక్షం/గూడూరు;సర్ధార్ పాపన్న విగ్రహానికి రేణుక ఎల్లమ్మ దేవాలయానికి స్థలం సేకరణకోసం గౌడ కుస్తులు ఐక్యతతో శుక్రవారం పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి తాహసీల్దార్‌కు సర్పంచ్‌కి వినతిపత్రం అందజేశారు. గూ దూరు మండల కేంద్రంలో గౌడ యూత్ అసోసియేషన్ తరుపున గౌడ సంఘం ఆధ్వర్యంలో భారీ ఐక్య గర్జన ర్యాలీ ఘనంగా నిర్వహించారు.సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ విగ్రహం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ గూడూరు చంద్రగూడెం ప్రాంతాలకు చెందిన గౌడ మహిళలు పురుషులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్ని తాటి ఆకులను చేతబట్టి సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈర్యాలీ గూడూరు ప్రధాన వీధులు గుండా తాహసీల్ధార్ కార్యలయం గూడూరు గ్రామపంచాయతీ కార్యాలయం వర కు ర్యాలీగా చురుకొని డిప్యూటి తహసీల్ధార్ కొమలకి గూడూరు మేజర్ సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ కి వినతిపత్రం అందజేశారు. దేవాలయ స్థలం సేకరణకు తక్షణ చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్బంగా గౌడ సంఘం నాయకలు మాట్లాడుతూ గౌ డ సమాజ అభివృద్ధి ఐక్యత కోసం అందరూ ఒకే వేదికపై కి రావడం ఆనందదాయకమన్నారు. సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎల్లమ్మ తల్లి ఆలయం నిర్మాణం గౌడ సమాజ ఆధాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘం పె ద్దలు మెరుగు మల్లయ్య గౌడ్ సమ్మెట సాంబయ్యగౌడ్ మె రుగు కేదారి పానుగంటి వీరస్వామిగౌడ్ సమ్మెట సుధాకర్‌గౌడ్ కప్పట అనిల్ గౌడ్ కన్నా వెంకటేశ్వర్లుగౌడ్ యు వత నాయకలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగస్తుల డబ్బులను తక్షణమే చెల్లించాలి

### సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/మహబూబాబాద్:రిటైర్డ్ ఉద్యోగస్తుల బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల బెన్‌ఫిట్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులకు రావాల్సిన డబ్బులు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని జిల్లాలో 450 మంది రిటైర్డ్ ఉద్యోగస్తులు రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా కూడా బెనిఫిట్స్ రాక రాష్ట్రంలో 26 మంది పెన్షనర్లు మృతి చెందడం జరిగిందన్నారు. రెండేళ్లుగా ఇవ్వవలసిన 16 వేల కోట్ల రూపాయలు ఇవ్వకుండా కాలయాపన చేయ డం ఎంతవరకు సరైనదో ఆలోచించాలి న్నారు. ఒక్కొక్క రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగికి 40 నుంచి 60 లక్షల రూపాయలు రావాల్సి ఉన్న డబ్బులు రాక వారి బతుకు లు ఆగమవడమే కాకుండా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సుదీర్ఘకాలంగా పనిచేసిన దాచుకున్న డబ్బులు కూడా అవసరాలకు రాకపోవడంతో ప్రతి రిటైర్డ్ ఉద్యోగిలో ఆ బాధ కనిపిస్తుంది ఆవేదన వ్యక్తం చేశారు. జిపిఎఫ్. లీవ్ ఎన్ క్యాష్మెంట్ కమ్యూటేషన్ బకాయిలు పెండింగ్ లేకుండా తక్షణమే 100 రోజుల ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి మాట ఇచ్చిన ప్రకారంగా తక్షణమే రిటైర్డ్ ఉద్యోగాలు డబ్బులను చెల్లించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉ ద్యోగులు అందరిని కలుపుకొని ఆందోళన కార్యక్రమా లు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో మైస నాగయ్య, గుడిశాల పాపయ్య, వి జయ్ కుమార్, వెంకటయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 18వ వార్డు కౌన్సిలర్ రెశే పల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, లింగ్యా నాయక్, వంకాయలపాటి చిరంజీ వి,జలగం ప్రవీణ్, కేదాశ రమేష్, మంద శంకర్, తండా శ్రీనాథ్, మేక వీరన్న, రవిచంద్రబోస్, కురాకుల పాల్, గాదం శ్యాం ప్రసాద్,అల్లివేణు మంద రవి,రాగం మల్ల య్య,వెంకటేశ్వర్లు, ఉస్మాన్, రఫీ, లక్ష్మీ నరసమ్మ ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

### యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్
### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/భూపాలపల్లి :నీట్ పేపర్ లీకేజీ కేంద్ర ప్రభు త్వ అసమర్థతకు నిదర్శనమని యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ అన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మోదీ దిష్టి బొమ్మ దహ నం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీ కాంత్ మాట్లాడుతూ, గత 10 సంవ త్సరాల్లో వరుసగా (89సార్లు) జరుగుతున్న పేపర్ లీక్‌లు కేంద్ర ప్రభుత్వ అ సమర్థతకు నిదర్శనమని అన్నారు. విద్యార్థుల కష్టం, త ల్లిదండ్రుల ఆశలు, యువత భవిష్యత్తును బిజెపి ప్రభు త్వం నిర్లక్ష్యంగా నాశనం చేస్తోందని ఆరోపించారు. దేశంలో చదువుకునే విద్యార్థులకు భద్రత ఇవ్వలేని ప్ర భుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయిందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్‌టిఎనే స్వయంగా పేపర్ లీ క్ జరిగినట్లు అంగీకరించి పరీక్షను రద్దు చేయడం దేశ విద్యా వ్యవస్థకు మచ్చ అని అన్నారు. పేపర్ లీక్ మాఫియాకు అండగా నిలుస్తున్న శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచుల మహేశ్, రేగొండ మం డల అధ్యక్షుడు కోయిలా క్రాంతి, చిట్యాల మండల అధ్యక్షులు అల్లకొండ కుమార్, శాయంపేట మండల అధ్యక్షులు సాదు నాగరాజు, మండల అధ్యక్షుడు కొలుగూరి అనిల్, మొగుళ్ళపల్లి మండల ఉపాధ్యక్షుడు మెరుగు సురేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు, బోయినీ మధుకర్, బొమ్మ కిరణ్, పున్నం ప్రవీణ్, కీర్తి రాజు, మేకల శివ, మహేశ్, గట్టు కుమార్, నాగరాజు, నరేందర్ రెడ్డి, సుమన్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు తొలగనున్న ఇబ్బందులు

ప్రజాపక్షం/జనగామ:జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కృషి జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. మట్టి, ఇసుక తరలింపులో ఇబ్బందులు పెట్టొదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టర్ సంజయ్‌కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం తెలంగాణ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో ఉమ్మడి వరంగల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ,కొండా సురేఖలు ఎమ్మెల్యేలు, అధికారులతో రివ్యూ నిర్వయించారు. జనగామలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మట్టి, ఇసుక తరలిస్తున్న నేపథ్యంలో కేసులు నమోదు చేసి లక్షల రూపాయల ఫెనాల్టీ వేస్తున్నారని వివరించారు. దీనితో పేదల ఇళ్లకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఇళ్లు నిర్మాణం చేసుకోలేక పోతున్నారని వివరించారు. గోదావరి ఇసుకను కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రతిపాదనను అంగీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల కోసం మట్టి, ఇసుక, ఇతర సామాగ్రి తరలించుకునే లబ్ధిదారులపై కేసులు నమోదు చేయవద్దని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీనితోఇందిరమ్మబాధితులసమస్యలుతీరే అవకాశం ఉంది.

## బారులు తీరుతున్న మక్కల ట్రాక్టర్‌లు

### ఒకే వేబ్రిడ్జితో రైతులకు తప్పని తిప్పలు
### ఆరుగాలం కష్టం అమ్మడంలో నరకం చూస్తున్న రైతన్నలు



ప్రజాపక్షం/కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న రైతులకు పంటను అమ్మడంలో మాత్రం నరకం చూస్తున్నారు. అంచనాకు మి ంచి వచ్చిన మొక్కజొ న్న పంట దిగుబడిని కొనుగోలు చేయడంలో అధికారుల అలసత్వంతో రైతులు తిప్పలు పడుతున్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం నిర్వహణలో సరిపడా సిబ్బంది లేకపోవడం, మండలంలోని అన్ని గ్రామాలతో పాటు చుట్టూప్రక్కల గ్రామాల నుండి కూడా మక్కలు మార్కెట్‌కు రావడంతో ఒక్కసారిగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో మార్కెట్, మార్క్‌ఫెడ్ నిర్వహకులు మార్కెట్‌లో కొనుగోళ్లు కాకుండా రైతులే నేరుగా 50 కిలోల చొప్పున బస్తాలు నింపుకుని వచ్చి మండల కేంద్రంలో నిర్ణయించిన వేబ్రిడ్జిలో తూకం వేయించిన తర్వాత మార్కెట్‌లోని మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి అన్‌లైన్‌లో కేటాయించబడిన బస్తాలను చూసుకుని ట్రక్ షీట్ తీసుకున్న తర్వాత వాటిని నెట్‌కు వేయాలి. అనంతరం ఖాళీ ట్రాక్టర్‌ను మరల తూకం వేయించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో కేవలం ఒకే వేబ్రిడ్జికి కేటాయించడం వల్ల రైతులు, ట్రాక్టర్ యజమానులు తీవ్ర ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలోని నిర్మల వేబ్రిడ్జి నుండి మార్కెట్ వరకు ట్రాక్టర్‌లు బారులు తీరి కన్పిస్తున్నాయి. పండించే పంటకు పెట్టుబడి, తర్వాత అమ్మకానికి బస్తాలు కొనడం, వాటిని నింపడం, ట్రాక్టర్ రవాణా కిరాయి, వేబ్రిడ్జి తూకం కోసం కనీసం ఒకటి నుండి రెండు రోజులు ఎదురుచూడడం, ట్రాక్టర్ తూకంలో 30 కిలోలు తరుగు తీయడంతో రైతుకు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ నుండి వచ్చే డబ్బుల కోసం ఎన్ని రోజులు ఎదురుచూడాలో అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎ ఉద్యోగుల సమస్యలపై మంత్రి సీతక్కకు వినతి





ప్రజాపక్షం/ములుగు:ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై మంత్రి సీతక్కను ఎన్‌హెచ్‌ఎ జెఎసి ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికిజెఎసి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ రావు పుట్ట నాయకత్వం వహించారు. రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం కమిటీ తరుపున ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను, ఉద్యోగ భద్రత వేతనాలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలను వివరించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల కోసం 180 రోజులు పూర్తి వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలని, అలాగే సమయానికి వేతనాలు అందక ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ఇతర ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని మంత్రిని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ భరత్, ఎండి రుక్మద్దీన్, ఎం నరేష్, ములుగు జిల్లా జెఎసి నాయకులు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ నరహరి, కిరణ్, గంగాధర్, కవిత, శ్రీలత, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

### ముదిరాజ్ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం

ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు మంత్రి సీతక్కని క్యాంపు కార్యాలయంలో పలు సమస్యల మీద కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ముదిరాజులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేస్తూ, మా ముదిరాజ్ కులస్తులు చాపల వేటకు వెళ్ళి చాపల వృత్తినే జీవనాధారం చేసుకుంటు బతుకుతున్నారని, అడవిలో దొరికే కాయలు, గడ్డలు, పాలు, పండ్లు, జిన్నా పండ్లు అమ్ముకొని రోజు వారి కూలీ పనులు చేసుకొని బతుకుతున్నారని, వారు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏలోకి మార్చే విధంగా అసెంబ్లీలో మాట్లాడాలని, కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ముదిరాజ్ బిడ్డలకు వారి స్థాయికి తగ్గట్లు నామినేట్ పోస్టులు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించే విధంగా చూడాలని, అన్ని మండలాలలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు మూడు గుంటల స్థలాన్ని అదేవిధంగా పెద్దమ్మతల్లి గుడికి స్థలాన్ని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలి. మత్స్య సొసైటీలకు ముదిరాజ్ కులస్తులు ఉన్న చోట అన్ని గ్రామాలలో సొసైటీలు ఏర్పడే విధంగా సహకరించాలని వినతిపత్రంలో మంత్రి సీతక్కను దేవేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జి చిటమట రఘు, జిల్లా మత్స్య సొసైటీ అధ్యక్షులు సాద రఘు, కాంగ్రెస్ పార్టీ ఫిషరీస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహారావు, ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు ఇంచర్ల ఉప సర్పంచ్ మామిడి అశోక్, ముదిరాజ్ మహాసభ తాడ్వాయి మండలాధ్యక్షులు రంగరబోయిన జగన్, ముదిరాజ్ మహాసభ నాయకులు జంగాలపల్లి సర్పంచ్ రఘు, ములుగు మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు కుక్కల నాగరాజు, ముదిరాజ్ మహాసభ నాయకులు సదా శ్రీనివాస్, అంకం సురేష్, మాజీ ఉప సర్పంచ్ నిరాటి సంపత్, పిట్టల సూరయ్య, బయ్య కుమారస్వామి, దేగల కిరణ్, గూళ్ల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లెల రామయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: సిపిఐ

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం గుట్ట మల్లారంకి చెందిన మల్లెల రామయ్య, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షులు రామ్ నరసయ్య సోదరుడైన మల్లెల రామయ్య ప్రమాదవశాత్తు మృతి చెందారు. శుక్రవారం విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు ఎఐటియుసి నాయకులు కొప్పుల ఈశ్వర్ ,ఇమాముద్దీన్, ఆవుల నాగరాజు ఆదేర్ల సురేందర్, తేనేటి నారాయణ, గోపిశెట్టి శివయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లెల రామయ్య పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: అయోధ్య



నేలకొండపల్లి జిపి కార్యదర్శికి వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** నేలకొండపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం భారీ నిరసన చేపట్టారు. దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి కాశబోయిన అయోధ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని పెంచాలని కోరారు. పని ప్రదేశంలో నీడ, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్.కె. సలాం, మూడు శ్రీనివాసరావు, కొంద్రుగట్టు నాగరాజు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, వారంతపు సెలవులు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు గ్రామ పంచాయతీ సెంట్రల్ ఫండ్ నుండి చెల్లింపులు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని రేపు జరిగే డిపివోల సమావేశంలో తెలియజేసి పెండింగ్ వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పిఎఫ్, ఈఎస్ఐ, వారంతపు సెలవులు కూడా ఇచ్చేవిధంగా డిపివోలకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను త్వరలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకట రాజన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిట్టల మల్లయ్య, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, శివశంకర్, షరీం, బద్దె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి : ఏడిఎ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు మండల విత్తన టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మండలంలోని విత్తన, పురుగు మందుల ఎరువుల డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విత్తన వ్యాపారం చేసే డీలర్లు తప్పనిసరిగా విత్తన చట్టం ప్రకారం విధి విధానాలను పాటిస్తూ రైతులకు నాణ్యమైన దిగుబడి వచ్చే విత్తనాలను అందించాలన్నారు. ప్రభుత్వం సూచించిన కంపెనీ విత్తనాలను విక్రయించాలన్నారు. కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో ముందస్తుగా విత్తన నమోదు చేసుకోవడం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇది చట్టరీత్యా నేరమని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలువపై మళ్లీ కబ్జాలు!

**నాడు పేదలను తరిమి నేడు ఆక్రమణలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో కాలువలపై మళ్లీ కబ్జాల పర్వం కొనసాగుతుంది. నాగార్జున సాగర్ కాలువలను ఆక్రమించుకున్నారని న్యాయస్థానానికి వెళ్లి పేదలను రోడ్డున పడేసిన వారే తిరిగి స్థలాలను అక్రమించి ఇండ్లు నిర్మించుకోవడం శోచనీయం. ఎక్కడ నిలువ నీడలేని పేదలు కాలువలను ఆక్రమిస్తే తప్పని కేకలు వేసిన పెద్దలే ఇప్పుడు ఆ కాలువను ఆక్రమించుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం నగరం నుంచి 60 అడుగుల మేర నాగార్జున సాగర్ కాలువ ప్రవహిస్తుంది. 25ఏళ్ల క్రితం ఈ కాలువపై ఖమ్మం నగరంలోని నిరుపేదలు, కుటుంబ పోషణార్థం నగరంలోకి వచ్చిన వారు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. దశాబ్ద కాలం తర్వాత ఖమ్మం నగరంలోని కాలువ సమీపంలో నివసిస్తున్న పెద్దలు గుడిసెలను తొలగించాల్సిందేనంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై పేదలు అనేక పోరాటాలు నిర్వహించినా చివరకు వారు వీధిన పడక తప్పలేదు. వీరిలో కొందరికీ పువ్వాడ ఉదయ్ నగర్ దగ్గర, వైఎస్ఆర్ కాలనీలో, ఇతర చోట్ల స్థలాలు కేటాయించారు. మరి కొందరికి నివసించే అవకాశం లేక ఇప్పటికీ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ తర్వాత నగరంలో కాలువ సమీపంలో స్థలాలు కలిగి భవనాలు ఉన్న పెద్దలు జీవో నెం.58, 59 క్రింద రెగ్యులర్ చేయించుకున్నారు. ఆ శకం ముగిసిన తర్వాత ఇప్పుడు 60 అడుగులు కలిగిన ఎన్నెస్పి కాలువను ఇరువైపులా ఉన్న వారు ఆక్రమించడంతో పాటు చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరి కొందరైతే ఓ అడుగు ముందుకేసి భవనాలు నిర్మించడం ప్రారంభించారు. పెద్దలకు ఒక రీతి, పేదలకు మరో రీతి అన్న చందంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తుంది. అధికార పార్టీకి అనుకూలురైన నేతలు కావడంతో అధికార యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కార్పోరేషన్ అధికారులు తక్షణం స్పందించి ఎన్నెస్పి కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు.

**ఆక్రమణలు తొలగించకపోతే ఆందోళన : గాంధీ**

ఆక్రమణలు తొలగించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సిపిఐ హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ తెలిపారు. పేదలను ఇబ్బందులు పెట్టేందుకు న్యాయస్థానాల చుట్టూ తిరిగి తొలగించే వరకు నిద్రపోని పెద్దలే ఇప్పుడు తిరిగి ఆక్రమణలకు పాల్పడటం శోచనీయమన్నారు. అధికార యంత్రాంగం పేదల పట్ల ఒక రీతిగా, పెద్దల పట్ల మరో రీతిగా వ్యవహరించడం సరి కాదని ఆయన తెలిపారు. అప్పుడు ప్రభుత్వ స్థలమని చెప్పి పేదల గుడిసెలు తొలగించిన అధికారులకు ఇప్పుడు ప్రభుత్వ భూమి కబ్జా కనిపించడం లేదా అని గాంధీ ప్రశ్నించారు. ఆక్రమణలపై కార్పోరేషన్ అధికారులు వెంటనే స్పందించాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే తిరిగి పేదలచే గుడిసెలు వేయిస్తామని ఆయన హెచ్చరించారు.

## నేడు ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా మహాసభ




హాజరుకానున్న 500 మంది ప్రతినిధులు

**ప్రజాపక్షం/ఖమ్మం:** తెలంగాణ మహిళా స మాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు అనుబంధం) ఖమ్మంజిల్లా 22వ మహాసభ శనివారం వైరాలో తు ళ్లూరి తులశమ్మ నగర్ (కమ్మ వారి కళ్యాణ మ ండపం)లో జరగనుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి లు తెలిపారు. ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. మహాసభ ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ఈ మహాసభకు తె లంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి, జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని, మమత ఎద్యుకేషనల్ సొసైటీ కా ర్యదర్శి పువ్వాడ జయశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి వెల్పుల విజేత తో పాటు వైరా మున్సిపల్ ఛైర్మన్ కాపా చంద్రకళ హాజరుకానున్నట్లు వా రు తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలపై ఈ మహాసభల్లో చర్చించనున్నట్లు కళావతి, లతాదేవి లు తెలిపారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

**ఆటోను తాడుతో లాగి సిపిఐ వినూత్న నిరసన**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధ రలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) నేలకొండపల్లి మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నేలకొండపల్లి సెంటర్ నందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పేద ప్రజలపై భారం మోపబోమని నమ్మబలికిన మోడీ ప్రభుత్వం, ఎన్నికలు ముగిసిన 15 రోజులకే ధరల బాదుడు మొదలుపెట్టిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలు, వాణిజ్య రంగం కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెంపుపై త మ నిరసనను తెలియజేస్తూ కర్నాటి కృష్ణయ్య భవన్ నుండి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ఆటోకు తాడు కట్టి లాగుతూ ప్రదర్శన నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పాలపాటి అశోక్, సిపిఐ కౌన్సిల్ సభ్యులు కాశబోయిన అయోధ్య, ఎస్.కె. సలాం, మూడు శ్రీనివాసరావు, నాగరాజు, చెన్నబోయిన వెంకన్న స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి సమష్టిగా పని చేయాలి

**సిపిఐ మండల ఆర్గనైజర్‌గా మోరంపూడి నాగేశ్వరరావు ఎన్నిక**

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** సిపిఐ పార్టీ బలోపేతానికి సమిష్టిగా పని చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం అన్నపురెడ్డిపల్లి గ్రామంలో సిపిఐ మండల ముఖ్య సమావేశం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసమావేశంలో పార్టీ సభ్యత్వాల విస్తరణ, పార్టీ బలోపేతం, మండల స్థాయి కార్యకలాపాలపై చర్చించారు. ఈసందర్భంగా మండల పార్టీ నూతన ఆర్గనైజర్‌గా మోరంపూడి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. ప్రజలకు చేరువగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి వూకే నారాయణ, సహాయ కార్యదర్శి పలగాని రామకృష్ణ, చంద్రుగొండ సిపిఐ మండల కార్యదర్శి బొర్రా కేశవులు, జిల్లా పార్టీ సభ్యుడు జడ శ్రీను, తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే సత్తుపల్లి నెంబర్ 1

**3,433 ఇళ్లు మంజూరు, 1,503 గృహాలు పూర్తి**
**రూ.99.93 కోట్లు వ్యయం**
**ఎమ్మెల్యే రాగమయి కృషికి మంత్రుల ప్రశంసలు**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం అమలులో సత్తుపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం చేసుకోగా, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్ చేసిన కృషికి మ ంత్రులు అభినందనలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గృహ నిర్మాణ శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వా కిటి శ్రీహరి సమక్షంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. సత్తుపల్లి ఎ మ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ నిరంతర పర్యవేక్షణ, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లు లేకుండా తీసుకున్న చర్యలతోనే ఈ అరుదైన గౌరవం దక్కిందని మంత్రులు ప్రశంసించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి మొత్తం 3,433 ఇండ్లు మంజూరుకాగా, 3,267 ఇండ్లకు పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో 1,503 పూర్తయ్యాయి. మొత్తం ఇండ్లకు రూ.99.93 కోట్లు మంజూరయ్యాయి. 1,229 ఇళ్లకు గాను 1,160 పూర్తై గృహ ప్రవేశాలు జరిగాయి. ఈ సందర్భంగా గృహనిర్మాణ శాఖామాత్యులు పొంగులేటి సత్తుపల్లిలో హౌసింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు సత్తుపల్లి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



## తుదిశ్వాస వరకూ ప్రజల కోసమే పనిచేస్తా

**నిజాయితీ, నిబద్ధత గల నాయకులకు ఆదరణ ఉంటుంది**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తనను అక్కున చేర్చుకున్న ప్రజల కోసం తుదిశ్వాస వరకు పని చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శ్రీరామ చంద్రుని ఆశీర్వాదంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే భాగ్యం తనకు దక్కిందని మంత్రి తుమ్మల తెలిపారు. మంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం వీడియోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలం చెందిన నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్రస్వామి ఆశీస్సులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల ఆశీర్వాదంతో 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. ప్రజలు ఇచ్చిన గౌరవం, ప్రతిష్టా, కీర్తి నిలబడేలా రాజకీయాలు చేశాను తప్ప తలదించుకునే పని చేయలేదన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసినట్లు తెలిపారు. నాకోసం, నా కుటుంబం కోసం కాకుండా ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజల కోరికలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. శాలువలతో, బొకేలతో తనకు సంతృప్తి ఉండదని నా మనుషులు శెభాష్ అని పేరు తెచ్చుకుంటే నాకు సంతృప్తి అన్నారు. రూమార్స్‌ను నమ్మవద్దని నేను ఏ విషయమైనా మోహం మీదే అంటానని ఎందుకంటే నా మనుషులు ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలన్నదే నా తపన అన్నారు. నిజాయితీ, నిబద్ధత గల నాయకులకు ఎల్లప్పుడు ప్రజాదరణ ఉంటుందన్నారు. ప్రజా సేవలో నిజాయితీగా పనిచేసి తుమ్మల మనుషులుగా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, వివిపాలెం సొసైటీ అధ్యక్షులు రావూరి సైదుబాబు, తాతా రఘురాం, ఖమ్మం కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సాధు రమేష్‌రెడ్డి, రఘునాథపాలెం మండల అధ్యక్షులు కేలోత్ దేవ్ సింగ్, నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, కిలారు వెంకటరమణ, కోటేష్ నాయక్, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన సిపిఐ, రైతు సంఘం నాయకులు



**ప్రజాపక్షం/మణుగూరు:** రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మణుగూరులో రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు మండల రెవెన్యూ తహశీల్దార్ అద్దంకి నరేష్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సొసైటీ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం సివిల్ సప్లై ద్వారా వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసేదని, ఈ సంవత్సరం వడ్లను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని దీనివల్ల ఇప్పటికే చాలా మంది రైతులు నష్టానికి వడ్లను అమ్ముకున్నారని, ఉన్న ధాన్యమైన ప్రభుత్వం కొనుగోలు చేస్తారని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు అన్నారు. కింటా కి 6 కేజీల తరుగు తీస్తేనే వడ్లు కొంటామని చెబుతున్నారని, దీనివలన రైతు నష్టపోతిన్నదని,ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతుల నుండి నేరుగా వరి ధాన్యం కొనుగోలు చేయాలని లేకపోతే రైతుల ఆగ్రహానికి ప్రభు త్వం చవి చూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.వినతి పత్రం అందించిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, కొత్తపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

**తెలంగాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాటి**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** విబి జి రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎ ంయు అనుబంధం) ఖమ్మం జిల్లా సమితి అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హా మీ కార్మికుల సమస్యలపై దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం విబి జీ రామ్ జీ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే అవకాశం తగ్గుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తూ వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. వెంటనే విబి జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన విధానంలో పని ప్రదేశంలో రోజుకు రెండు సార్లు ఫోటో తీసే పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించి రోజు వారి వేతనం రూ. 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికులకు రూ. 10 లక్షలు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి రావెళ్ల సురేష్, నాయకులు గరిడి రాంబాబు, శాఖమూరి సుధాకర్, నాధం, కంచం లింగయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మ ండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, విబి జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పించారు.

**వరదలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణపై**

## 18న బూర్గంపాడులో మాక్ డ్రిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** వరదలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై శుక్రవారం జిల్లా కలెక్టర్లు,స్థాయి అధికారులతో జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా టాప్ ఎక్సర్సైజ్ నిర్వహించారు. ఈ మేరకు స్థానిక సంస్థల అనదపు కలెక్టర్ విద్యాచందన, సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ రితికేష్ ఠాకూర్, జిల్లా ఫైర్ అధికారి క్రాంతికుమార్‌తో పాటు డిఎఫ్ఓ, పోలీస్, రెవెన్యూ, ఎస్‌డిఆర్ఎఫ్, వైద్య ఆరోగ్యశాఖ, ఇరిగేషన్ అధికారులు ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేనేజర్ సుధీర్ బహుల్ మాట్లాడుతూ జిల్లాలో వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవించిన సమయంలో అధికార యంత్రాంగం నేరుగా, సమన్వయంతో స్పందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వరద ప్రభావిత ప్రాంతంగా గుర్తించబడిన నేపథ్యంలో వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు, అత్యవసర సేవల నిర్వహణ అవసరం అన్నారు. జిల్లాలో అటవీ అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించిన సమయంలో వివిధ శాఖలు సమన్వయంతో ఎలా స్పందించాలి, అగ్నిమాపక చర్యలను ఎలా చేపట్టాలనే అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నెల 18న బూర్గంపాడు మండలంలో నిర్వహించే మాక్ ఎక్సర్సైజ్‌కు అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మాక్ డ్రిల్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి అన్ని శాఖల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతులు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్, కేశనపల్లి గ్రామానికి చెందిన రైతులు జాతీయ రహదారి విస్తరణ పనులను స్థానిక అడ్డుకున్నారు. కేశనపల్లి, దర్యాపూర్ గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం ఉదయం రహదారి నిర్మాణ ప్రాంతానికి చేరుకుని పనులను నిలిపివేశారు.రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం ఇంకా పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావలసిన నష్టపరిహారం మొత్తాన్ని పూర్తిగా అందజేసిన తర్వాతే రోడ్డు పనులు ముందుకు సాగనిస్తామని, అంతవరకు పనులను అనుమతించేది లేదని స్పష్టం చేస్తూ ఆందోళనకు దిగారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ముత్తారం తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి,ఎస్ఐ రవికుమార్ వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఆందోళన చేస్తున్న రైతులతో వారు సుదీర్ఘంగా చర్చించారు. పరిహారం విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు.అధికారుల భరోసాతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: సిపి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** పశువుల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు.శుక్రవారం పెద్దపల్లి జోన్ సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి తనిఖీ చేసి అధికారులకు సిబ్బందికి పలు సూచనలు ఆదేశాలు ఇచ్చి,వివరాలు నమోదు రిజిస్టర్లను పరిశీలించారు.అనంతరం సిపి మాట్లాడుతూ బక్రీద్ పండగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన నిఘా పెట్టినట్లు రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రత చర్యలను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రతి వాహనం,పశువుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.అనుమానస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని,ముఖ్యంగా రాత్రివేళలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండగ సమయంలో శాంతి భద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని,అనుమానస్పద కార్యకలాపాల పై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ సుల్తానాబాద్ సిఐ రంజిత్,సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్,తదితరులు ఉన్నారు.

## నేరస్తులను గుర్తించడంలో కీలక పాత్ర సిసి కెమెరాలదే: సిపి



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిసి కెమెరాలు నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా సురక్ష నేత్ర మూడవ విడతలో భాగంగా 275 సిసి కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు మొత్తం 631సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు నూతనంగా విడుతలలో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట త్రీటౌన్ పరిధిలోని పొన్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సోలార్ కెమెరాలను,రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 19సిసికెమెరాలను పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సిసి కెమెరాలు మూడో కన్నులా పని చేస్తాయని అన్నారు. అనుమానస్పద వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని,ఎటువంటి అనుమానస్పద కదలికలు గమనించినా వెంటనే డయల్ 100 సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను,ఫిర్యాదులను స్వీకరించారు. సురక్ష నేత్ర ద్వారా కాలనీలు,ప్రధాన కూడళ్లు,గ్రామాలలో నిరంతరం నిఘా కొనసాగుతుందని,తమ ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని సిద్దిపేట ప్రజలకు సిపి రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మీ బాబు,విద్యాసాగర్,పొన్నాల గ్రామ సర్పంచ్ వెంకటయ్య,ఉపసర్పంచ్ సృజన సంపత్ యాదవ్,పోలీస్ సిబ్బంది,నాయకులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య



**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామానికి చెందిన మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి జరిగిందని సిద్దిపేట ఇన్స్పెక్టర్ టి లక్ష్మీ బాబు తెలిపారు. 15-05-2026 శుక్రవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం తడకపల్లి గ్రామానికి చెందిన జ్యోతి(30)కి 2018లో కిష్టసాగర్ గ్రామానికి చెందిన జిర్ర శ్రావణ్‌కుమార్‌తో పెళ్లి జరిగిందని,వీరికి ఇద్దరు కుమారులు 1. నిహాన్ష్(6) 2.వేదాన్ష్(3)లు కలరని,భర్త శ్రావణ్‌కుమార్ గత కొద్దిరోజుల నుండి మద్యానికి,చెడు అలవాట్లకు బానిసై భార్య పిల్లలను పట్టించుకోలేదని తెలిపారు. 14-05-2026 నాడు తడకపల్లి గ్రామంలో శుభకార్యానికి వెళ్లి ఇంటికి వచ్చిన పిదప శ్రావణ్ కుమార్ మద్యం సేవించడానికి ఇంట్లో నుండి వెళ్లి రాత్రి 10.30 గంటలకు వచ్చి పిలిస్తే తన భార్య తలుపులు తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుందని,చుట్టు ప్రక్కల వారి సహాయంతో జ్యోతిని కిందికి దించి చూడగా అప్పటికే చనిపోయిందని,అల్లుడు శ్రావణ్ మద్యం,చెడు అలవాట్లకు బానిసై భార్య,పిల్లలను సరిగా పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర మనస్థాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని,మృతురాలి మరణంలో భర్తపై అనుమానం ఉన్నదని మృతురాలి తండ్రి తోట మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ లక్ష్మి బాబు తెలిపారు.

# బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి

పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పి మహేష్ బి గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యతని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్త్రీ, మహిళా, శిశు, వృద్ధుల, దివ్యాంగుల, ట్రాన్స్ జెండర్స్‌ల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో బాలల హక్కుల పరిరక్షణపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సర్పంచులు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వచన్ కుమార్ రెడ్డి, బండి అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, వందన గౌడ్, ప్రేమలత అగ్రవాల్ హాజరయ్యారు. పిల్లల రక్షణ.. సమాజం బాధ్యత టోల్ ఫ్రీ నంబర్లతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కిశోర బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు కుట్టు మిషన్ అందజేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డుల్లో బాలల హక్కుల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలతో కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు అడ్డుకోవాలని సూచించారు. పాఠశాలల్లో డ్రాప్ ఔట్లు ఉండవద్దని, ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో సౌకర్యాలపై వివరించి ప్రవేశం కల్పించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ ఉండవద్దని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధితో పాటు ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి.. బాలల స్థితిగతులు, ఇబ్బందులు గుర్తించాలని సూచించారు. 1098 హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పిల్లలకు వ్యాక్సిన్లు ఇప్పించాలని సూచించారు. మగ, ఆడపిల్లల ఇద్దరం సమానమని స్పష్టం చేశారు. ప్రతి వివాహం నమోదు కావాలని సూచించారు. బాల బాలికలకు అవగాహన కల్పించాలని, చదువుతోనే సామాజిక, ఆర్థిక మార్పు సాధ్యమని తెలిపారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. 18 ఏండ్ల లోపు బాల, బాలికలను కమిటీలు సంరక్షించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. జిల్లాలో 100కు పైగా అంగన్వాడీ ల భవనాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. బాలలపై వేధింపులు, బాల్య వివాహాలు నిరోధించాలని ఆదేశించారు. సర్పంచులు అంగన్వాడి కేంద్రాలు, స్కూల్స్ లో సందర్శించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి, సంక్షేమంతోపాటు చిన్నారులు హక్కుల రక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు నిరోధానికి ప్రభుత్వ అనేక పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సర్పంచులు, కార్యదర్శులు బాలల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూపారెడ్డి, రాములు నాయక్, రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మి రాజం, సిరిసిల్ల ఆర్డీఓ రాజేందర్ రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి: కనకరాజ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను అడ్డగోలుగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె కనకరాజ్ ఒక ప్రకటన లో ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచడం వల్ల సామాన్య ప్రజల తోపాటు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, చిన్న, చిన్న వ్యాపారులపై పెను భారం పడుతుందని అన్నారు. పెట్రో ధరలు పెరగడం వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా, అట్టి ప్రయోజనాన్ని ప్రజలకు అందించకుండా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే ధ్యేయంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తున్నదని విమర్శించారు.పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించి, పాత ధరలను పునరుద్ధరించిపేద ప్రజలపై భారం పడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలనీ,కేంద్రం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



**ప్రజాపక్షం/శంకరపట్నం:** ధాన్యం కొనుగోలు చేపట్టాలని శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ వద్ద శుక్రవారం కరీంనగర్‌వరంగల్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన చేశారు.కేశవపట్నం మార్కెట్ కు ధాన్యం తీసుకువచ్చి 15రోజులు గడిచిన సక్రమంగా కాంటలు కావడం లేదని రైతులు రెండు సంచులు ధాన్యాన్ని బస్తాలలో నింపి రోడ్డుపై వేసి ప్రభుత్వానికి సహకార సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెటుకు తరలిస్తే కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు.వెంటనే కాంటలు నిర్వహించి మిల్లులకు ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారు.రైతుల ఆందోళనతో ట్రాఫిక్ నిలిచిపోగా సమాచారం అందుకున్న కేశవపట్నం పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

## ధాన్యం దిగుమతి వేగవంతం: కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/దుబ్బాక:** మిల్లుల్లో ధాన్యం దిగుబడిలో జాప్యం కాకుండా ఎక్కువ మంది హమాలీలను సమకూర్చుకుని షిఫ్ట్‌ల వారీగా పని చేయించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి మిల్లర్ యాజమానులను ఆదేశించారు. శుక్రవారం దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలోని లలిత పరమేశ్వర ఇండస్ట్రీస్, అక్బర్‌పేటభూంపల్లి మండలం మోతే గ్రామంలోని భారతి ఇండస్ట్రీస్, మంజునాథ ఇండస్ట్రీస్, దౌల్తాబాద్ మండలం ముత్యంపేటలోని స్వాతి ఇండస్ట్రీస్, రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని శివసాయి బాలాజీ ఇండస్ట్రీస్‌లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లారీలు ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా స్థానికంగా కార్మికులను ఏర్పాటు చేసుకుని వేగంగా పని చేయాలని తెలిపారు. ధాన్యం దిగుమతి పూర్తయ్యాక మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపిఎంఎస్ అప్‌లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్ లెకుండా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు సన్న వడ్లు పండించాలని, సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ కూడా ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజతో పాటు ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## వరి, మొక్కజొన్న పంటకు మద్దతు ధర: కలెక్టర్


రైస్ మిల్లులను పరిశీలించిన కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలో రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తో కలిసి పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని అన్నపూర్ణ రైస్ మిల్లు,పెద్దబొంకూరు లోని రాఘవేంద్ర రైస్ మిల్ తో పాటు పలు రైస్ మిల్లు, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం నిల్వలు,లిఫ్టింగ్, మిల్లింగ్ ప్రక్రియలను పరిశీలించారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 4 లక్షల నుంచి 4.25 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 1.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.280 కోట్ల చెల్లింపులు చేశామని తెలిపారు. మరో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వివిధ దశల్లో ఉందన్నారు.రెండో శనివారం, ఆదివారం రోజుల్లో కూడా రైతుల ఖాతాల్లో చెల్లింపులు చేశామని , జిల్లాలో 62 లక్షల గన్నీ సంచులు సిద్ధంగా ఉంచామని చెప్పారు. ఈ ఏడాది వరి దిగుబడి అధికంగా రావడంతో పాటు మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు ఒకేసారి రావడం వల్ల రవాణా, హమాలీ సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. తీవ్ర ఎండల ప్రభావం కూడా ఉందన్నారు.గత వారం వరకు రోజుకు 6 నుంచి 6.5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగగా, ప్రస్తుతం రోజుకు 13 వేల మెట్రిక్ టన్నుల వరకూ కొనుగోళ్లు పెరిగాయని తెలిపారు. మే 20 నాటికి 80 శాతం కొనుగోళ్లు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు.పీపీసీలకు టార్పాలిన్ కవర్లు అందించామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు సుమారు 700 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినా, ఆ ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులు సహనంతో ఉండాలని, ప్రతి రైతు వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ యాసంగిలో జిల్లాలో సుమారు 18 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, దిగుబడులు 25 క్వింటాళ్ల నుంచి 3540 క్వింటాళ్ల వరకూ పెరిగాయని తెలిపారు. ఐదేళ్ల తర్వాత జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతున్నామని, ఇందుకోసం పెద్దపల్లి జిల్లాలో 8 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. ఈ పర్యటనలో ఏసిపి జి. కృష్ణ, డీటీ సిఎస్ మహేష్, మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్, సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేయడంలో విఫలం

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల:** రైతుల వద్ద కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ,బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆరోపించారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో జీవన్ రెడ్డి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట విక్రయించుకోవడానికి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు.గత ఏడాది కన్నా మెరుగైన రీతిలో కొనుగోలు చేపట్టాలన్నారు.దాన్యం రవాణా చేసేందుకు లారీలు ఎందుకు తగ్గిపోయాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.క్వింటాల్ కు అదనపు తూకంతో రైతులు నష్టపోతున్నారన్నారు.ఎవరి ధాన్యం వారే తరలించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.ధాన్యం తూకంలో జాప్యం..రవాణాలో, అన్లోడింగ్ ఆలస్యనికి పాలన అధికార యంత్రాంగమే బాధ్యులన్నారు.కేంద్రీయ విద్యాలయం కేంద్రం కేటాయించిందని,స్థలం కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.రైతుల సమస్యలపై కాంగ్రెస్ కు, బీజేపీ కి పట్టింపు లేదని మండిపడ్డారు.కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయించాలని ఎం పీ అరవింద నేరుగా సి ఎం ను కలవాలని కోరారు.మోదీ ,రేవంత్ రెడ్డిలు బడే బాయి,చోటే భాయి అని పలువురు మాట్లాడుకుంటున్నారని ఆరోపించారు.ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్ రావు, ప్రవీణ్, సుధాకర్,తదితరులు ఉన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్‌పి అశోక్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి:** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు భద్రంగా కొనసాగేందుకు, పశువుల అక్రమ రవాణా, గోవధ నివారణ పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా సరిహద్దు రాయపట్నం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,ముఖ్యంగా పశువులను తరలిస్తున్న వాహనాల పత్రాలను పూర్తిగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని ,అనుమానాస్పదంగా సంచరించే వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం,అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని, ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు.ఎస్పి వెంట అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డిఎస్పి పురుషోత్తం రెడ్డి, ధర్మపురి సి.ఐ రామ్ నరసింహరెడ్డి, ఎస్ఐలు మహేష్,ఉదయ్ కుమార్,సిబ్బంది ఉన్నారు.

## ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ధర్మపురి:** కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించేలా అధికారులు, మిల్లర్లు, ట్రాన్స్పోర్టర్లు చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. జిల్లాలో భారీ ధాన్యం కొనుగోళ్ల సేకరణ, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం ధర్మపురి మండలం జైన, రాజారాం గ్రామాలలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను, దుబ్బల గూడెంలోని మొక్కజొన్న గోదాం, ధమ్మన్నపేట శివారులోని పరమేశ్వర, ధనలక్ష్మి రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేయలన్నారు.ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని,రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాలు ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచులు, టార్ఫలిన్‌లు నిర్వాహకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వస్తున్న ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అన్లోడ్ చేసిన వెంటనే లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, సివిల్ సప్లై డీఎం జితేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఉన్నారు.

## నిరుపేదల ఇంటి కల ఇందిరమ్మ ఇళ్లు



**ప్రజాపక్షం/ రుద్రంగి /వేములవాడ:** రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి పెద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని నిరుపేదల ఇంటి కల ఇందిరమ్మ ఇళ్లు అని అన్నారు.

# మతసామరస్యం కోసం కోల్‌కతాలో లెఫ్ట్ ప్రదర్శన






**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్‌లో తొలిసారి అధికారానికి వచ్చిన బిజెపి విజయోత్సవాల పేరుతో రాష్ట్రమంతటా సాగిస్తున్న అరాచకాలను ఖండిస్తూ వామపక్ష పార్టీలు మే 8న కోల్‌కతాలో ప్రదర్శన నిర్వహించాయి. బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ మద్దతుదారులు పేదలు, శ్రమజీవుల జీవనోపాధులను అడ్డుకుంటున్నారు. ఎబివిపి కార్యకర్తలు కాలేజీలు, యూనివర్సిటీల్లో అల్లరి చేస్తున్నారు. అవి ఈ రాష్ట్రంలో సాగవని వామపక్ష నాయకులు హెచ్చరించారు. విజయోత్సవాల పేరుతో బిజెపి వారు సాగిస్తున్న అరాచకాలను వ్యతిరేకిస్తూ, "రాష్ట్రంలో సామరస్యం నాశనం చేసేందుకు, రాష్ట్రాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తే మేము అడ్డుకుంటాం" అని వారు నినాదాలిచ్చారు. బిజెపి ప్రోత్సహిస్తున్న అరాచకశక్తులు లెనిన్ విగ్రహాన్ని, రాష్ట్రానికి చెందిన ఇతర అమరవీరుల విగ్రహాలను బద్దలుకొట్టారు, వాటికి కాషాయ రంగు పులిమారు. ఈ దుశ్చర్యలకు నిరసనగా వామపక్ష పార్టీలు శాంతికి విజ్ఞప్తి చేస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతా ల్లో ప్రదర్శనలు జరిపారు. వామపక్షాల పిలుపుపై మే 8న కోల్‌కతాలో కార్మికులు, వామపక్ష మద్దతుదారులు, సామాన్య ప్రజలతో పెద్ద ఊరేగింపు జరిగింది. "హింస ఆపండి", 'విగ్రహాల ధ్వంసం ఆపండి", "సాధారణ శ్రమజీవులను, ముఖ్యంగా మైనారిటీలను వేధించటం ఆపండి" అని వారు నినాదాలిచ్చారు. నగరంలోని ఎస్‌ప్లనేడ్ నుంచి ప్రదర్శన మొదలైంది. ప్రదర్శన వివిధ వీధుల గుండా ప్రయాణించి తిరిగి ఎస్‌ప్లనేడ్‌లోని లెనిన్ విగ్రహం వద్దకు చేరింది. రాష్ట్ర వామపక్ష సంఘటన చైర్మన్ బిమన్‌బసు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ కార్యదర్శి స్వపన్ బెనర్జీ, ఫార్వర్డ్‌బ్లాక్, ఆర్‌ఎస్‌పి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎం) నాయకులు ప్రసంగించారు. 'బెంగాల్ సర్వమత సామరస్య భూమి. దీన్ని దృష్టిలో పెట్టుకుని బిజెపి పరిపాలన సాగించాలి' అని నరేన్ చటర్జీ (ఆర్‌ఎస్‌పి) హెచ్చరించారు. 'లెనిన్ సమానత్వం, విముక్తి పోరాటాలకు ఆదర్శం. బిజెపి వారు బహుళత్వం, లౌకికతపై దాడిచేస్తున్నారు. ఈ దాడులను ప్రతిఘటిస్తామని వామపక్షాలు ప్రతినబూనాలి' అన్నారు శ్రీదీప్ భట్టాచార్య (సిపిఎం). 'మేము రవీంద్ర–నజ్రుల్ – విద్యాసాగర్ – లాలన్ – లెనిన్ వారసులం. మతసామరస్యం ఏవిధంగా ఉల్లంఘించబడినా మా పద్ధతిలో మేము నిరసన తెలుపుతాం' అన్నారు అటను చక్రవర్తి (సిపిఐ(ఎంఎల్)). అటువంటి పరిస్థితుల్లో మేము పాలనా యంత్రాంగంపై ఆధారపడబోము. మతసామరస్యం కాపాడేందుకు మనం అప్రమత్తంగా ఉండాలి' అన్నారు బిమన్ బసు.

## ఆర్‌జికర్ హత్యాచార ఘటన..

# ముగ్గురు ఐపిఎస్‌ల సస్పెన్షన్



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జికర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మమత హయాంలో జరిగిన ఈ కేసు విచారణపై ఇప్పుడు బెంగాల్‌లోని బిజెపి సర్కార్ దృష్టిపెట్టింది. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తప్పుదోవపట్టించడం వంటివి చేసినందుకు ముగ్గురు పోలీసు అధికారులపై సిఎం సువేందు అధికారి వేటు వేశారు. నన్నానాలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సువేందు అధికారి ఈ విషయంపై ప్రకటన చేశారు. ముగ్గురు ఐపిఎస్‌లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశించారు. వినీత్ గోయల్ (కోల్‌కతా పోలీస్ కమిషనర్)తోపాటు అభిషేక్ గుప్తా, ఇందిరా ముఖోపాధ్యాయ్ అనే ముగ్గురిని సస్పెండ్ చేశారు. బాధితురాలి తల్లికి ఈ పోలీసులు లంచం ఇవ్వజూపారని, అలాగే వారి అనుమతి లేకుండానే ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారని సిఎం అన్నారు. ఆగష్టు, 2024లో కోల్‌కతాలోని ఆర్‌జికర్ మెడికల్ హాస్పిటల్‌లో డ్యూటీలో ఉన్న 31 ఏళ్ల యంగ్ డాక్టర్ హత్యాచారానికి గురైంది. దీంతో ఈ ఘటన సంచలనం సృష్టించింది. డాక్టర్లు, విద్యార్థులు, ప్రజలు ఆందోళన నిర్వహించారు. నిందితుల్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. కానీ, ఈ కేసు విషయంలో అప్పటి మమత సర్కార్ సరిగ్గా వ్యవహరించలేదనే విమర్శ ఉంది. ఆధారాల్ని మాయం చేయడం, పోలీసులు ఆలస్యంగా స్పందించడం, నిర్లక్ష్యం వంటి కారణంగా బాధిత కుటుంబానిక సరైన న్యాయం జరగలేదనే ప్రచారం ఉంది. తీవ్ర విమర్శలు, ఆరోపణల తర్వాత ఈ కేసును సిబిఐ విచారణకు అప్పగించింది అప్పటి ప్రభుత్వం. ఈ అంశం ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కీలకంగా మారింది. మమత ప్రభుత్వంపై బిజెపి తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే, మృతురాలి తల్లిని బిజెపి ఎమ్మెల్యేగా పోటీ చేయించగా, ఆమె 28 వేల ఓట్ల మెజారిటీతో గెలిచింది. బిజెపి ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఈ కేసు విచారణ మరోసారి తెరమీదకు వచ్చింది.

# పంజాబ్‌లో రైతులపై టియర్ గ్యాస్

- వాటర్ కెనాన్లతో విరుచుకుపడిన పోలీసులు
- కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టపరమైన హామీ, నదీ జలాల వివాదం పరిష్కారించాలని అన్నదాతలు డిమాండ్



**చండీగఢ్ :** రైతులపై పంజాబ్ ప్రభుత్వం విరుచుకుపడింది. చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియాకు వినతిపత్రం సమర్పించడానికి శుక్రవారం లోక్‌భవన్‌కు పాదయాత్రగా వెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. అయితే నిరసన చేస్తున్న పంజాబ్ రైతులను చెదరగొట్టడానికి చండీగఢ్ పోలీసులు టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లను ప్రయోగించారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టపరమైన హామీ, నదీ జలాల వివాదం పరిష్కారం, పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని కొన్ని నిబంధనలను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో లోక్ భవన్‌కు పాదయాత్ర చేయడానికి పంజాబ్ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో రైతులు మొహాలీలో సమావేశమయ్యారు. రైతులు మొహాలీ–చండీగఢ్ సరిహద్దు పాయింట్ సమీపానికి చేరుకుని బారికేడ్లను దాటినప్పుడు, వారిని ఆపడానికి పోలీసులు వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ ఉపయోగించారని వర్గాలు తెలిపాయి. పోలీసులు పలువురు రైతులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల చర్యలో కొందరు రైతులు గాయపడ్డారని జోగిందర్ సింగ్ ఉగ్రహాన్ సహా కొందరు ఎస్‌కెఎం నాయకులు పేర్కొన్నారు. తాము శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించి, పంజాబ్ గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించాలనుకుంటున్నామని ఆయన అన్నారు. చండీగఢ్ కూడా పంజాబ్ రాజధానే, 'కానీ ఈరోజు గవర్నర్‌కు వినతిపత్రం అందజేయకుండా కూడా మమ్మల్ని అడ్డుకున్నారు' అని ఒక మహిళా నిరసనకారిణి అన్నారు. నది ప్రవహించే రాష్ట్రం పంజాబ్ కాబట్టి, నదీ పరివాహక ప్రాంత సూత్రం ప్రకారం నదీ జలాల సమస్యను పరిష్కరించాలని, దానికే మొదటి హక్కు ఉండాలని రైతులు డిమాండ్ చేశారు. పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 1966లోని సెక్షన్లు 78, 79, 80లను రద్దు చేయాలని వారు కోరారు. సెక్షన్లు పంజాబ్ జలాల నియంత్రణను కేంద్రానికి అప్పగించాయి. డ్యామ్ భద్రతా చట్టం, జల సవరణ చట్టం 2024 రాష్ట్రాల జల హక్కులను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంటూ, వాటిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అమెరికాతో వ్యవసాయ వ్యతిరేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న తన నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బోర్డు నిబంధనలకు సవరణలు చేయడం ద్వారా భాక్రా బియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు (బిబిఎంబి)లో పంజాబ్ శాశ్వత సభ్యత్వాన్ని రద్దు చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని కూడా వారు ఆరోపించారు.

## ఉన్నావ్ అత్యాచారం కేసు...

# కుల్దీప్‌సింగ్ సెంగార్‌కు ఎదురుదెబ్బ

- జైలు శిక్ష నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశం




**న్యూఢిల్లీ :** ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవిత ఖైదు పడిన బిజెపి బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ (సిజెఐ), జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తనను దోషిగా తేల్చడం, యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సెంగర్ వేసిన అప్పీల్‌ను రెండు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఒకవేళ దోషిగా తేల్చడంపై నిర్ణయం తీసుకోలేకపోతే.. యావజ్జీవ శిక్షను నిలిపివేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌పైనైనా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసు అర్హతలపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, హైకోర్టు కొత్తగా విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యేను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించవచ్చా, లేదా అనే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని సిజెఐ హైకోర్టుకు సూచించారు. 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డారని కుల్దీప్ సింగ్ సెంగర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. సెంగర్‌ను దోషిగా తేలుస్తూ జీవితఖైదు విధించింది. ఆ తర్వాత సుప్రీం ఆదేశాలతో ఈ కేసు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై గతేడాది చివర్లో విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును బాధితురాలి తరఫు న్యాయవాదులు, సిబిఐ అధికారులు సుప్రీంలో సవాల్ చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం.. సెంగర్ విడుదలపై స్టే విధించింది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

# పినరయ్ విజయన్ నివాసానికి సతీశన్



**తిరువనంతపురం :** కేరళ తదుపరి ముఖ్యమంత్రి వి.డి. సతీశన్, శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఎఐసిసి సతీశన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటించిన తరువాత గురువారం నుంచి ఆయన సీనియర్ నాయకులను కలుస్తూ వస్తున్నారు. మధ్యాహ్నం 12:10 గంటల తర్వాత ఆయన విజయన్ నివాసానికి చేరుకున్నారు. సతీశన్‌ను ఆహ్వానించడానికి విజయన్, ఆయన కుటుంబ సభ్యులు బయటకు వచ్చారు; ఆ తర్వాత ఇద్దరు నాయకులు లోపలికి వెళ్లి చర్చలు జరిపారు. సతీశన్‌ను ఇంటి లోపలికి తీసుకువెళుతూ విజయన్ ఆయన చేతిని పట్టుకున్నారు. టీ తాగుతూ సరదాగా గడిపిన ఆ సమయంలో, వారు ఆరోగ్యం, ఆహార నియమాల గురించి కూడా మాట్లాడుకున్నారు. విజయన్ అనుసరించే క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని సతీశన్ అభినందించారు. ఎల్‌డిఎఫ్ అధికారాన్ని కోల్పోయి, విజయన్ తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన తర్వాత, బేకరీ జంక్షన్ వద్ద ఈ నివాసాన్ని ఇటీవల అద్దెకు తీసుకున్నారు. 2021 నుండి 2026 వరకు విజయన్ ముఖ్యమంత్రిగా తన రెండవ పదవీకాలాన్ని కొనసాగించిన సమయంలో, కేరళ అసెంబ్లీలో సతీశన్ ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. సతీశన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనుండటంతో సిపిఐ(ఎం) శాసన సభ పక్ష నాయకుడిగా ఎన్నికైన విజయన్, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు స్వీకరిస్తారని భావిస్తున్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో, అసెంబ్లీ లోపల, బయట ఈ ఇద్దరు నాయకుల మధ్య అనేక సందర్భాల్లో వాదోపవాదాలు జరిగాయి. కాగా, ఈ పర్యటన అనంతరం, సతీశన్, విజయన్ సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. కేరళలో అత్యంత సీనియర్ నాయకులలో ఒకరైన విజయన్, 10 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా, 16 ఏళ్ల పాటు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించారని పేర్కొంటూ, తాను ఆయనను కలిశానని సతీశన్ తెలిపారు. 'మేము ఒక కీలకమైన బాధ్యతను స్వీకరించాము, అలాగే ఆయన ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. రాజకీయాల కారణంగా అన్ని విషయాలపై మా ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోయినప్పటికీ, కేరళకు సంబంధించిన కీలక అంశాల విషయంలో మేమిద్దరం కలిసి నిలబడాలి; అది సాధ్యమవుతుందని నేను ఆశిస్తున్నా ను. ఈ విషయంలో నేను ఆయన మద్దతును కోరా ను' అని ఆయన అన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను రద్దు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. 18న జరిగే ప్రమాణ స్వీకార కా ర్యక్రమానికి తాను విజయన్‌ను ఆహ్వానించినట్లు సతీశన్ తెలిపారు. విజయన్ హాజరవుతారా అని విలేకరులు ప్రశ్నించినప్పుడు, సతీశన్ 'తప్పకుం డా' అని బదులిచ్చారు. అయితే, విజయన్ విలేకరుల ప్రశ్నలకు స్పందించలేదు; తాను వారిని త ర్వాత కలుస్తానని చెప్పారు. విజయన్‌ను కలవడానికి ముందు, సతీశన్ ఎమ్మెల్యే హాస్టల్‌లో కేరళ కాంగ్రెస్ నాయకుడు పి.జె. జోసెఫ్‌ను, ఇతర పార్టీ నాయకులను కలిశారు. ఆ తర్వాత ఆయన మాజీ స్పీకర్ జి. కార్తికేయన్ నివాసానికి వెళ్లారు. కార్తికేయన్ సతీమణి ఎం.టి. సులేఖను చూడగానే సతీశన్ భావోద్వేగానికి లోనయ్యారు. సులేఖతోనూ, తిరువనంతపురం కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఉన్న వారి కుమారుడు కె.ఎస్. శబరినాథన్‌తోనూ ముచ్చటించిన అనంతరం, సులేఖ మాట్లాడుతూ సతీశన్ కార్తికేయన్‌కు సొంత పెద్ద కుమారుడి లాంటి వాడని అన్నారు. శబరినాథన్ కూడా సతీశన్‌కు విజయం చేకూరాలని శుభాకాంక్షలు తెలిపారు.

## కాంకేర్ అడవుల్లో భారీగా మావోయిస్టుల ఆయుధాలు స్వాధీనం



**కాంకేర్:** ఛత్తీస్‌గాడ్‌లోని కాంకేర్ జిల్లా అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ముమ్మర గాలింపు చర్యల్లో మావోయిస్టులకు చెందిన భారీ ఆయుధ నిల్వలు బయటపడ్డాయి. గత ఒకటిన్నర మాస కాలంగా సాగించిన ఆపరేషన్‌లో సుమారు 50 తుపాకులు, భారీగా మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. మార్చి 31వ తేదీన ఛత్తీస్‌గాడ్‌ను సాయుధ మావోయిస్టుల రహిత రాష్ట్రంగా ప్రకటించిన నేపథ్యంలో, గతంలో వారు అటవీ ప్రాంతాల్లోని భూగర్భ డంపుల్లో దాచి ఉంచిన నగదు, ఆయుధాలను వెలికితీసేందుకు బస్తర్ రీజియన్ వ్యాప్తంగా భద్రతా బలగాలు గాలింపును ముమ్మరం చేశాయి. ఏప్రిల్ 1 నుండి మే 14వ తేదీ వరకు జిల్లా పోలీసులు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్స్, సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్) సిబ్బంది సంయుక్తంగా మారుమూల అడవుల్లో ఈ వేటను కొనసాగించారు. కాంకేర్ ఎస్‌పి నిఖిల్ రాఖేచా తెలిపిన వివరాల ప్రకారం, ఈ సోదాల్లో ఒక 7.62 mm ఎస్‌ఎల్‌ఆర్ ఎల్‌ఎంజి, ఒక 5.56 mm ఎల్‌ఎంజి, ఐదు .303 రైఫిళ్లు, 11 సింగిల్ షాట్ నాటు తుపాకులు, 8 బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు (బిఎల్‌జి), 15 సింగిల్ షాట్ 12 బోర్ గన్‌లు సహా మొత్తం 50 ఆయుధాలు లభ్యమయ్యాయి. వీటితో పాటు 10 కుక్కర్ బాంబులు, 46 కేజీల పేలుడు పదార్థాలు, 469 తూటాలు, 4 వాకీటాకీలు నిత్యవసర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాంకేర్తో పాటు పొరుగు జిల్లాలైన బీజాపూర్, నారాయణపూర్ ప్రాంతాల్లో కూడా గత కొన్ని రోజులుగా నిర్వహించిన సోదాల్లో సుమారు రూ. 1.65 కోట్ల నగదు, పెద్ద ఎత్తున తుపాకులు దొరకడం గమనార్హం. మావోయిస్టుల నెటవార్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ఈ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# సుప్రీంలోనూ పొదుపు

### సోమ, శుక్రవారాలలో ఆన్‌లైన్ విచారణలు



**న్యూఢిల్లీ :** పెట్రోల్, డీజిల్ రేట్లు భారీగా పెరిగిపోయిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇంధన పొదు పు చర్యలు చేపట్టింది. ఇక నుంచి వారంలో రెం డు రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తామని తెలిపింది. జడ్జీలు కార్‌పూలింగ్ పాటిస్తాయి. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేశారు. సిబ్బందిలో 50 శాతం వర్క్ ఫ్రం హోమ్ పాటిస్తారు. ఇప్పటికే ఢిల్లీ ప్రభుత్వం అనేక పొదుపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. ప్రతి సోమవారం మెట్రోలో కార్యాలయాలకు రావాలని ఉద్యోగులకు సూచించింది. అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం కోత విధించింది. సిఎం, మంత్రుల కాన్వాయ్‌ని సగానికిపైగా తగ్గించింది.

# రూపాయి మరింత పతనం



**ముంబయి:** అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ భారీగా పతనం అయ్యింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా డాలర్ విలువ తొలిసారి రూ.96 మార్కును దాటింది. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో 95.96 వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి విలువ.. శుక్రవారం మధ్యా హ్నం 96.07 కనిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల నేపథ్యం లో మన రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. రూ పాయి విలువ పతనమైతే.. దిగుమతి చేసుకునే వంట నూనెలు, చమురు, సహజవాయువు, ఎలక్ట్రానిక్స్, బంగారం, లగ్జరీ కార్లు, గడియారాలు మరింత ఖరీదు కానున్నాయి. నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ప్రజ ల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. వి దేశీ ఉన్నతవిద్య కోసం తమ పిల్ల ల్ని పంపిన తల్లిదండ్రులపై భారం పెరుగుతుంది. అదే సమయంలో మన దేశం నుంచి వస్తువులు, సేవలు ఎగుమతి చేసేవారికి మాత్రం లాభం కలుగుతుంది.


## శాంతి స్థాపనలో భారత్ కీలక పాత్ర పోషించగలదు: అరాగ్చీ



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా శాంతి స్థాపనలో భారత్ గొప్ప పాత్ర పోషించగలదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అన్నారు. ఇరాన్‌కు సంబంధించిన సైనికరమైన పరిష్కారమేమీ లేదని చెప్పారు. హోర్మూజ్ జల సంధి గుండా అన్ని దేశాల నౌకాయానానికి సహకరించేందుకు ఇరాన్ సిద్ధమన్నారు. అయితే హోర్మూజ్ జల సంధి ప్రస్తుత పరిస్థితి చాలా సంక్లిష్టంగా మారిందని తెలిపారు. బ్రిక్స్ సదస్సు కోసం భారత్ వచ్చిన ఆయన న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. అణ్వస్త్రాలను ఇరాన్ ఎప్పుడు కోరుకోలేదన్నారు. పశ్చిమాసియా సంక్షోభంపై చర్చించి, సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవడం ఒక్కటే మార్గమని చెప్పారు. భారత్ నిర్మాణాత్మక పాత్రను స్వాగతిస్తామన్నారు. నమ్మకం లేకపోవడమే అమెరికాతో తమ చర్చల్లో ప్రధాన సమస్య అని అరాగ్చీ తెలిపారు. అమెరికాను నమ్మకపోవడానికి ఇరాన్ ఇద్ద అనేక కారణాలు ఉన్నాయన్నారు. అమెరికన్లు ఇరాన్‌ను నమ్మకపోవడానికి ఒక్క కారణం కూడా లేదన్నారు. పాకిస్థాన్ దౌత్యం కొనసాగుతోందని, అది విఫలం కాలేదని అరాగ్చీ తెలిపారు.

# పశ్చిమాసియాలో శాంతికి భారత్ మద్దతు

- యుఎఇతో ఏడు కీలక రంగాల్లో భాగసామ్యం
- ఇంధన, రక్షణ ఒప్పందాలపై ప్రధాని సంతకాలు



**అబుదాబి :** పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి సాధ్యమైన మేరకు అన్ని విధాలుగా మద్దతు ఇ వ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ప్రధాన మం త్రి నరేంద్రమోదీ అన్నారు. ఆయన శుక్రవారం యు ఎఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో జరిపిన చర్చల సందర్భంగా ఈ విషయా న్ని స్పష్టంచేశారు. ఇంధనం, రక్షణ, సాంకేతిక రం గాలలో వ్యూహాత్మక సహకారాన్ని పటిష్ఠం చేసుకునేందుకు ఒప్పందాలపై భారత్–యుఎఇ దేశాలు సంతకాలు చేశాయి. యుఎఇ కూడా భారతదేశంలో 5 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులను ప్రకటించిందని మోదీ చెప్పారు. నాలుగు యురోపియన్ దేశాలు సహా తన 5 దేశాల పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి గల్ఫ్ దేశంలో అడుగుపెట్టిన కొద్ది సేపటికే మోదీ–అల్ నహ్యాన్ సమావేశం జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ యుఎఇలో దాదాపు రెండున్నర గంటల పాటు గడిపిన అనంతరం నెదర్లాండ్స్‌కు వెళ్లిపోయారు. 'యుఎఇపై దాడులను మే ం ఖండిస్తున్నాం' అని యుఎఇ నాయకుడితో మోదీ జరిపిన సమావేశంలో మోదీ తన ప్రారంభ ప్రసంగంలో వెల్లడించారు. ప్రముఖ అమెరికా సైనిక స్థావరానికి ఆతిథ్యం ఇస్తున్న యుఎఇ ఫిబ్రవరి 28నుంచి కొనసాగుతోన్న అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధంలో భాగంగా ఇరాన్ నుంచి దాడులను ఎదుర్కొంటోంది, మోదీ మాట్లాడుతూ 'యుఎఇని లక్ష్యంగా చేసుకున్న తీరు ఎంతమాత్రం ఆమోద యోగ్యం కా దు' అని, ప్రస్తుత పరిస్థితిని యుఎఇ సంయమనం తో ఎదుర్కొన్న తీరు ప్రశంసనీయమని అన్నారు. ప శ్చిమాసియా సంఘర్షణ ప్రభావం ప్రపంచవ్యాప్తం గా ఎలా పడుతుందనే విషయమై ప్రధానమంత్రి నరే ంద్రమోదీ మాట్లాడుతూ పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి సాధ్యమైన మేరకు అన్ని విధాలా మద్దతు ఇవ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉందని వివరించారు. సమావేశంలో ఇద్దరు నాయకులు ప్రధానంగా ఏడు రంగాలలో వ్యూహాత్మక సహకార ఒప్పందాలపై సంతకాలు చేశారు.'యుఎఇ పర్యటనలో ఇంధనం, రక్షణ, మౌలిక సదుపాయాలు, షిప్పింగ్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వంటి కీలక రంగాలలో ముఖ్యమైన ఒప్పందాలు కుదిరాయి. అది భారత్–యుఎఇ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊపునిచ్చింది' అని మోదీ సోషలల్ మీడియాలో తెలిపారు. మరో ముఖ్యమైన పరిణామంగా, యుఎఇ, భారతదేశంలో 5 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులను ప్రకటించిందని, ఇది ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) ప్రకారం...దేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను నిర్వహించే ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇండియన్ స్ట్రాటజీస్ పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ వ్యూహాత్మక సహకారం లక్ష్యంగా అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. 'ఇంధన భద్రత, భారతదేశం పెట్రోలియం నిల్వలను పెంపొందించడం, ద్రవ సహజవాయువు, ద్రవ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి)నిల్వ సౌకర్యాలపై సంభావ్య సహకారం దీని లక్ష్యం' అని అది పేర్కొంది. భారతదేశంలో అత్యధికంగా ఉపయోగించే వంట ఇంధనమైన ఎల్‌పిజి దీర్ఘకాలిక సరఫరా, ఆర్థిక స్థిరత్వం, ఇంధన భాగస్వామ్యం లక్ష్యంగా ఇద్దరు నాయకులు ఎల్‌పిజి రంగంలో ఒక వ్యూహాత్మక సహకార ఒప్పందపై కూడా సంతకాలు చేశారు. రక్షణ పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేయడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, జాతీయ, ప్రాంతీయ భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా వ్యూహాత్మక రక్షణ భాగాస్వామ్యానికి సంబంధించిన ఒక ఫ్రేమ్‌వర్క్ పై కూడా వారు సంతకం చేశారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. మోదీ వెళుతూ 'ఈ పర్యటన ఫలితాలు మన స్నేహాన్ని మరింత బలోపేతం చేసి, అభివృద్ధి, శ్రేయస్సుకు దోహదపడతాయని నేను బలంగా విశ్వసిస్తున్నాను' అని చెప్పారు. శుక్రవారం ఉదయం యుఎఇకి చేరుకున్న ప్రధాని మోదీకి అబుదాబి విమానాశ్రయంలో అల్ నహ్యాన్ స్వాగతం పలికారు.మోదీకి ఈ సందర్భంగా గౌరవవందనాన్ని సమర్పించారు. యుఎఇ నుంచి మోదీ నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలలో పర్యటనకు వెళ్లిపోయారు.

# తైవాన్‌కు ఆయుధాలపై నిర్ణయం తీసుకోలేదు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**బీజింగ్ :** తైవాన్‌కు అమెరికా భారీ ఆయుధాల విక్రయాన్ని ముందుకు తీసుకెళ్లాలా వద్దా అనే అంశంపై తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ అన్నారు. చైనా నుంచి శుక్రవారం ఎయిర్ ఫోర్స్ వన్‌లో అమెరికా తిరిగి వెళ్తున్న సందర్భంలో విలేకరులతో మాట్లాడుతూ, దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, అయితే తాను ఒక నిర్ణయం తీసుకుంటానని అని ట్రంప్ తెలిపారు. ట్రంప్ రిపబ్లికన్ ప్రభుత్వం ఈ విక్రయానికి అధికారం ఇచ్చింది, కానీ అది ఇంకా ముందుకు సాగలేదు. చైనా ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తోంది. చైనా–అమెరికా సంబంధాలలో స్వయం పరిపాలన కలిగిన ఈ ద్వీపంతో వాషింగ్టన్ సంబంధమే కీలక అంశమని సూచించింది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని షీ తనకు చెప్పారని ట్రంప్ అన్నారు. తాను ఆయన చెప్పింది విన్నానని, అయితే ఎలాంటి వ్యాఖ్యలు లేదని చెప్పారు.

**షీ అన్నట్లు.. అమెరికా పతనంలో ఉంది.. కానీ..**
**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

అమెరికా పతనం దిశగా ఉందని తన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చేసిన అంచనా వంద శాతం సరైనదేనని, అయితే ఈ వ్యాఖ్యలు అవి తనకంటే ముందు అధ్యక్షుడుగా ఉన్న జో బైడెన్ హయానికి సంబంధించినవి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా బహుశా పతనమవుతున్న దేశమని అధ్యక్షుడు షీ చాలా చక్కగా పేర్కొన్నప్పుడు, ఆయన స్లీపీ(నిద్రలో జోగే) జో బైడెన్ , ఆయన పరిపాలనలోని నాలుగేళ్లలో మనం అనుభవించిన అపారమైన నష్టాన్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశారని, ఆ విషయంలో ఆయన వంద శాతం సరైనవారని అని ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.



**ఇరాన్ ఖతమైపోయింది : ట్రంప్**

ఇరాన్ ఖతం అయిపోయిందని, కొనసాగుతున్న సంఘర్షణను ముగించేందుకు ఒక ఒప్పందం కుదుర్చుకోవడమో లేదా వినాశనాన్ని ఎదుర్కోవడమో చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్‌కు ఒప్పందం లేదా సర్వనాశనం అని చైనాలో తన మూడు రోజుల పర్యటన చివరి రోజున ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు.

**చైనా 200 బోయింగ్ విమానాలను కొంటుంది ఆ సంఖ్య 750 వరకు పెరిగే అవకాశం : ట్రంప్**

**ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం నుంచి :** దాదాపు దశాబ్ద కాలంలో విమాన తయారీ సంస్థ బోయింగ్ నుంచి చైనా 200 విమానాల విక్రయింబోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. చైనా నుంచి అమెరికాకు తిరిగి వెళ్తూ ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ఆయన జర్నలిస్టులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఈ మేరకు ఒప్పందం కుదిరిందని, ఇది 750 విమానాల వరకు పెరగవచ్చని ఆయన చెప్పారు. అయితే , వైట్ హౌస్ ఈ ఒప్పందం వివరాలను విడుదల చేయలేదు. అలాగే బోయింగ్ సంస్థ కూడా దీనిపై వ్యాఖ్యానించలేదు. చైనాకు ఉత్పత్తులు, సేవలను విక్రయించాలని కోరుకుంటున్న సిఇఓలతో కూడిన పెద్ద బృందంలో ఒకరైన బోయింగ్ సిఇఒ కెల్లీ ఓర్ట్‌బర్గ్ బీజింగ్ పర్యటనకు ట్రంప్‌తో పాటు వెళ్లారు.

# హోర్మ్యూజ్‌ను ఇరాన్ దిగ్బంధించలేదు

సెర్గీ లావ్రోవ్



**మాస్కో :** దౌత్య అనుభవం, అంతర్జాతీయ ప్రతిష్ఠ ఉండటంతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గించడానికి సమర్థ మధ్యవర్తిగా భారత్ కీలక పాత్ర పోషించగలదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చల కోసం పాకిస్థాన్ ప్రయత్నిస్తోందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎఇ పర్యటన సమయంలో లావ్రోవ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. పశ్చిమాసియా సంక్షోభం, హోర్మ్యూజ్ జలసంధి దిగ్బంధం గురించి మాట్లాడుతూ, ఇరాన్ రెచ్చగొట్టకపోయినా అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణకు దిగాయని ఆరోపించారు. పర్షియన్ గల్ఫ్‌లో అస్థిరతకు ఇరాన్‌ను నిందిచలేమని చెప్పారు. బ్రిక్స్ సదస్సు క్రమంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయిల; ఇరాన్ దాడులను ఆక్షేపించారు. హోర్మ్యూజ్ జల సంధిలో సురక్షిత నౌకాయానాన్ని కాంక్షించారు. ఘర్షణ/యుద్ధం మూల కారణాన్ని తెలుసుకోవడం అవసరం. ఇరాన్ రెచ్చగొట్టకపోయినా, అమెరికాఇజ్రాయిల్ దాడులకు దిగాయి. కానీ హోర్మ్యూజ్ జల సంధిని తెరవాలని ఇరాన్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఫిబ్రవరి 28వ తేదీకి ముందు హోర్మ్యూజ్ విషయంలో ఏ సమస్య రాలేదు. మరి ఇప్పుడు ఇబ్బంది ఎందుకు వచ్చింది. దురాక్రమణ ప్రారంభం కాకముందు నౌకాయానం సాఫీగా, సురక్షితంగా సాగింది. అమెరికాఇజ్రాయిల్ దాడులు చేశాయి. వాస్తవానికి హోర్మ్యూజ్ జల సంధిని దిగ్బంధించినది ఇరాన్ కాదు. ఈ యుద్ధాని ముగించడం, కాల్పులు విరమించడం ఎంతైనా ముఖ్యం' సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. హోర్మ్యూజ్ జలసంధి స్థిరత్వాన్ని, అంతరాయం లేని నౌకాయానాన్ని నిర్ధరించడంలో బ్రిక్స్ నిర్మాణాత్మక పాత్రను పోషించగలవన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. 'ప్రస్తుతం బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్ ఉంది. పశ్చిమాసియా స్థిరత్వంలో దానికి ప్రత్యక్ష ప్రయోజనాలు ఉన్నాయి. భారత్‌కు ఈ ప్రాంతం నుంచి చమురు పొందడంలో ప్రత్యక్ష ఆసక్తి ఉండటంతో మధ్యవర్తిత్వం వహించవచ్చు. ఇరాన్, ఏఈను ఆహ్వానించి, శత్రుత్వాలు రాకుండా చర్చలు జరపవచ్చు' అని అన్నారు. ఇరాన్, అరబ్ దేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఉద్రిక్తతలను తగ్గించే ందుకు రష్యా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు కూడా సెర్గీ లావ్రోవ్ చెప్పారు.

## గూఢచార సహకారం, ఆర్థిక స్థిరత్వం, భద్రతా సమస్యలపై

# సిఐఎ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ సమావేశం

**హవానా :** క్యూబా పర్యటన సందర్భంగా సిఐఎ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ గురువారం నాడు రౌల్ కాస్ట్రో మనవడు రౌలిటో రోడ్రిగ్జ్ కాస్ట్రోతో సహా క్యూబా అధికారులతో సమావేశమయ్యారని క్యూబా, అమెరికా అధికారులు తెలిపారు. రాట్‌క్లిఫ్, రౌలిటో రోడ్రిగ్జ్ కాస్ట్రో, అంతర్గత వ్యవహారాల మంత్రి లజారో అల్వారెజ్ కాసాస్, క్యూబా గూఢచార సేవల అధిపతితో సమావేశమై గూఢచార సహకారం, ఆర్థిక స్థిరత్వం, భద్రతా సమస్యలపై చర్చించారు. ఈ సమావేశాలను ఒక సిఐఎ అధికారి అసోసియేటెడ్ ప్రెస్‌కు ధృవీకరించారు. ఆర్థిక, భద్రతా సమస్యలపై గంభీరంగా చర్చించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని, కానీ క్యూబా ప్రాథమిక మార్పులు చేస్తేనే అది సాధ్యమనే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సందేశాన్ని వ్యక్తిగతంగా అందించడానికే రాట్‌క్లిఫ్ క్యూబా పర్యటనకు వెళ్ళారు. కరేబియన్ దేశంపై అమెరికా విధించిన ఇంధన దిగ్బంధం, క్యూబా విద్యుత్ గ్రిడ్ కుప్పకూలడం, దాని తూర్పు ప్రావిన్సులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి కారణాల వల్ల ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతలు అధికంగా ఉన్న నేపథ్యంలో, తమ ద్వీపంలో అమెరికా అధికారులతో ఇటీవల సమావేశమైనట్లు క్యూబా ప్రభుత్వం ధృవీకరించిన కొన్ని వారాల తర్వాత గురువారం నాటి సమావేశం జరిగింది. ద్వీపానికి ఇంధనంపై అమెరికా విధించిన దిగ్బంధనం, పనివేళలు తగ్గడం, రిఫ్రిజిరేటర్లు పనిచేయకపోవడంతో ఆహారం పాడైపోవడం వంటి సమస్యలతో దాని ఆర్థిక కష్టాలను మరింత తీవ్రతరం చేసింది. ఈ వారం మొదట్లో క్యూబా ప్రభుత్వం అనుమతిస్తే క్యూబాకు 100 డాలర్ల మానవతా సహాయం, శాటిలైట్ ఇంటర్నెట్‌కు మద్దతు అందిస్తామని అమెరికా విదేశాంగ శాఖ పునరుద్ఘాటించింది. జనవరి చివరిలో క్యూబాకు చమురు అమ్మే లేదా సరఫరా చేసే ఏ దేశంపైనైనా సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఆ దేశంలో జోక్యం చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ, ఒకవేళ అలా జరిగితే తమ దేశం పోరాటానికి సిద్ధంగా ఉందని క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్‌కానెల్ ఇటీవల స్పష్టం చేశారు.



# మా ఇల్లు ఎందుకు కూల్చేశారు?

నేపాల్ ప్రధానికి చిన్నారి ప్రశ్న

**ఖాట్మండు :** నేపాల్ రాజధాని ఖాట్మండులో ఆక్రమణల తొలగింపు చర్యల క్రమంలో ప్రధాని బాలేంద్ర షాకు 11 ఏళ్ల రాధిక మహతో రాసిన లేఖ పెద్దఎత్తున చర్చకు దారితీసింది. 'మా కుటుంబం మీ పార్టీకి ఓటు వేసింది. మా ఇల్లు ఎందుకు కూల్చేశారు? మేమెక్కడ ఉండాలి? ఎక్కడ చదువుకోవాలి?' అంటూ ఆ చిన్నారి ప్రశ్నించింది. ఈ బాలిక కుటుంబం థపథలి ప్రాంతంలో ఓ గుడిసెలో జీవిస్తోంది. ఆక్రమణల తొలగింపుతో ఆమె కుటుంబం వీధినపడింది. ఖాట్మండుకు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న బనేపా మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరానికి వీరిని తరలించారు. కొత్త ప్రాంతానికి వెళ్లిన తర్వాత రాధిక చదువు ఆగిపోయింది. ఖాట్మండులోని గుహేశ్వరి బాల శిక్ష సెకండరీ స్కూల్‌లో వడో తరగతి చదువుతున్న ఆమె... తన బాధను నేరుగా ప్రధానికి లేఖ రాసింది. 'ఇల్లు అద్దెకు తీసుకునే డబ్బు మా వద్ద లేదు. మా గూడ కూల్చి మమ్మల్ని నిరాశ్రయులు చేశారు. మా పరిస్థితిని మరింత దారుణంగా మార్చేశారు. మాకు ఉండడానికి చోటు కావాలి. చదువుకునేందుకు స్కూల్ కావాలి' అంటూ తన ఆవేదనను రాధిక ఆ లేఖలో వ్యక్తపరిచింది. నేపాల్‌కు చెందిన ప్రముఖన్యూస్ పోర్టల్ రతోపాటి ఈ లేఖను ప్రచురించడంతో అది వైరలైంది. చిన్నారికి మద్దతుగా నెటిజన్లు స్పందిస్తున్నారు. అయితే ప్రభుత్వ భూములు, నదీ పరివాహక ప్రాంతాలలో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నామని అధికారులు చెప్పారు. 15 వేల మందికి పైగా భూమి లేని పేదలు ఇళ్లను కోల్పోగా నాలుగు వేల తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిసింది. ఈ కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆదేశాలు, రాజకీయ దూమారంతో ఇది మరింత వివాదాస్పందంగా మారింది. 'ఇళ్లు కూల్చే ముందు పునరావాసం కల్పించాలన్న డిమాండ్ పెద్దఎత్తున వినిపించింది. రాధిక మహతో లేఖ నేపాల్ ప్రభుత్వ చర్యల మానవీయ కోణాన్ని ప్రశ్నించింది. 'మేమెక్కడ చదవాలి' అన్న చిన్నారి ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చే సమాధానం ఏమిటన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

## మూల్యం చెల్లిస్తున్నారు
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వ నాయకత్వ సంక్షోభం, దూరదృష్టి లేకపోవడం, విపరీతమైన అసమర్థతేనని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలి' అని ఆయన ఆరోపించారు. డీజిల్ ధరలు పెరిగినప్పుడు, ద్రవ్యోల్బణం దేశవ్యాప్తంగా గొలుసుకట్టు ప్రభావాన్ని చూపుతుందని, ఇది పరిశ్రమల నుండి గృహ బడ్జెట్‌లు, రైతుల వరకు ప్రతి ఒక్కరినీ ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని ఖర్గే అన్నారు. పశ్చిమ ఆసియా యుద్ధం చెలరేగినప్పుడు, దేశానికి అంతాబాగానే ఉంది అని చెప్పి, కాంగ్రెస్ పార్టీ ప్రశ్నలను పట్టించుకోలేదని, ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదని, దానికి బదులుగా, అమెరికా అనుమతి కోసం మన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. ఇప్పుడు, సంక్షోభం తీవ్రమవుతున్నా కొద్దీ, మోదీ వర్క్ ఫ్రమ్ హోమ్, ఇంధన పొదుపు వంటి ఆలోచనలను ప్రచారం చేయడం ప్రారంభించారన్నారు. తమ పార్టీకి రెండు ప్రశ్నలు ఉన్నాయని కూడా ఆయన తెలిపారు.

## తక్షణమే వెనక్కి
**(మొదటి పేజీ తరువాయి)**

అవుతుందని పేర్కొంది. కార్పొరేట్ లాభాలను కాపాడుతున్న మోదీ ప్రభుత్వం... తన వైఫల్యాల భారమంతా ప్రజలపై వేస్తోందని విమర్శించింది. మోదీ వినాశకరమైన విదేశాంగ విధానమే ఈ సంక్షోభానికి కారణమని... భారతీయ వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని ఆయన అమెరికా, ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పూర్తిగా దాసోహం చేశారని సీపీఐ దుయ్యబట్టింది. రష్యా, ఇరాన్ నుంచి చమురు దిగుమతులు తగ్గించుకునేలా అమెరికా ఒత్తిడి చేసి... దేశ ఇంధన భద్రతను బలహీనపర్చి... అంతర్జాతీయ ఒడిదుడుకులను ఎదుర్కొనే పరిస్థితి తెచ్చి... భారత్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించింది. జాతీయ ప్రయోజనాల కోసం కాదు రాజకీయ గులాంగిరీ వల్ల దేశం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించింది. ప్రధానికి ఆప్తుడైన గౌతం అదానీపై ఉన్న కేసులను అడ్డుపెట్టుకొని మోదీని తనకు నచ్చినట్లుగా ట్రంప్ ఆడిస్తున్నారని పేర్కొంది. భారతదేశ సార్వభౌమత్వానికి, ఆర్థిక వ్యవస్థకు హానికరమైన ఒప్పందాలను చేసుకుంటున్నారని తెలిపింది. మోదీ పాలనలో అదానీ ఆస్తులు అమాంతం పెరగడాన్ని సీపీఐ ప్రస్తావించింది. మోసం, లంచం కేసులో అమెరికాకు 18 మిలియన్ డాలర్ల జరిమాలు చెల్లించేందుకు అదానీ సిద్ధమైనట్లు వెల్లడించింది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సంబంధించిన భారతీయ అధికారులకు లంచాలు ఇచ్చినట్లు, నిధుల కోసం పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించినట్లు అదానీపై అమెరికా అధికారులు 2024లో అభియోగాలు మోపడాన్ని సీపీఐ గుర్తుచేసింది. అసలు ఆ భారతీయ అధికారులు ఎవరు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? మోదీ ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోంది? అవినీతి జరిగినట్లయితే రాజీ ఎందుకు? అవినీతిని కప్పిపుచ్చుతున్నది... కాపాడుతున్నది ఎవరు? అంటూ వరుస ప్రశ్నలు సంధించింది. వాస్తవాలను దాచిపెట్టడం కష్టమని, ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గ లాభాలకు ప్రాధాన్యతిస్తూ... నష్టాల భారాన్ని ప్రజల మీదకు నెట్టివేస్తున్నారని సీపీఐ ఆక్షేపించింది. 'వంట గ్యాస్ కోసం పేదలు అధికంగా చెల్లిస్తున్నారు. డీజిల్ కోసం రైతులు... రవాణా కోసం కార్మికులు ఎక్కువగా చెల్లిస్తున్నారు.

అయితే రాజకీయాలతో ముడిపడ్డ కొద్దిమంది సంపన్నులు మాత్రం లాభాలు గడిస్తున్నారు' అని వ్యాఖ్యానించింది. ఆశ్రిత పెట్టుబడిదారులు, విదేశీ ప్రయోజనాల కోసం రికవరీ ఏజెన్సీగా దేశాన్ని మోదీ ప్రభుత్వం నడపలేదని సీపీఐ తేల్చిచెప్పింది. ఇంధన ధరల పెంపును తక్షణమే ఉపసంహరించాలని సూచించింది. లంచం, అవినీతి, ప్రలోభాలపై, అదానీ గ్రూపుకు రాజకీయ రక్షణ కల్పనపై, ప్రమేయమున్న అధికారులపై స్వతంత్ర దర్యాప్తును డిమాండ్ చేసింది. కార్పొరేట్ శక్తులు, రాజకీయ శక్తుల మధ్య అనైతిక పొత్తులను కాపాడటం కోసం దేశ ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం స్పష్టం చేసింది.

# అదానీ రాజీ

**(మొదటి పేజీ తరువాయి)**

లంచాలు చెల్లించే పథకాన్ని అదానీలు రూపొందించారని, నిధులు సమీకరించేందుకు ఈ పథకాన్ని అమెరికా పెట్టుబడిదారులు, బ్యాంకుల నుండి దాచిపెట్టారని ఆరోపిస్తూ అమెరికా న్యాయ శాఖ క్రిమినల్ ఫిర్యాదు కూడా చేసింది.

ఇతర నిందితులపై మోపబడిన మరింత తీవ్రమైన విదేశీ అవినీతి నిరోధక చట్టం, లంచం ఆరోపణలలో అదానీ పేరు లేనప్పటికీ, ప్రాసిక్యూటర్లు ఆయనపై సెక్యూరిటీల మోసం,వైర్ ఫ్రాడ్ చట్టాల కింద అభియోగాలు మోపారు.అదానీ గ్రూప్‌కు గౌతమ్ అదానీ చైర్మన్‌గా ఉండగా, అదానీ గ్రీన్ ఎనర్జీకి సాగర్ అదానీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని, తాము పటిష్టమైన పాలన,నిబంధనల పాటింపు ప్రమాణాలను పాటిస్తున్నామని అదానీ గ్రూప్ గతంలో పేర్కొంది.

అమెరికా అధికారులు, అదానీలు ఏర్పాటు చేసిన న్యాయ బృందం మధ్య నెలల తరబడి జరిగిన సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం వెనక్కి తీసుకోబడింది. ఈ బృందంలో సల్లివన్ – క్రోమ్‌వెల్, నిక్సన్ పీబాడీ, హెకర్ ఫింక్, నార్టన్ రోజ్ ఫుల్‌బ్రైట్, బ్రేస్‌వెల్ సంస్థలకు చెందిన న్యాయవాదులు ఉన్నారు. ఈ కేసును కొనసాగించడానికి ప్రాసిక్యూటర్లకు తగిన సాక్ష్యాధారాలు, అధికార పరిధి లేవని వారు వాదించారు. ఈ కేసును తిరిగి తెరవకుండా నిరోధించేలా, 'విత్ ప్రిజుడిస్' పద్ధతిలో కొట్టివేత జరుగుతుందని భావిస్తున్నట్లు సంబంధిత వ్యక్తులు తెలిపారు.

ప్రధానంగా భారతదేశంలో జరిగిన కార్యకలాపాలను విచారించడానికి అమెరికా ప్రాసిక్యూటర్లు సెక్యూరిటీల చట్టాలను అతిక్రమించారా అనే విషయంపై ఈ కేసు న్యాయ నిపుణుల పరిశీలనకు గురైంది. సోలార్ కాంట్రాక్టులకు సంబంధించిన ఒక పెద్ద లంచాల పథకంలో సహచరులు పాల్గొన్నారని ప్రాసిక్యూటర్లు ఆరోపించినప్పటికీ, గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, ఎగ్జిక్యూటివ్ వీనీత్ జైన్లపై కేవలం సెక్యూరిటీస్ ఫ్రాడ్, వైర్ ఫ్రాడ్ చట్టాల కింద మాత్రమే అభియోగాలు మోపారు. అంతేగానీ, ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సిపిఎ) లంచాల నిబంధనల కింద కాదు.

ప్రభుత్వ వైఖరిని విమర్శిస్తూ ఎస్‌సిపిఎ కింద తగినంత అధికార పరిధి ఆధారం లేకుండా ప్రాసిక్యూటర్లు 'సెక్యూరిటీస్ ఫ్రాడ్ కేసులో లంచాల ఆరోపణలను ఇరికించడానికి' ప్రయత్నించారని ఎస్ఇసి మాజీ కమిషనర్ లారా ఉంగర్ వాదించారు. ఇదిలా ఉండగా, ఇరాన్ ఆంక్షల ఉల్లంఘనలకు సంబంధించిన ట్రెజరీ డిపార్ట్‌మెంట్ దర్యాప్తు కూడా పరిష్కార దశకు చేరుకుందని సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

ఈ విషయం, ఈ గ్రూపుతో సంబంధం ఉన్న ఒక నౌక ద్వారా ఇరాన్ ఎల్‌పిజి దిగుమతికి సంబంధించినది. స్వచ్ఛంద వెల్లడి, ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఒఫాక్) సహకారం తర్వాత ఒక రాజీ ద్వారా ఇది పరిష్కారమవుతుందని భావిస్తున్నారు. ఈ రాజీలో తప్పు ఒప్పుకోకుండా ఆర్థిక జరిమానాలు విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ పరిష్కారాలు ఖరారైతే, దర్యాప్తులు జరుగుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు, ఓడరేవులు, రవాణా, ఇంధన రంగాలలో విస్తరిస్తూనే ఉన్న ఈ బహుళ వ్యాపార సంస్థకు ఉన్న ఒక పెద్ద చట్టపరమైన అడ్డంకి తొలగిపోతుంది.

కంపెనీ ఫైలింగ్‌ల ప్రకారం, అదానీ గ్రూప్‌కు చెందిన లిస్టెడ్ సంస్థలు 2026 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో 5.3 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయి ఇబిఐటిడిఎను నివేదించాయి. ఈ కాలంలో మూలధన వ్యయం కింద దాదాపు 17 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నాయి. ఆరోపించిన లంచం పథకానికి సంబంధించి విశ్వసనీయమైన ఆధారాలు ఏవీ లేవని అదానీల న్యాయవాదులు తెలిపారు. ఆ ఇద్దరు వ్యక్తులపై ఎస్ఇసికి అవసరమైన అధికార పరిధి లేదని, ఈ కేసుకు ఆధారమైన ఆరోపిత తప్పుడు ప్రకటనలపై చర్య తీసుకోలేమని వారు చెప్పారు. హరిత ఇంధనం, ఓడరేవులు, రియాల్టీ, మైనింగ్, వార్తా మాధ్యమాలలో విస్తరించిఉన్న అదానీ గ్రూప్, ఆరోపణలు దాఖలైనప్పటి నుండి బ్లాక్ రాక్‌తో సహా ప్రపంచపెట్టుబడిదారుల నుంచి నిధులు సమీకరిస్తూనే ఉంది.

# జాతీయ రాజకీయాల్లోకి

**(మొదటి పేజీ తరువాయి)**

భ్రమలోనే ఉంటున్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణం కోసం స్పష్టమైన లక్ష్యం, దీర్ఘకాలిక దృష్టి తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తన ఆలోచనల్లో స్పష్టత ఉందని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని సిఎం పేర్కొన్నారు. 100 శాతం ప్రజలను సంతృప్తిపరచాలనుకుంటే అసంతృప్తి తప్పదని, 60 నుంచి 75 శాతం మంది ప్రజలు మన ఆలోచనలను అంగీకరిస్తే అదే పెద్ద విజయం అని సిఎం వ్యాఖ్యానించారు. ఇతరులను అడ్డుకోవడం, కుంగదీయడం వల్ల సమాజానికి మేలు జరగదని, పాజిటివ్ ఎనర్జీతో ముందుకు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. తన మనసుకు నచ్చినట్లు చేస్తానని, అవకాశాల కోసం అవకాశవాదీగా మారనని సిఎం స్పష్టం చేశారు. నిబద్ధతతో పార్టీలో చేరినందునే గాంధీ కుటుంబం తనకు అవకాశం ఇచ్చిందని ఆయన చెప్పారు. మోదీ, బిజెపి మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగు వేసుకుని దక్షిణ భారత దేశాన్ని హత్య చేద్దామనుకున్నారని సిఎం ఆరోపించారు. పార్లమెం ట్ నియోజకవర్గాల పునర్విభజన అనేది జనాభా ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారత దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని సిఎం పునరుద్ఘాటించా రు. రాష్ట్రానికి ఒక ప్రణాళిక ఉండాలని, భవిష్యత్తు పట్ల స్పష్టత ఉండాలని సిఎం అన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రానికి పూర్తి స్థాయి ప్రణాళిక లేదన్నారు. ముఖ్యమంత్రిని అయ్యేంత వరకు 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్నానని, ప్రజా సమస్యలపై తనకు పూర్తి అవగహన ఉందని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బాగుందని, కానీ తాను ఆశించినట్లు లేదని, ప్రపంచ వ్యాప్తంగా రకరకాల కారణాల వల్ల రియల్ ఎస్టేట్ గ్రోత్ తగ్గిందని సిఎం చెప్పారు. "2021 నుంచి 7 ఏళ్లు తీసుకుంటే గతం కంటే ఆదాయం పెరిగింది. ఎక్కడా తగ్గలేదు. కొంత మంది సోషల్ మీడియాలో పెట్టుబడి పెట్టి వాళ్లే రాసి వాళ్లే చూసి వాళ్లే సంతోషిస్తున్నారు. వారు భ్రమల్లో ఉన్నారు. నేను వాస్తవంలో ఉంటా. ఊహజనీతమైన ప్రపంచంలో ఉండను. వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి వస్తదని కొందరు కలలు కన్నారు" అని సిఎం వ్యాఖ్యానించారు. ఎవ్వరు అడ్డం వచ్చినా సరే మూసీ ప్రక్షాళన చేసి తీరుతానని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రకృతి వైపరీత్యాలను తగ్గించేందుకు ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. యుద్ధం జరిగినప్పుడు కొంత మంది అమాయకులు చనిపోతారని, అలాగే ఆక్రమణల తొలగింపు కూడా అన్నారు. నా స్వార్థం కోసం కాకుండా సమాజం కోసం పనిచేస్తున్నానని, ఆక్రమణలు తొలగిస్తుంటే కొంత మంది తిట్టినా పట్టించుకోనని సిఎం స్పష్టం చేశారు. ఆక్రమణలదారులకు ముందే నోటీసులు ఇస్తున్నామన్నారు.

**కొడుకును తీసుకువచ్చి విచారణను ఎదుర్కొవాలి**

బండి సంజయ్ కుమారుడి కేసు విషయంలో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసిన గంటలోనే పోలీసులు పోక్సో కేసు పెట్టారని, బాధితురాలికి తాను న్యాయం చేస్తానని, కేసు విషయంలో 5 పోలీస్ టీమ్ లను నియమించామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

బండి సంజయ్ తక్షణమే కొడుకును తీసుకొచ్చి విచారణ ఎదుర్కోవాలని, పారిపోతే పరిష్కారం కాదని సిఎం సూచించారు. పిల్లల భవిష్యత్ విషయంలో చిన్న తప్పిదం కూడా జరగొద్దని తాను ఆలోచిస్తానన్నారు. నిలబడి విచారణ ఎదుర్కొంటే గౌరవంగా ఉంటుందన్నారు. కుమారుడు విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు అని సిఎం అన్నారు. బండి సంజయ్ ధైర్యంగా ఎదుర్కొవాలని, కొడుకు తప్పిదం వల్ల తలవంపులు వచ్చాయని, బండి సంజయ్ నిలబడి సమాధానం చెప్పాలని, కొడుకును తీసుకువచ్చి స్టేషన్‌లో అప్పగించాలన్నారు. నోటీసు సమయంలో స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, సినిమా వారు, రాజకీయ నాయకులు ఎవరైనా మినహాయింపులు లేవన్నారు. దోషులను చట్టప్రకారం శిక్షిస్తామని, ఒక రోజు ఆలస్యమైనా శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. ఇది పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని, ఏ చిన్న తప్పు చేసినా పిల్లల జీవితాలు నాశనం అవుతాయన్నారు. వంద శాతం బాదితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, తప్పు చేసిన వారిని శిక్షిస్తామని సిఎం స్పష్టంచేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు, త్యాగాలను గౌరవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మాజీ ఎంఎల్‌సి ఎస్. రాము లు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమించింది. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ ఈ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు శుక్రవారం (జిఓఆర్‌టి నం.679) జారీ చేసింది. ఉద్యమం లో కొందరు ప్రాణత్యాగం చేయగా, మరికొందరు శారీరక వైకల్యానికి గురయ్యారు. పలువురిపై కేసులు నమోదై జైలు జీవితం గడిపిన నేపథ్యంలో వారి సేవలను అధికారికంగా గుర్తించాలనే చాలా కాలం గా ఉన్న డిమాండ్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ముందుగా స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధా న బాధ్యత. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తుంది. అనంతరం వారికి ఎలాంటి గుర్తింపు, గౌరవం, సౌకర్యాలు కల్పించాలనే అంశాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. కమిటీ తన నివేదికను ప్రభుత్వాని కి వీలైనంత త్వరగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు కమిటీకి అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## పెట్రో పిడుగు (మొదటి పేజీ తరువాయి)

వర్గాలు తెలిపాయి. విలువ ఆధారిత పన్నులో వ్యత్యాసాల కారణంగా రాష్ట్రాల వారీగా ధరలు మారుతూ ఉంటాయి. ఢిల్లీలో సిఎన్‌జి ధర ఇప్పుడు కిలోకు రూ. 79.09 కాగా, ముంబయిలో రూ. 84 గా ఉంది. అయితే, వంట కోసం ఇళ్లలోకి పైపుల ద్వారా సరఫరా చేసే పైప్డ్ నేచురల్ గ్యాస్ (ఎల్‌పిజి)తో పాటు, గృహ వంటగ్యాస్ అయిన ఎల్‌పిజి ధరలలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడులు, దానికి ప్రతిగా టెహ్రాన్ తీసుకున్న చర్యల వల్ల, ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధి గుండా ఇంధన ప్రవాహాలకు అంతరాయం ఏర్పడినప్పటి నుండి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ముడి చమురు ధరలు పెరిగినప్పటికీ, పెరిగిన ప్రపంచ ఇంధన వ్యయాల నుండి ధరల పట్ల సున్నితంగా ఉండే వినియోగదారులను కాపాడే ప్రయత్నంలో భాగంగా రిటైల్ ఇంధన ధరలను స్తంభింపజేశారు. కానీ, కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఈ చర్య వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు భావించాయి. ఎన్నికలు పూర్తయిన తర్వాత, పశ్చిమ బెంగాల్‌తో సహా ఐదు రాష్ట్రాలకు గాను మూడు రాష్ట్రాల్లో గెలిచి అధికార భారతీయ జనతా పార్టీ తన ప్రభావాన్ని విస్తరించుకోవడంతో ఇంధన ధరల పెరుగుదల చోటుచేసుకుంది. ఈ పెరుగుదల తర్వాత, పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పుడు మే 2022 తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. ఏప్రిల్ 2022 నుండి ధరలు స్తంభించిపోయాయి,

అయితే లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజు ల ముందు, మార్చి 2024లో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ. 2 చొప్పున ఒకేసారి తగ్గింపు ఇచ్చారు. 2022 ఏప్రిల్‌లో చివరిసారిగా ధరలను పెంచారు. ముంబయిలో ఇప్పుడు పెట్రోల్ ధర లీటరుకు రూ. 106.68 కాగా, డీజిల్ ధర లీటరుకు రూ. 93.14గా ఉంది.

కోల్‌కతాలో పెట్రోల్ ధర ఇప్పుడు లీటరుకు రూ.108.74, డీజిల్ ధర రూ. 95.13 గా ఉంది. కాగా, చెన్నైలో పెట్రోల్ ధర రూ.103.67కు, డీజిల్ ధర రూ. 95. 25కు పెరిగింది. ముడి చమురు ధరల పెరుగుదలతో పోలిస్తే ఈ ధరల పెంపు స్వల్పంగానే ఉన్నప్పటికీ, దీనివల్ల రిటైలర్లు పెట్రోల్‌పై లీటరుకు రూ. 11, డీజిల్‌పై లీటరుకు రూ.39 నష్టాలను భరించాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మార్చిలో ప్రకటించిన ఎక్సైజ్ సుంకాల తగ్గింపు తర్వాత శుక్రవారం ఈ నిర్ణయం వెలువడింది. దేశ చమురు దిగుమతుల బిల్లును నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అధిక ఇంధన ధరలు భారతదేశ విదేశీ మారక నిల్వలపై భారం మోపుతూ, వరుసగా మూడో ఏడాది కూడా కరెంట్ ఖాతా లోటును పెంచే ప్రమాదం ఉన్నందున, ప్రధాని మోదీ ఈ వారం ఇంధన పొదుపు, వర్క్‌ఫ్రమ్‌హోమ్ పద్ధతులు, ప్రయాణాలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే తమ శాఖలకు ప్రయాణాలను పరిమితం చేయాలని, ప్రత్యక్ష సమావేశాలను నివారించాలని, కార్యాలయ సిబ్బందిని తగ్గించి పనిచేయాలని ఆదేశించాయి.

# పంజాబ్‌పై శివమెత్తిన తిలక్

## కెప్టెన్‌గా తొలి మ్యాచ్ గెలిపించిన బుమ్రా !

పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు వరసగా ఐదో ఓటమి ఎదురైంది. ధర్మశాలలో తిలక్ వర్మ(75 నాటౌట్) శివమెత్తగా.. ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో పంజాబ్‌ను చిత్తు చేసింది. 201 ఛేదనలో శుభారంభం దక్కినా.. మిడిల్ ఓవర్లలో వికెట్లు పడడంతో పంజాబ్ పోటీలోకి వచ్చింది. కానీ, తిలక్ పట్టువదలకుండా ఆఖరిదాకా నిలబడ్డాడు.. చివరి ఓవర్లో 6, 4 తో ముబైకి ఆరు వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. ఇక కెప్టెన్‌గా తొలి మ్యాచ్లోనే బుమ్రా జట్టును గెలిపించాడు. లీగ్ దశలో ఎనిమిది ఓటములతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగిన ముంబై ఇండియన్స్ ఇతర జట్లను దెబ్బతీస్తోంది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌పైముంబై అదిరే విక్టరీ కొట్టింది. భారీ ఛేదనలో పంజాబ్ బౌలర్లను ఉతికేస్తూ తిలక్ వర్మ(75 నాటౌట్) ఒంటిచేత్తో ముంబైకి నాలుగో విజయం అందించాడు. దాంతో..ఈ మ్యాచ్లోనైనా గెలిచి ముందుకు వెళ్లాలనుకున్న పంజాబ్ 13 పాయింట్ల వద్దే ఆగిపోయింది. ఆఖరి ఓవర్లలో పట్టుసడలించి పంజాబ్ను రెండొందలు కొట్టేందుకు అవకాశమిచ్చిన ముంబై ఛేదనలో ఓపెనర్లు రియాన్ రికెల్టన్(48), ఇంప్యాక్ట్ సబ్ రోహిత్ శర్మ(25)లు శుభారంభమిచ్చారు. రికెల్టన్ బౌండరీల మోతతో స్కోర్ బోర్డును ఉరికించాడు. విజయాన్ని లాగేసుకుంటున్న ఈ జోడీని అజతుల్ల(0) విడదీశాడు. కాసేపటికే





నమన్ ధిర్(9) బిగ్ షాట్ ఆడబోయి అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. చాహల్ ఓవర్లో హిట్మ్యాన్ బౌల్డయ్యాడు. తిలక్ వర్మ(75 నాటౌట్), రూథర్ఫోర్డ్(20)లు గెలుపు బాధ్యత తీసుకొని భాగస్వామ్యం నిర్మించారు. పంజాబ్ బౌలర్లను కాచుకొని నాలుగో వికెట్కు 61 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని అజ్మతుల్ల విడగొట్టాడు. కానీ, తిలక్ తగ్గలేదు. యాన్సెన్ ఓవర్లో లెగ్ సైడ్ సిక్సర్తో యాభై పూర్తి చేసుకున్నాడు. యాన్సెన్ ఓవర్లో జాక్స్(25 నాటౌట్) తిలక్ 22.. ఆపై అర్ష్‌దీప్ బౌలింగ్లో 19 రన్స్ పిండుకున్నారు. బార్ట్‌లెట్ వేసిన చివరి ఓవర్లో 15 రన్స్ అవసరమవ్వగా.. తొలి బంతినే జాక్స్ స్టాండ్స్‌కి పంపాడు. తర్వాత సింగిల్.. నాలుగో బంతికి తిలక్ సిక్సర్ బాదాడు. ఐదో బంతికి బౌండరీ రాగా ముంబై ఆరు వికెట్లతో పంజాబ్ను మట్టికరిపించింది.

**దంచేసిన ప్రభ్‌సిమ్రన్**

ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన పంజాబ్ కింగ్స్ తడబడినా చివరకు భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(57) అర్ధ శతకంతో చెలరేగినా.. శార్దూల్ ఠాకూర్(439) సూపర్ స్పెల్తో మిడిలార్డర్ కుప్పకూల్చాడు. దీపక్ చాహర్(236) సైతం బెంబేలెత్తించగా పంజాబ్ స్కోర్ 150 దాటితే గొప్ప అనిపించింది. కానీ, అజ్మతుల్లా ఒమర్జాయ్(38), ఇంప్యాక్ట్ సబ్ విష్ణు వినోద్(15 నాటౌట్), బార్ట్‌లెట్(18 నాటౌట్)లు డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడగా అయ్యర్ సేన ముంబై ముందు 201 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.


# క్వార్టర్స్‌లో సింధు, లక్ష్యసేన్

**బ్యాంకాక్ :** థాయిలాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత టాప్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి అద్భుత ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆరో సీడ్ సింధు 21–13, 21–15 తేడాతో కేవలం 28 నిమిషాల్లోనే డెన్మార్క్కు చెందిన అమాలీ షుల్జ్ను చిత్తు చేసింది. క్వార్టర్స్‌లో ఆమె జపాన్ స్టార్, ప్రపంచ నంబర్ .3 అకానె యమగూచితో తలపడనుంది. కానీ, భారతయువ షట్లర్ దేవిక సిహగ్ 21–23, 11–21తో పిచామోన్ ఓపాట్నిపుత్ (థాయిలాండ్)చేతిలోఓడిపోయింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్లో ఏడో సీడ్ లక్ష్యసేన్ 21–12, 21–13తో చైనా షట్లర్ జూ జువాన్ చెన్ను వరుస గేమ్‌ల్లో ఓడించి క్వార్టర్స్‌లో



లోకల్ ఫేవరెట్ కున్లావుట్ విటిడ్సార్న్తో పోటీకి రెడీ అయ్యాడు. అయితే, వెటరన్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ 16–21, 21–11, 18–21తో సు లీ యాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్‌శెట్టి 21–12, 21–19 తో బ్రియాన్ జెరెమీముహమ్మద్ హైకల్ (మలేషియా) ద్వయాన్ని ఓడించి ముందంజ వేసింది.

# అపర్ణకు స్వర్ణ పతకం



**మకావు :** భారత ఉషు క్రీడాకారిణి అపర్ణ సాండా ప్రపంచకప్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల 52 కేజీల విభాగం ఫైనల్లో అపర్ణ వరుస సెట్లలో డిఫెండింగ్ వరల్ చాంప్, వియత్నాంకు చెందిన తి పువాంగ్ ఎన్‌గాను ఓడించి నయా చాంపియన్‌గా నిలిచింది. గతే సెప్టెంబర్‌లో ప్రపంచ ఉషు చాంపియన్‌షిప్ తుదిపోరులో ఇదే ప్రత్యర్థి చేతిలో ఎదురైన ఓటమికి అపర్ణ ప్రతీకారం తీర్చుకుంది. ఉషు క్రీడలో ప్రధానంగా తావ్లూ, సాండా అనే రెండు విభాగాలు ఉంటాయి.

# సైన్స్



## గమనిస్తే మారిపోయే వాస్తవం!

‘వాస్తవాన్ని పరిశీలన ప్రభావితం చేయగలదు’ అనే భావన క్వాంటం భౌతిక శాస్త్రం అందించే అత్యంత ఆసక్తికరమైన అవగాహనలలో ఒకటి. దీని అర్థం మన ఆలోచనలు మాంత్రికంగా మనకు కావలసిన దాన్ని సృష్టిస్తాయి అన్నది కాదు. కానీ మన దృష్టి, అవగాహన, ఉద్దేశ్యం... ఇవన్నీ మన జీవితంలో జరిగే ఫలితాలను మనం ఇప్పటివరకు ఊహించినదానికంటే ఎక్కువగా ప్రభావితం చేయగలవని ఇది సూచిస్తుంది. ఈ భావనకు కేంద్రబిందువుగా ఉన్నది పరిశీలక ప్రభావం. క్వాంటం ప్రయోగాలలో, కణాలు ఎవరైనా పరిశీలిస్తుంటే ఒక రకంగానూ, పరిశీలించకపోతే మరో రకంగానూ ప్రవర్తిస్తాయి. ఎలక్ట్రాన్లు, ఫోటాన్లు వంటి ఉపకణాలు కొలత చేయబడే వరకు అనేక అవకాశాల మేఘంలా ఉంటాయి. పరిశీలన లేదా కొలత జరిగిన తర్వాత మాత్రమే అవి ఒక నిర్దిష్ట స్థితిలోకి మారుతాయి. దీని ఆధారంగా, అత్యంత సూక్ష్మ స్థాయిలో పదార్థం ప్రవర్తనపై మన చైతన్య దృష్టి ప్రభావం చూపుతుందని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా చూపే ప్రయోగం డబుల్ స్లిట్ ప్రయోగం. ఈ ప్రయోగంలో కణాలు పరిశీలించనప్పుడు సంభావ్యత తరంగాల్లా ప్రవర్తిస్తాయి. కానీ వాటిని గమనించిన క్షణంలోనే ఘన వస్తువుల్లా ప్రవర్తిస్తాయి. కొన్ని శాస్త్రీయ వ్యాఖ్యానాల ప్రకారం, మనస్సు వాటితో పరస్పరం చర్య చేయేవరకు వాస్తవం పూర్తిగా స్థిరపడదు. ఇది కేవలం ఆలోచనలే భౌతిక వస్తువులను సృష్టిస్తాయని నిరూపించదు. కానీ చైతన్యం, భౌతిక ప్రపంచం మధ్య ఉన్న సంబంధం ఎంత లోతైనదో అనే ప్రశ్నలను మాత్రం తీవ్రంగా ముందుకు తెస్తుంది. ఇదే సమయంలో, ఆధునిక నాడీశాస్త్రం మన దృష్టి మెదడులో కొత్త నాడీ మార్గాలను రూపొందిస్తుందని చెబుతుంది. మానసిక శాస్త్రం అయితే మన నమ్మకాలు మన గ్రహణశక్తి, ప్రవర్తన, అవకాశాలను ప్రభావితం చేస్తాయని స్పష్టంగా చూపిస్తోంది. ఈ విషయాలు, ప్రపంచ వ్యాప్తంగా అనేకానేక ప్రాంతాల్లోని ప్రాచీన సంప్రదాయాలు ఎప్పుడో సూచించిన భావనలతో కూడా అనుసంధానమవుతున్నాయనే వాదనకు బలం చేకూరే అవకాశం లేకపోలేదు. ఒక రకంగా మన అవగాహనే అనుభవానికి ఆకారమిస్తుంది.

## జీవితం–మరణం మధ్య మూడో స్థితి?



యావత్ జీవజాలానికి జీవితం లేదా ప్రాణం ఉండడం ఎంత సహజమో, మరణం కూడా అంతే సహజం. అయితే, జీవించి ఉండడం అంటే ఏమిటోనే ప్రశ్నకు శాస్త్రవేత్తలు ఎంతోకాలంగా సమాధానాలు వెతుకుతున్నారు. కాగా, ఇటీవలి శాస్త్రీయ పరిశోధనలు ఒక కీలక ప్రశ్నను తెరపైకి తెస్తున్నాయి. మరణమే జీవితం యొక్క అంతిమ దశ కాకపోవచ్చన్న ప్రతిపాదన చేస్తున్నాయి. జెనోబాట్స్ అనే ప్రయోగశాలలో తయారు చేసిన జీవ నిర్మాణాలను అధ్యయనం చేసిన శాస్త్రవేత్తలు, ఒక జీవి మరణించిన తర్వాత కూడా దాని కణాలు పూర్తిగా నిష్క్రియం కావు అని గుర్తించారు. అంటే, అవి పూర్తిగా నాశనం కాకుండా, తమ నిర్మాణాన్ని తిరిగి ఏర్పరచుకుని, కొత్త పాత్రలను స్వీకరించగలుగుతాయి.దీనివల్ల జీవితం–మరణం మధ్యలో ఉన్న మూడో స్థితి అనే భావనకు కొంతమంది శాస్త్రవేత్తలు మద్దతు ఇస్తున్నారు. జెనోబాట్స్ అనేవి కప్పల జీవకణాలతో తయారైన సూక్ష్మ జీవనిర్మాణాలు. అలాగే మానవ కణాలతో రూపొందించిన వాటిని ఆంత్రోబాట్స్ అంటారు. వీటికి మెదడు లేదా నాడీవ్యవస్థ లేకపోయినా, కదలగలవు, కలిసి పనిచేయగలవు, పరిసరాలకు అనుగుణంగా మారగలవు. ఇది కణాలకు ఒక మౌలిక స్థాయి సామర్థ్యం లేదా సమస్యలను పరిష్కరించే గుణం ఉందని కొందరు శాస్త్రవేత్తలు వాదించడానికి కారణమైంది. ఈ పరిశోధనలు జీవితం పూర్తిగా జన్యువుల నియంత్రణలోనే ఉందన్న సాంప్రదాయ భావనను సవాలు చేస్తున్నాయి. కణాలు తమ అసలు జీవ శరీర పాత్ర నుంచి విముక్తమైనప్పుడు కూడా కొత్త విధంగా ప్రవర్తించగలవా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే విమర్శకులు మాత్రం, ఇవన్నీ తెలిసిన జీవ శాస్త్ర సూత్రాలతోనే వివరించవచ్చని, కణాలకు చైతన్యం ఉందని చెప్పడానికి బలమైన ఆధారాలు లేవని అంటున్నారు. అయినప్పటికీ, కణాలు ఎలా స్వయంగా వ్యవస్థీకృతమవుతాయో అర్థం చేసుకోవడం అత్యవసరం అనే విషయంలో మాత్రం శాస్త్రవేత్తలందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఈ అధ్యయనం విజయవంతమైతే, పునరుజ్జీవ వైద్యం రంగాన్ని పూర్తిగా మార్చివేయగలదు.

## వీడుతున్న పలు మిస్టరీలు



మానవ కెమిస్ట్రీతో జీవితానికి రసాయనశాస్త్రం పునాది. మనిషి జీవనానికి అవసరమైన తిండి, కట్టుకోవడానికి బట్ట, తలదాచుకునే గూడు అనే మూడు కనీస అవసరాలను సమర్థంగా తీర్చగల శాస్త్రంగా రసాయనశాస్త్రం నిలుస్తోంది. మనం తిన్న ఆహారం జీర్ణం కావడం నుంచి శరీరంలో చేరిన హానికర పదార్థాలను బయటకు పంపడం వరకు, నివాసాలను పరిశుభ్రంగా ఉంచడం నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ప్రతి దశలో కెమిస్ట్రీ కీలక పాత్ర పోషిస్తోంది. వ్యాధులను నియంత్రించడం, ఆరోగ్యాన్ని కాపాడడం వంటి అంశాల్లో కూడా రసాయనశాస్త్రమే మానవాళికి పదునైన ఆయుధంగా మారింది. ఇది లేకుండా ఆధునిక జీవనాన్ని ఊహించుకోవడం దాదాపు అసాధ్యం. మన రోజువారీ జీవితాన్ని గమనిస్తే రసాయనశాస్త్రం మన చుట్టూ ఎలా విస్తరించి ఉందో స్పష్టంగా తెలుస్తుంది. ఉదయం లేవగానే ఉపయోగించే టూత్‌పేస్ట్, బ్రష్ నుంచి మొదలుకుని తాగే టీ, కాఫీలు, ఆరోగ్యాన్ని ప్రసాదించే పోషకాహారం, వంటలు వండే విధానం వరకు అన్నీ కెమిస్ట్రీ ఫలితాలే. శుభ్రత కోసం వాడే సబ్బులు, డిటర్జెంట్లు, ఆహార పదార్థాలను నిల్వచేసే విధానాల్లో ఉపయోగించే రసాయనాలు, ప్రమాదకర సూక్ష్మ జీవులను నశింపజేసే మందులు అన్నీ రసాయనశాస్త్రం అందించిన వరాలుగా చెప్పుకోవచ్చు. టీకాలు, ఔషధాల తయారీ, మనం ధరించే వస్త్రాల ఉత్పత్తి, భవనాల నిర్మాణంలో వాడే పదార్థాల రూపకల్పన వంటి రంగాల్లో కూడా కెమిస్ట్రీ అనివార్యంగా మారింది. ప్రతి పదార్థంలో దాగి ఉన్న అణువులు, పరమాణువులు, మౌలిక కణాల రహస్యాలను వెలికి తీయడమే రసాయనశాస్త్ర లక్ష్యం. ఆ రహస్యాలను మానవ సంక్షేమానికి ఎలా ఉపయోగించుకోవచ్చో అన్వేషించే శాస్త్రంగా కెమిస్ట్రీ నేడు ప్రపంచం ముందుకు సాగుతోంది.

# ప్రజలపై పెనుభారం మోపుతున్న మోదీ

## పెంచిన ధరలు ఉపసంహరించుకోవాలి : దండి సురేష్
## సిపిఐ ఆధ్వర్యంలో ప్రదర్శన, దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/ఖమ్మం :** మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సేవలో మునిగి సామాన్య ప్రజలపై భారాలు మోపుతుందని, ఇందులో భాగంగానే పెట్రోల్, డిజీల్ ధరలు పెంచారని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. మోదీ ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నారని చెప్పేదానికి చేసే దాని కి పొంతన లేకుండా పోతుందని ఆయన తెలిపారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయం నుండి బైపాస్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఆటోను తాళ్లతో లాగి నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా ధరలు పెంచబోమని హామీ ఇచ్చిన మోదీ తన హామీని తుంగలో తొక్కి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని, దీని ప్రభావంతో రానున్న కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు మరింతగా పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మోదీ సర్కార్ కేవలం సంపన్న వర్గాల కోసం మాత్రమే పని చేస్తుందన్నారు. పెరిగిన ధరలతో సామాన్యులకు మరింత భారం కానుందన్నారు. పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో



సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా నాయకులు తాటి నిర్మల, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు వరదా నర్సింహారావు, పోటు పూర్ణ, జ్వాలా నర్సింహారావు, మందా వెంకటేశ్వర్లు, ఉపేందర్, చార్లెస్, బెజవాడ వెంకన్న, నర్సింహారావు రమణయ్య, లడ్డు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## పెట్రోల్, డిజిల్ గ్యాస్ ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న కేంద్రం

**వరంగల్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా ఆరోపించారు. పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ వరంగల్‌లోని నెక్కొండ జీపుల అడ్డా వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా షేక్ బాష్‌మియా మాట్లాడుతూ పెట్రోల్, డిజిల్ గ్యాస్ ధరలను పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని, తద్వారా సామాన్యులపై పెనుభారం పడుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్‌ధరలు తగ్గుతున్నా, ఆప్రయోజనాన్ని ప్రజలకు అందించకుండా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తోందని విమర్శించారు. ఇప్పటికే గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్న సామాన్యుడిపై పెట్రోల్, డిజిల్ ధరల రూపంలో మరో బాంబు వేశారని ధ్వజమెత్తారు. పెంచిన పెట్రోల్, డిజిల్ ధరలను తగ్గించి, పాత ధరలను పునరుద్ధరించాలని షేక్ బాష్‌మియా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, బుస్స రవీందర్, జిల్లా సమితి సభ్యులు తాళ్ళపల్లి జాన్ పాల్, బెజ్జంకి ఏకాంబర చారి, మస్క సుధీర్, చిట్యాల సువర్ణ, మనోహర్, సాంబమూర్తి, శ్వేత, విక్టోరియా, మహేష్, కార్యకర్తలు జగదీష్, తోక మల్లయ్య, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.




# ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు




## రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం

**ప్రజాపక్షం/పాల్వంచ :** అకాలవర్షానికి తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్నలను ఎటువంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం(ఎఐకెఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలన్నారు. అధికారులు పట్టించుకోకపోవటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైనదన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రులు చెపుతున్నప్పటికీ, వారి మాటలకు జరుగుతున్న కొనుగోలుకు ఎంత మాత్రం పొంతనలేదన్నారు. క్షేత్రస్థాయిలో పంటలను కొనుగోలు చేయకపోవటంతో రైతులు దళారులను ఆశ్రయిస్తూ తెగనమ్ముకొంటున్నారని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పంధించి రైతాంగాన్ని దళారుల నుండి రక్షించి వరి, మొక్కజొన్నలను ఎటువంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలక మండళ్ళ నియామకం సరికాదన్నారు. వెంటనే ఎన్నికలు జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుండాల నాగరాజు, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, వైఎస్.గిరి, వాడె లక్ష్మి, కొంగర అప్పారావు, శనిగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, ఎస్‌ఏ.రహమాన్, మన్నెం వెంకటేశ్వర్లు, ఎస్‌కే.గౌస్, జానీ, కరీం, వేములపల్లి శ్రీనివాసరావు, రేగులగూడెం, కారెగట్టు, దంతెలబోర ఎస్‌సి కాలని, నారాయణరావు పేట సర్పంచ్ లు కుర్సం రాములు, వట్టం బాబూరావు, సోడె వెంకటరమణ, సరస్వతి, గౌతమి క్రిష్ణ, నామా పండు, గొర్ల నరేష్, బర్ల వెంకటరత్నం పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు

## సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం అంగీకరించినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పలు సమస్యలు సింగరేణిలో పెండింగ్‌లో ఉన్నాయన్నాయని, వాటి పరిష్కారానికి యాజమాన్యం ఇటీవల హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో మెడికల్ బోర్డు ఏర్పాటవుతుందన్నారు. అండర్‌గ్రౌండ్ అలవెన్సులను కట్ చేయవద్దని తాము చెప్పామన్నారు. ఆస్పత్రి బిల్లులకు అదనంగా వేతనం నుంచి కోత విధించరాదని పూర్తిగా మినహాయించాలని యాజమాన్యాన్ని కోరినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న 337 మందికి పైగా డిపెండెంట్లకు ఉద్యోగాలు నియామక పత్రాలు



అందజేయనున్నట్లు చెప్పారు. ఇతర కార్మిక సంఘాలు గుర్తింపు సంఘంగా ఉన్న ఎఐటియుసి ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదని ఆరోపించడం సరైంది కాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష సంఘాల కంటే ప్రభుత్వంపై నిరంతర పోరాడమని స్పష్టంచేశారు. రాబోయే రోజుల్లో కార్మిక సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శిలు జి.శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, తాళ్ల పోషం,నల్ల సత్తి, రాయమల్లు, గణేష్ రాజ్ మహమ్మద్, హాస్పిటల్ శివ పాల్గొన్నారు.

# తరుగు పేరుతో రైతును మోసం చేస్తున్న అధికారులు

## సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** ధాన్యం క్వింటాకు ఐదు కిలోల తరుగు తీయడం అంటే రైతులను నిలువు దోపిడీ చేయడమేనని, దీనిని వెంటనే నిలిపివేయాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం వలమల్ల సామేలు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తే, తరుగు పేరుతో అడ్డగోలుగా కోత విధిస్తూ మోసం చేయడం అన్యాయమన్నారు. ఇప్పటి వరకు కోత పెట్టిన ధాన్యం విలువను లెక్కకట్టి ఆ సొమ్మును తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. తరుగు పేరుతో రైతులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు, గిడ్డంగి సౌకర్యం, తాగునీరు, ఎండ తగలకుండా నీడ వంటి కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ధాన్యం సేకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజల నడ్డి విరిచే ప్రయత్నం కొనసాగుతుందని, మోదీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ దేశ సంపదను వారికి దోచిపెడుతున్నాడని విమర్శించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్‌కె.నాగుల్ మీరా, ఎల్లంకి మధు, యాస రోశయ్య, తూము కోటయ్య, పోనేకంటి వెంకటేశ్వర్లు, కంచర్ల రాఘవేంద్రరావు, సిరిపురపు వెంకటేశ్వర్లు, కొండ వీరయ్య, చిమట ముత్తయ్య, పాలెపు ప్రభాకర్, ఊడల సుధా, బరగడ రమేష్, పత్తిపాటి మహేష్, ఉదారి నాగయ్య, చల్లగుండ్ల సతీష్, చీమకుర్తి సంతోష్, యరాదశి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** నీట్–2026 పేపర్ లీకేజీ విద్యార్థుల భవిష్యత్తుపై దాడని, 23 లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కోర్టు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి నిరసన ఆందోళన నిర్వహించి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వేదన, ఆర్థిక నష్టానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా బలమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కోచింగ్ కార్పొరేట్ మాఫియాపై కఠిన నియంత్రణలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేష్, సిలువేరు వికాస్, మన్న వరుణ్ కుమార్ , సరికొండ కళ్యాణ్ , పులిగుజ్జ నవీన్, హర్షవర్ధన్ రెడ్డి, సాయి, విశాల్, హాసన్, దీపిక, కీర్తి, దివ్య తదితరులు పాల్గొన్నారు





## ప్రతి గ్రామానికీ ఇందిరమ్మ ఇండ్లు

ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/చందంపేట :** చందంపేట మండల కేంద్రానికి చెందిన ఎలిజెర్ల కళమ్మ శ్రీనయ్యల నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి ఇంటి యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లతో పేదల ఆత్మగౌరవం పెరుగుతుందని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎంపిడివో కార్యాలయంలో అధికారుల పనితీరును ఎంపిడివోను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అధికారులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, వేసవి దృష్ట్యా మంచినీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బద్యానాయక్, సర్పంచ్ సాధిక్, మాజీ ఎంపిపిలు రమణగోవింద్, బిక్కు, అనంతగిరి, మల్లారెడ్డి, ఎంపిడివో లక్ష్మి పాల్గొన్నారు.

## యువకుడి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** అనుమానాస్పదంగా యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని గణపవరం శివారులో చోటుచేసుకుంది. మృతుడిని గణపవరంకు చెందిన బల్గూరి గణేష్‌గా పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్ బెంగుళూరులో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి గురువారం రాత్రి 11 గంటల నుండి అనుమానాస్పదంగా అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం గణపవరం గ్రామ శివారులోని మర్రిచెట్టు కింద గణేష్ మృతదేహం కనిపించింది. గొంతు కోసి హత్య చేసినట్లుగా కనిపించడంతో సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## అనుమానాస్పద మృతిపై కుటుంబ సభ్యుల ఆందోళన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు కుడకుడ జంగాల కాలనీకి చెందిన తిరుపాటి లక్ష్మయ్య (38) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. మృతిపై ఇప్పటి వరకు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ముందు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిన్న ఉదయం లక్ష్మయ్యను తీసుకెళ్లిన ఇద్దరు వ్యక్తులు ఎక్కడ ఉన్నారో వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిందితులను పోలీసులు కాపాడుతున్నారని ఆరోపిస్తూ తక్షణమే స్పందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సూర్యాపేట పట్టణ పోలీసులు రంగంలోకి దిగి వారికి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. మృతిపై పెన్‌పహాడ్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైనట్లు సమాచారం.

## జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని కక్కిరేణి గ్రామంలో ఉపాధి హామీ కూలీలలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బహిరంగ సభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కందుల హనుమంతు, మేడి ముకుంద మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సుదీర్ఘకాలంగా ఎన్నో పోరాటాలు నడపడం వల్ల వామపక్షాల మద్దతుతో వంద రోజుల పని గ్యారెంటీ చేస్తూ చట్టం చేయబడిందని, దీనికి ప్రధానమైన కారణం వ్యవసాయ కార్మిక సంఘమేనని, కుటుంబ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి పేదరిక నిర్మూలన కోసం కృషి చేయడానికి ఆర్థిక భరోసాను కల్పించిన ఈ చట్టాన్ని నేడు తూట్లు పొడుస్తూ వచ్చిన నిధులను పక్కదారి మళ్లిస్తూ అనేక కొర్రీలు పెడుతూ రాను రాను ఈ చట్టాన్ని లేకుండా చేసే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. మే18న రామన్నపేట మండల కేంద్రంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు హాజరవుతున్నారని దీనికి వ్యవసాయ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం గ్రామకమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వేముల సైదులు, కన్నెబోయిన యాదయ్య, నీల సంతోష, మమత, నాగమణి, పార్వతమ్మ, అండాలు, రాధా, కల్పన, లక్ష్మి , కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండల వ్యాప్తంగా పిఏసిఎస్ ఐకెపి ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యపు కొనుగోలు సెంటర్ల వద్ద కాంటాలు, లారీలు పెంచి లోడింగ్ అన్ లోడింగ్ తో ధాన్యం సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నామని రైతులు ఆందోళన పడవద్దని జిల్లా కలెక్టర్ యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగం జయంతి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హమాలీలు కాంటాలు పెంచాలని సూచించారు. అకాల వర్షాలు వచ్చి ధాన్యం తడిసి పోకుండా అన్ని రకాల జాగ్రత్తలు రైతులు తీసుకోవాలని త్వరగా కాంటాలు వేసి లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలించాలని ఆయన ఆదేశించారు. రైస్ మిల్లుల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. అమలీలు కోరుతున్న కేంద్రాల వద్ద రైస్ మిల్లు వద్ద సర్దుబాటులో కూడా చేసుకుని స్పీడప్ చేయాలని ఆదేశించారు. పొలాల నుండి ఆలస్యంగా ధాన్యం రావడం వల్ల కూడా కాస్త ఇబ్బంది ఎదుగుతుందని అన్నారు.14 వేల టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు సేకరించినట్లు వివరాలు వెల్లడించారు. సిబ్బంది ఎవరు కూడా రైతులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హరికృష్ణ, ఎండిఓ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ తాసిల్దారు నాగేశ్వరరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి అధికారులు ఆయన వెంట ఉన్నారు.



# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థల దృష్టి

రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం తూర్పు తెలంగాణ ప్రాంతీయ స్థానిక సంస్థల సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని దేవి, సభ్యులు సుజనా యాదవ్, ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ జిల్లాలో స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్‌కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయితీలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. జిల్లాలోని గ్రామాలను, మున్సిపాలిటిలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నగర మేయర్లు, చైర్మన్లు, ఎక్స్ ఎంపిటిసిలు, ఎక్స్ జడ్‌పిటిసిలు, సర్పంచులు, మున్సిపల్ కమీషనర్లు, డిపిఓలు, ఎంపిడిఓలు, ఎన్‌జిఓస్, సూర్యాపేట అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట జడ్‌పి సిఇఓ డి.శిరీష, నల్లగొండ జడ్‌పి సిఇఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిఎల్‌పిఓలు, ఎంపిఓలు, ఎంఈఓలు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దామరచర్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరు కాగా వారికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తు అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుండడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అందిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేరు మార్చడం సిగ్గుచేటు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కొట్లాడి అహింసా పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చినటువంటి మహాత్మాగాంధీ పేరును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పెట్టడం జరిగిందని, దానిని ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తొలగించి కొత్తగా జీ రామ్‌జీ పెట్టడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని గానుగబండ గ్రామంలో వ్యవసాయ కార్మికుల మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నరేంద్రమోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వాలు, ప్రభుత్వ పథకాలకు జాతీయ నాయకులపేర్లు పెట్టి గౌరవించడం జరిగిందని, ఈ ప్రభుత్వం పేర్లను తొలగించి తనకిష్టమైన పేర్లను పెట్టి ఆనందపడుతోందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సర్పంచ్ కడియాల పద్మ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తాళ్ల తిరపయ్య, ఈద నాగరాజు, పంగ ఏదయ్య, వెంకటేశ్వర్లు, చిక్కుళ్ల సావిత్రి, పిచ్చయ్య, నాగమణి, పద్మ, ఉపేంద్ర, సైదమ్మ, వెంకమ్మ పాల్గొన్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు అరెస్ట్

గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు : డిఎస్‌పి కె.శివరాం రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.లక్ష విలువగల 2.2 కిలోల గంజాయి, 2 కత్తులు, 3 సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి వెల్లడించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలన నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చేందుకు మిషన్ పరివర్తన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. చండూర్ సీఐ పర్యవేక్షణలో ఈ నెల 14న సాయంత్రం పట్టణంలోని జీ.ఎల్ గార్డెన్ వెనుక వేప చెట్టు కింద ఐదుగురు వ్యక్తులు గంజాయి పంచుకుంటున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు, కనగల్ ఎస్.ఐ కే.రాజీవ్ రెడ్డి తన సిబ్బందితో కలిసి జీ.ఎల్ గార్డెన్ దగ్గర వేప చెట్టు వద్ద తనిఖీ నిర్వహించారు. అక్కడ ఐదుగురు వ్యక్తులు మోటార్‌సైకిల్‌తో ఉండి గంజాయి పంపిణీ చేస్తుండగా వారిని పట్టుకుని విచారించగా, బొడ్డు చందు,కానుగు సాయిరామ్, జిల్లా చందు, చాడ క్రాంతికుమార్, బొమ్మరగోని అంజి అలియాస్ నిరంజన్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరు గత మూడు నెలల నుండి గంజాయి వ్యాపారం చేస్తున్నామని, హైదరాబాద్ ధూల్‌పేట్‌లో మన్నీ అనే మహిళ నుండి కొనుగోలు చేసి వాడుకుంటున్నామని విచారణలో తేలిందన్నారు. ఈ గంజాయి కేసును చండూర్ సిఐ టి.రాము పర్యవేక్షణలో చేధించిన కనగల్ ఎస్.ఐ కే.రాజీవ్ రెడ్డి, సిబ్బంది రమేశ్, సురేష్, విజయ శేఖర్, రవీందర్ రెడ్డి, వెంకన్న, వీరయ్య, వెంకట్ రెడ్డి, గోపిని డిఎస్‌పి అభినందించారు.

# ప్రపంచ వేదికపైకి తెలంగాణ వారసత్వం

నా అదృష్టంగా భావిస్తున్నానని మిస్ ఆసియా ఇంటర్నేషనల్ ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ వెల్లడి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** 200 సంవత్సరాల తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే అవకాశం లభించడం ఎంతో గర్వంగా గౌరవంగా భావిస్తున్నానని ప్యారిస్‌లో జరుగుతున్న 79వ కేన్స్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో మిస్ ఆసియా ఇంటర్నేషనల్ ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ సందేశం ఇచ్చినట్లు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. 2026, 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం నాకు లభించిన గొప్ప అదృష్టం. తెలంగాణ చరిత్రలో మొట్టమొదటి సారిగా, పోచంపల్లి ఇక్కత్ చేనేత ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక రెడ్ కార్పెట్‌పై నడవబోతోందనీ తెలిపారు. ఈ సందర్భంగా తన అభిప్రా యాన్ని తెలిపింది. ఇది నా ఒక్కదాని గర్వం మాత్రమే కాదు. పోచంపల్లిలో మగ్గం ముందు కూర్చొని వందల గంటలు శ్రమించిన ప్రతి నేతన్న, నేతక్క గర్వం. మన దారం ఇప్పుడు ప్రపంచ దారంగా మారిందనీ చెప్పారు. తనను ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్‌గా నియమించి, ఈ చారిత్రాత్మక అవకాశాన్ని అందించిన భారత ప్రభుత్వానికి, జౌళి మంత్రిత్వ శాఖకు, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయానికి, వీవర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, పోచంపల్లి టై & డై సంస్థలకు, పోచంపల్లి నేతన్నలు, నేతక్కలు మరియు అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపినట్లు వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారి తెలిపారు. నన్ను ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్‌గా నియమించి, ఈ చారిత్రాత్మక అవకాశాన్ని అందించినందుకు నా ప్రత్యేక కృతజ్ఞతలు అంటూ ప్రశంసలు కురిపించారు.



## ఐస్ తయారీ యూనిట్లపై ఆకస్మిక తనిఖీలు

నిబంధనలు పాటించని వారికి హెచ్చరిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వేసవిలో ఐస్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఆహార భద్రత అధికారి ఎన్.శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని ఐస్ తయారీ యూనిట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పలు యూనిట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టం 2006 ప్రకారం ఫుడ్ లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. బాహ్య వినియోగం కోసం మాత్రమే బోర్డులు లేకపోవడం, ఆర్ఓ ప్లాంట్లలో యూవీ ట్రీట్‌మెంట్ లేకపోవడం, నీటి నాణ్యత, మైక్రోబయోలాజికల్ టెస్ట్ రిపోర్టులు లేకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. ఐస్ బార్ల లోడింగ్ ప్రాంతాల్లో ఎలివేటెడ్ ప్లాట్‌ఫారమ్‌లు లేకపోవడం వల్ల కలుషితమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరిశుభ్రత పాటించాలని, లైసెన్స్, రికార్డులు నిర్వహించాలని నిర్వాహకులకు అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో ప్రకాశం బజార్‌లోని సఫా చికెన్ సెంటర్ నుండి పత్రాలు లేకుండా తరలిస్తున్న 200 కిలోల చికెన్‌ను అడ్డుకున్నారు. ఫంక్షన్ హాల్‌కు తరలిస్తున్నట్లు తేలడంతో అవగాహన కల్పించి వదిలివేశారు. ఇకపై ఫుడ్ లైసెన్స్, పత్రాలతోనే మాంసం రవాణా చేయాలని సూచించారు.

## నిరంతరాయంగా తాగునీటి సరఫరా



అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాపై అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరా వ్యవస్థ, పైప్లైన్ మరమ్మతులు, నీటి నిల్వలు, పంపింగ్ వ్యవస్థను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించి, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంప్ కార్యాలయంలో గురువారం కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు, గృహ వినియోగదారులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎండాకాలంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఓవర్ లోడ్ సమస్యలపై అధికారులతో చర్చించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీ.ఈ ప్రసాదరావు, నకిరేకల్ ఏడిఈ సురేష్, నల్లగొండ రూరల్ ఏడిఈ శ్రీనివాస్, ఏఈలు శ్రీకాంత్, ప్రదీప్, రంజిత్ కుమార్, చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం సహించం: ప్రభుత్వ విప్ వీరేశం**

రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. శుక్రవారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన కొనుగోలు ప్రక్రియ, ధాన్యం తూకాలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. వారి వెంట కట్టంగూర్ తహాశీల్దార్ పుష్పలత, సివిల్ సప్లై అధికారి రాచకొండ జ్యోతి, నాయకులు నంద్యాల వెంకట్ రెడ్డి, గద్దపాటి దానయ్య, నకిరేకంటి నరేందర్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, చౌగోని రవి, గాజుల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ధాన్యం సేకరణ

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/నూతనకల్/(ఆత్మకూర్(ఎస్)) :** ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆత్మకూర్(ఎస్), నూతనకల్ మండల కేంద్రాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, స్థానిక రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రధానంగా ఎదురవుతున్న లారీల కొరత, హమాలీల ఇబ్బందులు, అన్‌లోడింగ్ సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు లారీల కొరత లేకుండా రవాణా శాఖ, పోలీసు అధికారుల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యం సేకరణకు మళ్లిస్తున్నామన్నారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా ఉండేందుకు ప్రతి మిల్లుకు ఒక ప్రత్యేక ఇన్‌చార్జిని నియమించామన్నారు. ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసి అన్‌లోడింగ్ వేగవంతం చేస్తున్నామని చెప్పారు. మండల స్థాయిలో కొనుగోళ్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మండల ప్రొక్యూర్మెంట్ కమిటిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీసు శాఖలు సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని చెప్పారు. అకాల వర్షాల దృష్ట్యా అలర్ట్ మెకానిజం సిద్ధం చేశామని వెల్లడించారు. ఒకవేళ అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే, రైతులు ఆందోళన చెందవద్దని అటువంటి ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్(ఎస్), నూతనకల్ తహశీల్దార్‌లు హమీసింగ్, శ్రీనివాస్‌రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (2026–27) ప్రవేశాల కొరకు ప్రకటన విడుదల చేయబడిందని ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి, tgms.telangana.gov.in లింక్‌పై క్లిక్ చేయాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల సేవ 13 మే 2026 నుండి 25 మే 2026 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితా 27 మే 2026న సంస్థ నోటీసు బోర్డుపై ప్రదర్శించబడుతుందని, ధృవ పత్రాల ధృవీకరణ ప్రవేశ ప్రక్రియ పూర్తి చేయడం 28 నుండి 30 మే 2026 వరకు జరుగుతుందన్నారు. సీట్ల కేటాయింపు ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలలోని మెరిట్, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య, 100 మంది బాలికలకు బాలికల హాస్టల్లో ఉచిత ప్రవేశం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోట్‌బుక్‌లు, ఈఏపీసీఈటీ/నీట్ కోచింగ్, ఫిజిక్స్ వల్లా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు ఉచిత ఆన్‌లైన్ యాక్సెస్, పాఠ్య కార్యకలాపాలలో పాల్గొనే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

LOCAL NEWS స్థానికం LOCAL NEWS

ఖమ్మం

శనివారం

16-05-2026

www.prajapaksham.in

ప్రజాపక్షం

Telugu National Daily



## మార్కెట్ యార్డు సందర్శించిన : కలెక్టర్



**ప్రజాపక్షం /జన్నారం :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం జన్నారం మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా జన్నారం మండల రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, కష్టాలను బీఆర్ఎస్ పార్టీ చింతగూడా సర్పంచ్ సుతారి సుమలత వినయ్, దేవునిగూడా ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు సాయికిరణ్ కలిసి కలెక్టర్‌కు వివరించారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి,నిర్మాణంలో ఉన్న కాంపౌండ్ వాల్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్కయ్య, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీ నారాయణ,మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, వార్డు సభ్యులు మోసిన్,పంచాయతీ కార్యదర్శి రాహుల్, బిల్ కలెక్టర్ అనిల్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

చెక్‌పోస్టును తనిఖీ చేసిన మంచిర్యాల ఏసిపి ప్రకాష్




**ప్రజాపక్షం /జన్నారం :** రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని పశువుల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మంచిర్యాల ఏసిపి ఆర్.ప్రకాష్ గురువారం జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కలమడుగు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును తనిఖీ చేశారు.చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఏసిపి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుంచి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెళ్లే ప్రతి వాహనా న్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండాఅప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఏసిపి ఆదేశించారు.

## ఎస్‌సిల హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నాం



**ప్రజాపక్షం/మావల:** జిల్లాలో ఎస్‌సిల సంక్షేమం, హక్కుల రక్షణకు యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ యువతకు స్వయం ఉపాధి పథకాల ద్వారా చేయూతనిస్తామని తెలిపారు. ఆ సమావేశంలో ఎస్‌పి అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ ఋత్విక్ సాయి కొట్టే, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో జగదీశ్వర్ రావు పాల్గొన్నారు.


## ధాన్యం తరలించడం లేదని నిరసన



**ప్రజాపక్షం/నర్సాపూర్:** గత వారం రోజులుగా వరి ధాన్యాన్ని రైస్ మిల్లుల కు తరలించడం లేదంటూ రైతులు రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలకు వెళితే మె నర్సాపూర్ మండల వారిది లొనితుజాల్, పూర్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వారం రోజులుగా తూకం వేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలించాలని కోరారు. అనంతరం తహసిల్దార్ శ్రీనివాస్, ఎస్సై రంజిత్ రెడ్డి అక్కడకు చేరుకొని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు సద్ది చెప్పడంతో నిరసన కార్యక్రమాన్ని ముగించారు.తుజాల్ పూర్ గ్రామ రైతులు గ్రామ ఉప సర్పంచ్ గాలి శ్రీనివాస్, యా దయ్య, లింగం అశోక్, ఆంజనేయులు, నర్సింలు, నర్సాగౌడ్, ముత్యాలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో రెండవ బహుమతి

సర్పంచ్ శాంతికుమార్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మండలంలోని చేపూర్ గ్రామ సర్పంచ్ సారంగి శాంతికుమార్ జాతీయస్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. దేశవ్యాప్తంగా గ్రామాల సర్పంచ్‌ల మధ్య నిర్వహించిన 'వ్యవసాయం గ్రామీణ శ్రేయస్సు బలోపేతం' పోటీలలో ఆయన ద్వితీయ స్థానం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగ పురోగతి, డిజిటల్ సాధనాల వినియోగం, స్థానిక నాయకత్వ ప్రోత్సాహం వంటి అంశాలపై సమగ్రంగా వివరించి న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. దేశవ్యాప్తంగా పాల్గొన్న అనేక మంది సర్పంచ్‌లలో రెండవ స్థానాన్ని సాధించి ఆర్మూర్ మండలానికి నిజామాబాద్ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. విజేతగా ఎంపికైన సారంగి శాంతికుమార్‌కు రూ.20 వేల నగదు పారితోషికంతో పాటు ప్రత్యేక సన్మానం కూడా అందజేయనున్నారు. గ్రామప్రజలు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు సారంగి శాంతికుమార్‌ను అభినందిస్తూ ఆయన సాధించిన విజయం చేపూర్ గ్రామానికి మరింత గుర్తింపు తీసుక వచ్చిందన్నారు. గ్రామాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి ఇతర సర్పంచ్‌లకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

# సమాచార హక్కు చట్టంతో..

# పారదర్శకత,జవాబుదారీతనం

రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్..
కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి






**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కలిస్తూ పారదర్శకత జవాబుదారీతనాన్ని పెంపొందించటమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం 2005పై పీఐఓలకు, ఏపీఐఓలకు అన్ని శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కమీషనర్లు శ్రీనివాస్‌రావు, భూపాల్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, కమీషనర్ సాయిచైతన్యలతో పాల్గొని మాట్లాడారు. అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించబడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం ప్రజలకు సంబంధించినదే అయినందున దానిని వారికి తెలుపటంతో అలసత్వ వైఖరి తగదన్నారు. సమాచార హక్కు చట్టంలోని 2 షెడ్యూళ్లు, 6 చాప్టర్లు, 31 సెక్షన్లపై పవర్ పా యింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డికి కమీషనర్లు దేశాల భూపాల్, శ్రీనివాస్‌రావులకు, జిల్లా అధికారులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. సదస్సులో అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమా ర్, దిలీప్‌కుమార్, డీఎఫ్ఓ సిదార్థ్ విక్రమ్‌సింగ్, డీసీపీ ప్రకాష్, గీత, ప్రశాంత్ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో..
## అగ్రస్థానంలో నిజామాబాద్

రికార్డు స్థాయిలో 5.68 లక్షల మెట్రిక్..
టన్నుల ధాన్యం సేకరణ
61,442 మంది రైతులకు రూ.1162.18
కోట్ల బిల్లుల చెల్లింపులు : కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** యాసంగి 2026 కు సంబంధించి వరిధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోని అగ్రగామిగా ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 5.68 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు వరి ధాన్యం సేకరణ పూర్తి చేశామని, కేవలం ఐదు శాతం మేరకు మిగిలి ఉన్న ధాన్యాన్ని వేగవంతంగా వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం సరిపడా హమాలీలు, వెంటాదివెంట ధాన్యం రవాణా కోసం తగిన సంఖ్యలో లారీలను సమకూర్చటం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

## ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేదుకు సిద్ధం

కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వచ్చే వర్ష కాలంలో వరదలు విపత్తుల వల్లా ఆస్తులు ప్రాణ నష్టము జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు శుక్రవారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయా విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు న్యూ డిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎం డెవిడ్ కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్య తో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమతంగా వుండాలన్నారు భారి అతి భారి వర్షాలు కురిసే సమయంలో వరదలు వచ్చి జన వననం స్తంభించి పోతుందని ఆ సమయంలో ప్రజలను రక్షించి వారికి పునరవాసం ఏర్పాటు చేపట్టాలన్నారు. జిల్లాలో అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తక్షణమే స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజను అప్రమత్తం చేయాలన్నారు జిల్లాలో విపత్తులు సంభవించి నప్పుడు ప్రజలను రక్షించడానికి రేస్కు బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలించి వారికి ఆహారం త్రాగునీరు వైద్య చికిత్సలు అందించాలన్నారు.

## జొన్నల కొనుగోలు వేగవంతం : కలెక్టర్

**ప్రజాపక్షం/ మావల:** జిల్లాలో రైతులు పండించిన జొన్న పంటను త్వరితగతిన కొనుగోలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, వ్యవసాయ, రవాణా శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని, రవాణాకు వాహనాల కొరత లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. రైతులు విక్రయించిన పంటకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ చిత్రు ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించి తూకం యంత్రాలను, స్లాక్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అధికారి గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, రవానా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## మిషన్ మోడ్‌లో ధాన్యం అన్ లోడింగ్ చేయాలి

ధాన్యం దిగుమతులలో..
రైస్ మిల్లర్ల నిర్లక్ష్యాన్ని సహించం
కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరిక



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను మిషన్ మోడ్ లో వేగవంతం జరగాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతులు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్, ఆర్డీఓ లు, సివిల్ సప్లై, కోపరేటివ్, తాసిల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్, డిఆర్డిఓ అధికారులతో కలెక్టరేట్ కార్యాలయం నుండి గూగుల్ మీట్ ఏర్పాటు చేసి కలెక్టర్ దిధా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసి నిబధనలు మేదకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా కేంద్రాలకు వచ్చే ధాన్యాంని బట్టి రవాణా శాఖ అధికారులు సరిపడా ట్రక్కర్లను సమకూర్యాలన్నారు. వరి కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని, ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిషన్ మోడ్ లో మిల్లులకు తరలించాలని, ధాన్యం దిగుమతుల విషయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే సమించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించా రు. అవసరమైతే హమాలీల సం ఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో హమాలీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వరి ధాన్యం దిగుమతి త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేయాలని తెలిపారు. ఈ గూగుల్ మీట్లో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, డిఆర్‌డిఓ పిడి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ వేషాలు.. నకిలీల నయా దందా!

**ప్రజాపక్షం / నిర్మల్ :** తెల్ల చొక్కా మెడలో రంగు రంగుల ఐడి కార్డు.. కారుపై గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బోర్డు ఇది జిల్లాలో వెలుస్తున్న నకిలీ నేషనల్ రాయుళ్ళ హడావుడి! జాతీయ స్థాయి సంస్థలమంటూ బిల్డప్ ఇస్తూ, నిరుపేదలను, అమాయకులను నిలువునా ముంచేస్తున్న ఈ అక్రమ సంఘాల దందా ఇప్పుడు జిల్లాలో పతాక స్థాయికి చేరింది. సమాజంలో గౌరవం కోసం పాకులాడే వారి బలహీనతను పెట్టుబడిగా మార్చుకుని, లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ ముఠాల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

### ఖరీదైన ఐడి కార్డులు..
### ఖాళీ అవుతున్న జేబులు ..!

జిల్లాలో నేషనల్ హ్యూమన్ రైట్స్ క్రైమ్ కంట్రోల్, ఇన్వెస్టిగేషన్ వంటి గంభీరమైన పేర్లతో పుట్టకొచ్చిన ఈ సంస్థలు చూసేందుకు అచ్చం ప్రభుత్వ విభాగాల వలే భ్రమ కలిగిస్తున్నాయి. సభ్యత్వాల పేరుతో ఒక్కొరి నుండి వేల రూపాయలు వసూలు చేస్తూ దర్జాగా నకిలీ గుర్తింపు కార్డులను విక్రయిస్తున్నా. తామేదో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నామని పోజులిస్తూ సామాన్యులను భయభ్రాంతులకు గురిచేయడం ఈ ముఠాల నైజం ప్రభుత్వ యంత్రాంగం తో ఎటువంటి సంబంధం లేకపోయినా, అధికారులకే హుకుం జారీ చేసే స్థాయికి వీరి బరితెగింపు చేరుకుంది.

### రాజ్యాం చిహ్నాలతో చెలగాటం...
### ఇది దేశ ద్రోహం కాదా ?

చట్ట ప్రకాకం భారత్ గెజిటెడ్ అధికారులు మాత్రమే వాడాల్సిన జాతీయ చిహ్నం (మూడు సింహాల ముద్ర)ను ఈ ముఠాలు తమ ప్రేవైటు విజిటింగ్ కార్డులపై వాహనాలపై ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నాయి. భారత ప్రభుత్వం అని రాసి న్న భోర్డులతో తిరుగుతూ ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కడమే కాకుండా, చెక్ పోస్టుల వద్ద దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఆతీయ చిహ్నాలను అగౌరవపరుస్తూ, ప్రభుత్వ విశ్వసనీయతకు దెబ్బతీసు న్న ఇటువంటి సంస్థలపై కఠినమైన దేశద్రోహం కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉంది.

### తస్మాత్ జాగ్రత్త.. అవన్నీ గాలి సంస్థలే

మానవ హక్కుల రక్షణ పేరిట సాగుతున్న ఈ దొంగ సంస్థల వెనుక పెద్ద నెట్‌వర్కే ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం గుర్తించిన అధికారిక సంస్థలకు, ఈ ప్రైవేటు క్లబ్బులకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తుడా ఉంది సభ్యత్వాల పేరుతో వీరు ఇచ్చే సర్టిఫికేట్లు కేవలం రంగు కాగితాలే తప్ప, వాటికి ఎటువంటి చట్టబద్ధత లేదు. అమాయక ప్రజలు తమ కష్టార్జితాన్ని ఇ లాంటి మోసగాళ్ళ చేతిలో పోసి బలిపశువులు కావోద్దని సమాజినిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.

### ఖాకీల పంజా విసరాల్సిందే !

ఇంత బహిరంగంగా మోసాలు జరుగుతున్నా జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ నకిలీ సంస్థల కార్యాలయాలపై దాడులు నిర్వహించి అక్రమంగా వాడుతు న్న బోర్డులను, నకిలీ ఐడి కార్డులను స్వాదీనం చే సుకోవాలి. కటకటాల్లోకి నెట్టినప్పుడే సామాన్యులకు రక్షణ ఉంటుంది.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ళ కఠిన శిక్ష

నిర్మల్ జిల్లా కోర్టు సంచనల తీర్పు

**ప్రజాపక్షం / నిర్మల్:** నిర్మల్ పట్టణంలో సంచలనం సృష్టించిన హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి శ్రీవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. శిక్షతో పాటు నిందితుడికి 2000 రూపాయల జరిమానా కూడా విధించారు. పోలీసుల వివరాల ప్రకారం నిర్మల్ సోఫీనగర్ నివాసి బత్తిని రాజారాం, నిందితుడైన పన్నాల రాజు 26కు ఫైనాన్స్‌లో కొంత మొత్తాన్ని అప్పుగా ఇప్పించాడు అయితే రాజు ఆ డబ్బులను సకాలంలో చెల్లించకపోవడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే పన్నాల రాజు రాజారాం పైకత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాదితుడి భార్య గంగామణి ఇచ్చి ఫిర్యాదు మేరకు నిర్మల్ టౌన్ పోలీసులు ఐపిసి 307 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కోర్టు తీర్పు

నిర్మల్ పోలీసులు సేకరించిన పక్కా ఆధారాలు, సాక్ష్యాదారాలను పరిశీలించిన జిల్లా సెషన్స్ జడ్జి శ్రీ వాణి, నిందితుడు పన్నాల రాజును దోషిగా నిర్ధారించారు. నేరం రుజువు కావడంతో అతడికి ఐదేళ్ళ కఠిన శిక్ష మరియు జరిమానా విధిసూత తీర్పునిర్చారు.

### ఎస్‌పి డా.జి. జానకి షర్మిల స్పందన

ఈ తీర్పుపై జిల్లా ఎస్పీ స్పందిస్తూ సమాజంలో నేరం చేసిన వారు చట్టం నుండి తప్పించుకోలేరని హెచ్చరించారు. నిర్మల్ పోలీసులు పక్కా వ్యూహంతో సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారని కొనియాడారు. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రతి కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.వినోద్‌రావు, విచరణాధికారి జేవీఆర్ రాజు ఎస్ఐ కోర్టు డ్యూటీ అధికారులు, కె.రమేష్. ఎస్ఐ హెచ్.సి. ప్రభాకర్, అనీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## భార్యను చంపి.. డ్రామా అడిన భర్త !

24 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన నిర్మల్ పోలీసులు

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును నిర్మల్ జిల్లా పోలీసులు కేవలం 24 గంటల్లోనే చేదించారు. భార్యను పథకం ప్రకారం హత్యచేసి, ఆపై దానిని గుర్తు తెలియని వ్యక్తులు చేసిన అత్యాచారం, దోపిడిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. మామడ మండలానికి చెందిన నల్ల మౌనిక ఈ నెల 9వ తేదీన ఋదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో మొదట మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే, మే 14 న ఖానాపూర్ మండలం కొత్త తర్లపాడు అటవీ ప్రాంతంలో ఆమె మృతదేహం లభ్యమవడంతో పోలీసులు దీనిని హత్య కేసుగా మార్చి దర్యాప్తు ప్రారంభించారు.

### నిందితుడి కిరాతకం

ధర్యాప్తులో మృతురాలి భర్త నల్ల అరుణ్ అసలు నిజాలను ఒప్పుకున్నాడు. అదనపు కట్నం కోసం వేదింపులు, కుటుంబ కలహాలు మరియు అక్రమ సంబంధంపై అనుమానంతో అరుణ్ తన భార్యను అటవీ ప్రాంతానికి తీసుకెళ్ళి గొంతు నులిమి హత్య చేశాడు. తనపై అనుమానం రాకుండా ఉండేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై అత్యాచారం చేసి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్ళినట్టుగా సీన్ క్రియేట్ చేశాడు., ఆపై ఏమి తెలియనట్లుగా పోలీసులకు తప్పుడు మిస్సింగ్ పిర్యాదు ఇచ్చాడు.

### సాంకేతిక ఆధారాలతో చిక్కిన నిందితుడు

సిసి కెమేరా పుటేజ్ మరియు శాస్త్రీ ధర్యాప్తు ద్వారా పోలీసులు నిందితుడి ఆటకట్టించారు. అరుణ్‌తో పాటు అతడికి సహకరించిన తల్లిదండ్రులు నల్ల శ్రీనివాస్, నల్ల అడెల్లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 8 లక్షల రూపాయల విలువైన 5 తులాల బంగారు ఆభరణాలు, మోటార్ సైకిల్, మరియు సెల్‌ఫోనను స్వాదీనం చేసుకున్నారు.

### నిర్మల్ డిఎస్‌పి హెచ్చరిక

నిర్మల్ డి.ఎస్.పి. శ్రీనివాస్. మాట్లాడుతూ, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నిందితులపై కొత్త చట్టం బి.ఎన్.ఎస్. మరియు వరకట్న నిషేద చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును వేగంగా చేదించిన ఖానాపూర్ ఇన్స్‌పెక్టర్ అజయ్, ఎస్.ఐ. రాహుల్ మరియు సిబ్బందిని జిల్లా ఎస్.పి. డా.జి.జానకీ షర్మిల ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు.




## గ్రామాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా
పాపన్నపేట పిఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ
ఎస్‌పి డి. వి. శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి డి.వి. శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన రికార్డు ల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితి, సిసి కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసుల ద ర్యాప్తులో వేగం పెంచి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బాధితుల సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా సేవాభావంతో విధులు నిర్వహించాలని సిబ్బందికి తెలిపారు. గ్రామాల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, రాత్రి వేళల్లో పహారా నిర్వహణను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ప్రజల్లో భద్రతాభావం పెరిగేలా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని, ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు, ఫేక్ వార్తలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో డీసీఆర్బి ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జగపతి బాబు నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'తో రాబోతున్నారు. ఈ చిత్రంలో ఆయనతో పాటు లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమమిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించారు.

రీల్

# లయను 'వదలా' అంటున్న జగపతిబాబు



జగపతి బాబు నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'తో రాబోతున్నారు. ఈ చిత్రంలో ఆయనతో పాటు లయ, హృతికా శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్ పై కిషోర్ నాయుడు చిరుమమిల్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, థ్రిల్లింగ్ టీజర్ తో ఆసక్తిని రేకెత్తించిన టీం, ఇప్పుడు వదలా టైటిల్ ట్రాక్ ని రిలీజ్ చేశారు. ప్రేమ, , బాధ, భావోద్వేగాలను ఆత్మీయంగా మిళితం చేసిన ఈ పాట ఒక సోల్‌ఫుల్ మెలోడీగా ఆకట్టుకుంటోంది. ఎర్రోజు శివకృష్ణాచారి అందించిన సాహిత్యం పాటకు మరింత డెప్త్ తీసుకురాగా, ప్రియా నారాయణ తన వోకల్స్ తో ప్రతి లైన్‌కి ప్రాణం పోశారు. జగపతి బాబు పై హృతికా శ్రీనివాస్ కి వున్న ఎమోషన్ ఈ పాటలో క్యాప్చర్ చేసిన తీరు ఆసక్తికరంగా వుంది. ఈ సాంగ్ ని చాలా లావిష్ గా చిత్రీకరించారు, ఈ చిత్రానికి చోటా కె నాయుడు డీవోపీ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్, లక్ష్మీ భూపాల రైటర్. నిర్మాతలు: కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ.

# స్పైడర్-మ్యాన్ పోస్టర్ విడుదల

హాలీవుడ్‌సూపర్ హీరో ఫ్రాంచైజ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రంస్పైడర్ మ్యాన్ : బ్రాన్డ్ న్యూ డే నుండి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించగా, ఇప్పుడు ఈ కొత్త పోస్టర్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ చిత్రం 2026 జూలై 31న ఇండియా లో ఇంగ్లీష్, హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. పీటర్ పార్కర్ తన హూడీ కింద స్పైడర్‌మ్యాన్ సూట్‌ను దాచుకుని కనిపిస్తున్నాడు. ప్రపంచం పీటర్ పార్కర్‌ను మర్చిపోయినా అతడు తన బాధ్యతను మాత్రం మర్చిపోలేదు అనే భావాన్ని ఈ పోస్టర్ బలంగా ప్రతిబింబిస్తోంది. తన నగరాన్ని రక్షించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్న స్పైడర్‌మ్యాన్ మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నాడని ఈ పోస్టర్ సూచిస్తోంది. స్పైడర్‌మ్యాన్ నో వే హోమ్ ఘన విజయానికి నాలుగేళ్ల తర్వాత, ఈ చిత్రం పీటర్ పార్కర్ జీవితంలో కొత్త అధ్యాయాన్ని చూపించనుంది. ప్రపంచం తనను గుర్తించని పరిస్థితుల్లో ఒంటరిగా జీవిస్తున్న పీటర్, న్యూయార్క్ నగరాన్ని రక్షించడమే తన ధ్యేయంగా మారుతుంది. కానీ కొత్త నేరాల పరంపరతో పాటు అతని జీవితాన్ని కుదిపేసే శక్తివంతమైన శత్రువు రంగంలోకి దిగడంతో కథ మరింత ఉత్కంఠభరితంగా సాగనుంది. సోనీ పిక్చర్స్ సంస్థ ఇండియా ఈ చిత్రాన్ని భారతదేశవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలో విడుదల చేయనుంది.




## అనసూయ జన్మదినం సందర్భంగా
# లీలావతి పాత్ర పోస్టర్ రిలీజ్



దర్శకుడు అభిషేక్ నామా తాజాగా రూపొందిస్తున్న చిత్రం 'నాగ బంధం: ది సీక్రెట్ ట్రెజర్', విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో పౌరాణిక కథ, చరిత్ర, యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్, సాంస్కృతిక అంశాలు వున్నాయి.నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగి రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, అనసూయ భరద్వాజ్, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలను సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో మరో కీలకమైన పాత్రను పోషిస్తున్న యాంకర్ అనసూయ భరద్వాజ్ పోస్టర్ ను విడుదల చేశారు. అనసూయ జన్మదినం సందర్భంగా లీలావతిగా ఆమె నటిస్తున్న పాత్రకు సంబధించిన పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, భక్తి గీతం 'నమో రే' ప్రేక్షకులను ఆకట్టుకుని చార్ట్‌బస్టర్‌గా నిలిచాయి. ఇప్పుడు 'సుర సుర' పాటతో ఫెస్టివ్ వైబ్‌ను ఈ సినిమా అందించనుంది.పాన్ ఇండియా స్థాయిలో 'నాగబంధం' చిత్రం జూలై 3న విడుదల కానుంది.

# కొత్త తరహా క్రైం థ్రిల్లర్ ఎం4ఎం

## నిర్మాత, దర్శకుడు మోహన్ వడ్లపట్ల



సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. అయితే ఇప్పటివరకు టాలీవుడ్‌లో పెద్దగా చూడని వినూత్నమైన సైకాలజికల్ క్రైమ్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రంఎం 4 ఎం (మోటివ్ ఫర్ మర్డర్ ). విడుదలైన మొదటి రోజునుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా, రెండో వారం కూడా విజయవంతంగా థియేటర్లలో కొనసాగుతూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. ఐఎండిబి, బుక్ మై షో వంటి ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఈ చిత్రానికి మంచి రేటింగ్స్ రావడం విశేషం. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, దర్శకుడు మోహన్ వడ్లపట్ల చిట్ చాట్ నిర్వహించారు. ప్రేక్షకులు సినిమా కథను, కాన్సెప్ట్‌ను ఎంతో ఆదరిస్తుండటం ఆనందంగా ఉంది. ముఖ్యంగా థ్రిల్లర్ జోనర్‌ను ఇష్టపడే ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. ప్రతి ఒక్కరూ సినిమాను ఎంజాయ్ చేస్తూ సస్పెన్స్‌ను ఆసక్తిగా ఫాలో అవుతున్నారు అని తెలిపారు.ఇక ఈ చిత్రంలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ 'రాధా' పాత్రలో నటించిన అమెరికన్ హీరోయిన్ జో శర్మ తన తొలి తెలుగు చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. భావోద్వేగాలు, ఉత్కంఠ, ధైర్యం కలగలిపిన పాత్రలో ఆమె చూపించిన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా కీలక సన్నివేశాల్లో ఆమె నటన సినిమాకు మరింత బలం చేకూర్చిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే సీనియర్ నటుడు శుభలేఖ సుధాకర్ తన అనుభవంతో పాత్రకు ప్రత్యేకమైన గంభీరతను తీసుకువచ్చారు.ఈ చిత్రానికి డెబ్యూ మ్యూజిక్ డైరెక్టర్ ఇస్సాయి పెట్టై అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి థ్రిల్లింగ్ సన్నివేశాన్ని మరింత ఎలివేట్ చేస్తూ ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచడంలో సంగీతం కీలక పాత్ర పోషించింది.నగరంలో వరుసగా జరుగుతున్న హత్యలు& ప్రతి హత్య తర్వాత మృతదేహాలను ప్రసిద్ధ పెయింటింగ్స్ తరహాలో అమర్చే సీరియల్ కిల్లర్& అతడిని పట్టుకునేందుకు ఏసీపీ కృష్ణ, జర్నలిస్ట్ రాధా చేసే దర్యాప్తు ఈ ఆసక్తికర అంశాలతో సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. అసలు సీరియల్ కిల్లర్ ఎవరు? అనే ప్రశ్నను ప్రేక్షకుల మనసుల్లో మొదటి నుంచి చివరి వరకు నిలబెట్టడం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచింది. సస్పెన్స్, మిస్టరీ, సైకాలజికల్ ఎలిమెంట్స్ సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శించబడుతుండగా, త్వరలోనే ఒక ప్రముఖ ఓటిటి ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని మోహన్ వడ్లపట్ల పేర్కొన్నారు.

# రీ-రికార్డింగ్‌లో 'స్లమ్ డాగ్'



డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ స్టార్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్ డాగ్' షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. '33 టెంపుల్ రోడ్ అనే ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్త నటిస్తుండగా, టబు, దునియా విజయ్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాల కోసం ఇచ్చిన ఇంటెన్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లతో ప్రసిద్ధి చెందిన ఆయన, ఈ చిత్రానికి కూడా పవర్ ఫుల్ సంగీతాన్ని అందిస్తున్నారు. హర్ష వర్ధన్ సారథ్యంలో ప్రస్తుతం రీ రికార్డింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రీరికార్డింగ్ పనులను పూరి జగన్నాథ్ దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్నారు.తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నారు.

# పెట్రో ధరల పెంపుతో ప్రజలపై మరో భారం

## మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెట్రో ధరల పెంపుతో ప్రజలపై నరేంద్ర మోదీ ప్రభుత్వ మరో భారం మోపిందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ పెట్రో ధరల పెంపు ప్రజలపై మరింత భారంగా మారనుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్న సమయంలో కూడా దేశంలో పెట్రో ధరలను తగ్గించకుండా ప్రజలను దోచుకున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ధరలు పెరిగాయని పెంచిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

# అధిక నీటి వినియోగం నియంత్రణకు చర్యలు

## మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధిక నీటి వినియోగం ప్రాంతాల్లో అదనపు భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ప్రజలకు తాగునీటి భద్రత , ఫ్లోరైడ్ నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రిఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భూగర్భ జలాల విభాగం అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,భూగర్భ జలాల విభాగం డైరెక్టర్ లక్ష్మణ్ ,డిప్యూటీ డైరెక్టర్ పి.జ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ అన్నది అత్యంత ప్రాధాన్యతంశమని ఈ విషయంలో రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు.అదే సమయంలో నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చూడడంతో పాటు వృధా నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. 2024 తో పోల్చితే 2025 లో జలాల వినియోగం 45.93 శాతం నుండి 46.86 శాతానికి పెరిగిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భూగర్భ జలాల సంరక్షణ అనేది ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, నీటి సంరక్షణలో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేయాల్సిన ఆవశ్యకతను ఆయన అధికారులకు వివరించారు.వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేందుకు గాను ఇంకుడుగుంటల నిర్మాణాన్ని ఇబ్బడిముబ్బడిగా ప్రోత్సాహించాలని ఆయన చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల పరిమాణాలని నిరంతరం గుర్తించేందుకు వీలుగా 1,771 ఫిజోమిటర్లను వినియోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2025 సంవత్సరంలో రాష్ట్రంలో భూగర్భ జలాల రీచార్జ్ గణనీయంగా పెరిగిందని సమీక్షలో అధికారులు వెల్లడించారు. 2024లో 18.44 లక్షల హెక్టారు మీటర్లుగా ఉన్న వార్షిక రీచార్జ్ 2025లో 19.61 లక్షల హెక్టారు మీటర్లకు పెరిగి సుమారు 1.17 లక్షల హెక్టారు మీటర్ల వృద్ధి నమోదైంది. అయితే అదే సమయంలో భూగర్భ జలాల వినియోగం కూడా 8.45 లక్షల హెక్టారు మీటర్ల నుంచి 9.18 లక్షల హెక్టారు మీటర్లకు పెరిగినట్లు అధికారులు వివరించారు. తాజా భూగర్భ జలాల అంచనాల్లో అధిక వినియోగ ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాల వివరాలను జిల్లా యంత్రాంగానికి అధికారికంగా పంపించి, అక్కడ కొత్త బోర్‌వెల్ తవ్వకాలు, అదనపు భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. భూగర్భ జలాల మట్టాన్ని మెరుగుపర్చేందుకు భూగర్భ జలాల శాఖ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పరిశ్రమల శాఖల మధ్య మరింత సమన్వయం అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# కీలక సూత్రధారి అరెస్టు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యుజి 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఒక ప్రొఫెసర్‌ను పుణెలో కేంద్ర దర్యాప్తు బృందం (సిబిఐ) శుక్రవారం అరెస్టు చేసింది. 'మహారాష్ట్రలోని లాతూరు ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ పివి కులకర్ణి రసాయన శాస్త్రంలో నిపుణుడు. ఆయన గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పుణెలో నివసిస్తున్నారు. నీట్ ప్రశ్నపత్రాలను చూడడానికి ఆయనకు యాక్సెస్ ఉంది. అయినప్పటికీ ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సిబిఐ దర్యాప్తులో తెలిసింది' అని సిబిఐ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ, 'ఈ కేసులో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సాయంతో ప్రొఫెసర్ కులకర్ణి 2026 ఏప్రిల్ చివరి వారంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి, తన కోచింగ్ సెంటర్‌లో చేర్చుకున్నారు. తరువాత నీట్‌యూజీ పరీక్షలో వచ్చే ప్రశ్నలను, వాటి ఆప్షన్లను, సరైన సమాధానాలను స్వయంగా డిక్టేట్ చేశారు. ఆయన చెప్పిన ప్రశ్నలను విద్యార్థులు తమ నోట్‌బుక్స్‌లో చేతి రాతతో రాసుకున్నారు. మే 3వ తేదీన జరిగిన నీట్‌యుజి అసలు పరీక్ష పత్రంతో ఈ నోట్స్ అచ్చుగుద్దినట్లు సరిపోలింది' అని పేర్కొన్నారు. కాగా, మనీషా వాఘ్మారేను సీబీఐ మే 14న అరెస్టు చేసింది.

# జూన్ 21న మళ్లీ నీట్

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ యుజి 2026 పునఃపరీక్షను ఆదివారం, జూన్ 21, 026న నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఒక సీనియర్ అధికారి తెలిరు. పరీక్షను తిరిగి నిర్వహించేందుకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించేందుకు, గురువారం సాయంత్రం పొద్దుపోయాక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నివాసంలో జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది.

**వచ్చే ఏడాది కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తాం**

కాగా, వైద్య ప్రవేశ పరీక్షకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఆరోపణల రావడంతో సంస్కరణల్లో భాగంగా వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్ష కంప్యూటర్ ఆధారితంగా ఉంటుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, నీట్‌యుజి నిర్వహణలో ఎలాంటి అవకతవకలు బయటపడినా 'జీరో టాలరెన్స్' ఉండదని అన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అయితే జూన్ 21వ తేదీన జరిగే పరీక్ష సమయాన్ని 15 నిమిషాలు పొడిగించినట్లు ప్రధాన్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరగాల్సిన ఈ పరీక్ష, ఇప్పుడు సాయంత్రం 5:15 గంటల వరకు కొనసాగుతుంది అని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన పరీక్షా నగరాలను మళ్లీ ఎంచుకునే అవకాశం ఉంటుందని, వారికి జూన్ 14లోగా అడ్మిట్ కార్డులు అందుతాయని ఆయన చెప్పారు. విద్యార్థుల రవాణా ఏర్పాట్లను కూడా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తుందని ఆయన తెలిపారు. 'విద్యార్థుల భవిష్యత్తు మా ప్రథమ ప్రాధాన్యత. సమాజానికి, ముఖ్యంగా విద్యార్థులందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను, నిర్భయంగా పరీక్షలకు హాజరు కావాలి. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. ఈసారి అవకతవకలు జరగనివ్వం' అని ఆయన అన్నారు. గతసారి అవకతవకలు బయటపడిన తర్వాత, రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసి, దాని సిఫార్సులను అమలు చేశామని మంత్రి తెలిపారు. 'అయినప్పటికీ, ఈ సంఘటన జరిగింది. అందువల్ల, పరీక్షను రద్దు చేయడమే మా మొదటి చర్య'అని ఆయన అన్నారు. భయాందోళనలు సృష్టిస్తూ, ఆటంకాలు కలిగిస్తున్న వారికి ఒకటి చెప్పాలనుకుంటున్నానని, రాబోయే పరీక్షల ప్రక్రియకు దూరంగా ఉండాలని, లేకపోతే, వారు శిక్షను ఎదుర్కోవలసి వస్తుందని ప్రధాన్ హెచ్చరించారు.

# ముగిసిన చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణమైన జోంగ్నాన్‌హాయ్‌లో జరిగిన ఒక ప్రైవేట్ సమావేశంతో తమ చర్చలను ముగించారు. ట్రంప్ , షీ చక్కగా తీర్చిదిద్దిన ఆ ప్రాంగణంలో నడుస్తూ, మాట్లాడుకున్నారు. మధ్యమధ్యలో ఆగి, తోటలోని చెట్లను, పువ్వులను చూసి ఆనందించారు.చైనా కథనం ప్రకారం ట్రంప్ ఈ పర్యటనను 'చాలా విజయవంతమైనది, ప్రపంచ ప్రసిద్ధి చెందినది,మరచిపోలేనిది'గా అభివర్ణించారు.షీ జిన్‌పింగ్‌ను తన పాత స్నేహితుడు అని పిలుస్తూ, ఆయన పట్ల గొప్ప గౌరవం ఉందని, నిజాయితీతో కూడిన, లోతైన సంభాషణను కొనసాగించడానికి సుముఖత వ్యక్తం చేశారు.వైట్ హౌస్‌కు జిన్‌పింగ్‌కు స్వాగతం పలికేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ట్రంప్ పర్యటన ఒక చారిత్రాత్మక, మైలురాయి పర్యటన అని పేర్కొంటూ, వ్యూహాత్మక స్థిరత్వంతో కూడిన నిర్మాణాత్మక చైనా-అమెరికా సంబంధాలను నిర్మించుకోవడానికి ఇరుపక్షాలు ఒక నూతన దృక్పథాన్ని ఏర్పరచుకున్నాయని షీ జిన్‌పింగ్ అన్నారు. స్థిరమైన ఆర్థిక, వాణిజ్య సంబంధాలను కొనసాగించడం, వివిధ రంగాలలో ఆచరణాత్మక సహకారాన్ని విస్తరించడం, ఒకరి ఆందోళనలను మరొకరు సముచితంగా పరిష్కరించుకోవడం వంటి విషయాలపై తాము ముఖ్యమైన ఉమ్మడి అవగాహనలకు వచ్చినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యలపై సంప్రదింపులు, సమన్వయాన్ని బలోపేతం చేసుకోవడానికి కూడా ఇరుపక్షాలు అంగీకరించాయని షీ తెలిపారు. ఈ పర్యటన పరస్పర అవగాహనను పెంపొందించడానికి, పరస్పర విశ్వాసాన్ని మరింతగా పెంచడానికి, ఇరు దేశాల ప్రజల శ్రేయస్సును మెరుగుపరచడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. చైనా, అమెరికా దేశాలు కుదుర్చుకున్న ముఖ్యమైన ఉమ్మడి అవగాహనలను అమలు చేయాలని, కష్టపడి సాధించిన సానుకూల పురోగతిని కాపాడుకోవాలని, సరైన దిశలో పయనించాలని, ఆటంకాలకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య 'నిర్మాణాత్మక, వ్యూహాత్మక, స్థిరమైన సంబంధం కోసం నాయకులు ఒక కొత్త ఏర్పాటు చేశారని షీ అన్నారు. దీర్ఘకాలంగా ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలనే ఆకాంక్షను సూచిస్తూ, తమ చర్చల సందర్భంగా కుదిరిన ముఖ్యమైన ఏకాభిప్రాయాన్ని అమలు చేయడానికి ఇరు పక్షాలు కృషి చేయాలని ఆయన నొక్కి చెప్పారు. గురువారం కూడా ఇద్దరు నాయకులు చర్చలు జరిపారు, ఈ సందర్భంగా తైవాన్ సమస్యను సరిగ్గా నిర్వహించకపోతే ఇరు దేశాల మధ్య ఘర్షణలు, వివాదాలు తలెత్తవచ్చని ట్రంప్‌ను జిన్‌పింగ్ హెచ్చరించినట్లు చైనా ప్రభుత్వ మీడియా తెలియజేసింది.

**శాంతి, స్థిరత్వం పునరుద్ధరనే తక్షణ ప్రాధాన్యం**

చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గ్వో జియాకున్ మీడియా సమావేశంలో వివాదాస్పద అంశాలపై నాయకులు కుదుర్చుకున్న ఉమ్మడి అవగాహన వివరాల గురించిన ప్రశ్నలను దాటవేశారు. చైనా-అమెరికా నాయకుల శిఖరాగ్ర సమావేశంలో ఇరాన్ యుద్ధాన్ని ముగించడంపై షీ-ట్రంప్ అవగాహన లేదా ఒప్పందం గురించి, లేదా భవిష్యత్తులో అమెరికా చమురును కొనుగోలు చేసే ఒప్పందం గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, ప్రపంచ ఇంధన భద్రతను, పారిశ్రామిక సరఫరా గొలుసుల స్థిరత్వాన్ని సంయుక్తంగా కాపాడటానికి అన్ని పక్షాలతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని గ్వో చెప్పారు.గల్ఫ్, పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడమే తక్షణ ప్రాధాన్యత అని ఆయన అన్నారు.అమెరికాకు చైనా విలువైన రేర్‌ఎర్త్ లోహాలను సరఫరా చేయడంపై ఇద్దరు నాయకుల మధ్య ఏదైనా అవగాహన కుదిరిందా అని అడగ్గా, ప్రపంచ పారిశ్రామిక సరఫరా గొలుసుల స్థిరత్వం, భద్రతను కాపాడటానికి చైనా ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని గ్వో అన్నారు. చైనా వస్తువులపై ట్రంప్ విధించిన అధిక సుంకాలకు ప్రతీకారంగా, ఫోన్ల నుండి విమానాల వరకు అన్నింటి తయారీకి అవసరమైన రేర్‌ఎర్త్ లోహాల ఎగుమతిని చైనా పరిమితం చేసింది. చైనాకు సెమీకండక్టర్ చిప్‌ల ఎగుమతిని అమెరికా అనుమతించడంపై ఏదైనా ఒప్పందం కుదిరిందా అని ప్రశ్నించగా, బీజింగ్ తన సూత్రబద్ధమైన వైఖరిని పదేపదే స్పష్టం చేసిందని ఆయన అన్నారు.

# అమలు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు, వ్యాపారస్థులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్ ప్రవేశపెట్టిందని విమర్శించారు. కార్మికులను మళ్లీ వేల సంవత్సరాల వెనక్కి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. 8 గంటల పనిదినం, ట్రేడ్ యూనియన్లు, కనీస వేతన చట్టం తదితర కార్మికుల చట్టాలను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన చట్టాలతో అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులకు పెను ప్రమాదం పొంచి ఉందని, ప్రశ్నించే స్థాయి నుంచి బానిసలుగా మారే పరిస్థితి రానుందని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను తన గుప్పిట్లో పెట్టుకుని ఆధిపత్యం చెలాయించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తున్నారని, భారత ప్రధాని మోదీ సైతం అమెరికా చెప్పినట్లు నడుచుకుంటున్నారని అమర్ జీత్ కౌర్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఉపాధ్యక్షులు పి.ప్రేంపావని, నందూరి కరుణ కుమారి, రాష్ట్ర కార్యదర్శులు పల్లా దేవేందర్ ఎస్.విలాస్, టేకుమల్ల సమ్మయ్య, శింగు నర్సింహ్మా రావు, వై.ఓమయ్య తదితరులు పాల్గొన్నారు.

# 26న కేరళకు రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాలపైకి రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా వాతావరణ కార్యాలయం పేర్కొంది. 'భారత ప్రధాన భూభాగంపైకి నైరుతి రుతుపవనాల పురోగతి కేరళలో రుతుపవనాల ఆరంభంతో గుర్తించబడుతుంది. ఇది వేడి, పొడి కాలం నుండి వర్షాకాలానికి మారడాన్ని సూచించే ఒక ముఖ్యమైన సూచిక అని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. రుతుపవనాలు ఉత్తరం వైపు పురోగమిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాలలో మండే వేసవి ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం లభిస్తుందని తెలిపింది. నాలుగు నెలల రుతుపవన కాలం దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతాన్ని అందిస్తుంది. ఇది వ్యవసాయం, పంటలకు, మొత్తం ఆర్థిక వ్యవస్థకు, అలాగే జలాశయాలు, భూగర్భ జలాలను పునరుజ్జీవింపజేయడానికి చాలా కీలకం. ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. రుతుపవన మాసాలలో దేశంలో 80 సెం.మీ. వర్షపాతం కురిసే అవకాశం ఉండగా, దీర్ఘకాల సగటు (1971–2020) ప్రకారం ఈ కాలంలో వర్షపాతం 87 సెం.మీ.గా ఉంది. దేశంలో తక్కువ వర్షపాతానికి కారణమయ్యే ఎల్ నినో పరిస్థితులు ఏర్పడటం దీనికి కారణం కావచ్చని ఐఎండి తెలిపింది. మే 1న విడుదల చేసిన తన నెలవారీ అంచనాలో, భూమధ్య రేఖ పసిఫిక్‌పై నెలకొన్న ఎల్ నినోసదరన్ ఆసిలేషన్ (ఇఎన్‌ఎస్‌ఒ) తటస్థ పరిస్థితులు ఎల్ నినో పరిస్థితుల వైపు పరిణామం చెందుతున్నాయని ఆ శాఖ పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com